




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 01 ఆదివారం జూన్,2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 257
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# మిస్ వరల్డ్-2025 విజేతగా సుచాత చువాంగ్

- మిస్ వరల్డ్‌గా చరిత్ర సృష్టించిన థాయ్ లాండ్ సుందరి
- 16 ఏళ్ల ప్రాయంలో క్యాన్సర్‌కు గురైన సుచాత
- బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కల్పిస్తున్న థాయ్‌సుందరి
- మిస్‌ఫెమినాఇండియా నందినీగుప్తా 8వరౌండ్‌లోనే ఔట్
- జడ్జీల ప్యానెల్‌లో సోనూసూద్,రానా,జయేశ్ రంజన్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

మిస్ వరల్డ్-2025 విజేతగా థాయ్ లాండ్ సుందరి సుచాత చువాంగ్ శ్రీ నిలిచారు. మిస్ వరల్డ్-2025 కిరీటాన్ని ఆమె సొంతం చేసుకున్నారు. దీంతో ఆమెకు ప్రపంచవ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. 2024 మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్ కోవా.. 72వ మిస్ వరల్డ్ కిరీటాన్ని సుచాతా చువాంగ్ కు ధరించారు. ఇక 3వ రన్నరప్ గా మిస్ మార్టినిక్, 2వ రన్నరప్ గా మిస్ పోలాండ్,1వ రన్నరప్ గా మిస్ పోలెండ్ నిలిచారు.

హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరిగిన 72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయిలాండ్ కు చెందిన సుచాత చువాంగ్ శ్రీ చరిత్ర సృష్టించారు. మిస్ వరల్డ్-2025 విజేతగా నిలిచారు. మిస్ వరల్డ్ గా ఎంపికైన సుచాతకు రూ.8.5 కోట్ల ప్రైజ్ మనీ దక్కనుంది. థాయ్ లాండ్ లోని పుకెట్ అనే ప్రాంతంలో సుచాత జన్మించారు. మొత్తం 108 దేశాలకు చెందిన కంటెస్టెంట్ లు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ఆమె తన 16 ఏళ్ల వయసులోనే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడినట్లు ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు సుచాత చువాంగ్. అప్పటి నుంచి థాయి లాండ్ లో బ్రెస్ట్ క్యాన్సర్ పై

# బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే బదులిస్తాం



- పాక్‌తో ఎంత వరకైనా వెళ్తాం
- భోపాల్‌లో బహిరంగ సభలో ప్రధాని మోదీ హెచ్చరిక

భోపాల్-నవభూమిబ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తోన్నారు. దేవి అహల్యాబాయి మహిళా సశక్తీకరణ్ సమ్మేళన్‌లో పాల్గొన్నారు. దతియా, సత్నా ఎయిర్ పోర్టులు సహా పలు ప్రాజెక్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భోపాల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తో కలిసి ప్రసగించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సింధూర్ అంశాన్ని ప్రస్తావించారు ప్రధాని మోదీ. సింధూరం భారతీయ సంప్రదాయంలో మహిళా శక్తికి చిహ్నమని వ్యాఖ్యానించారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు భారతీయుల రక్తాన్ని కళ్లచూశారని, అక్కడితో ఆగకుండా దేశ సంస్కృతి సంప్రదాయాలపై కూడా దాడి చేశారని అన్నారు. దేశ మహిళా శక్తికి సవాలు విసిరారని పేర్కొన్నారు. భారత్ కు సవాల్ విసరడం అనేది- ఎంత ప్రమాదకర.. ప్రాణాంతకరమైనదో

# ఏపీ ప్రజలకు తీపికబురు

- ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త
- ఆ రెండు పథకాలకు డేట్ ఫిక్స్
- జూన్ నెల నుంచి తల్లికి వందనం పథకం అమలులోకి వస్తుంది
- హోంమంత్రి వంగలపూడి అనిత
- మహిళలకు ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నాటికి ప్రారంభం

2



అమరావతి-నవభూమిప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త. త్వరలోనే ఆ రెండు పథకాలను ప్రారంభించబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జూన్ నెల నుంచి తల్లికి వందనం పథకం అమలులోకి వస్తుందని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నాటికి ప్రారంభం కానున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి ఒక పేదవారి ఇంట్లో వంట చేసి, ఆ కుటుంబసభ్యులతో సరదా గడిపారు మంత్రి అనిత.రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ వేడుకగా జరిగింది. ప్రతి నియోజకవర్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌లు ఒకరోజు ముందే పెన్షన్లు పంపిణీ చేశారు. అయితే ఆ నియోజకవర్గంలో మాత్రం.. రాష్ట్ర హోంమంత్రి లబ్ధిదారుల ఇంటికి వెళ్లారు. ఆప్యాయంగా పలకరించారు.. కిచెన్ లోకి వెళ్లి స్వయంగా టీ కాచారు. ఆ ఛాయ్ ని వడపోసి టీ కప్పుల్లో వేసి కుటుంబ సభ్యులందరికీ అందించారు. ఆ తర్వాత పెన్షన్ అందించి వారితో కాసేపు ముచ్చటించారు. ఒక మంత్రి నేరుగా తమ ఇంటికి రావడం.. కుటుంబ సభ్యుల్లో ఒకరిగా కలిసిపోవడం.. ఆప్యాయంగా పలకరించి టీ పెట్టి ఇవ్వడమే కాదు పెన్షన్ కూడా అందించడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

# తండ్రి కోసం తనయ

- దూకుడు పెంచిన ఎమ్మెల్సీ కవిత
- బీఆర్ఎస్‌ను కాపాడుకోవడమే లక్ష్యం
- కవిత కొత్త కార్యాలయం షురూ
- కేసీఆర్ కోసం ధర్నాకు సన్నాహాలు
- తండ్రికోసం ఆరాటం..అన్నపై పోరాటం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఎమ్మెల్సీ కవిత తగ్గేదే లే అంటున్నారు. దూకుడు కొన సాగిస్తున్నారు. కవిత వ్యవహారం రోజుకో మలుపు తీసుకుంటోంది. కేటీఆర్ టార్గెట్‌గా తన కార్యాచరణ కు పదును పెడుతున్నారు. తన భవిష్యత్ రాజకీయ వేదికను బలోపేతం చేసుకుంటున్నారు. ఇదే సమయంలో తన తండ్రికి మద్దతుగా కొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరోక్షంగా తన అన్న కేటీఆర్ ను ఫిక్స్ చేస్తున్న కవిత తదుపరి అడుగులు ఆసక్తి కరంగా మారుతున్నాయి. తండ్రి పైన విధేయత చూపిస్తునే.. అన్న పైన పోరాటానికి సిద్ధమయ్యారు.

లేఖతో రాజకీయ సంచలనంగా మారిన కవిత వరుస నిర్ణయాలతో దూకుడు పెంచారు. తన తండ్రి కేసీఆర్.. బీఆర్ఎస్‌ను కాపాడుకోవటం తన లక్ష్యమని చెబుతున్న కవిత రాజకీయ అడుగులు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కవిత లేఖ తరువాత కేసీఆర్ పార్టీ ముఖ్య నేతలతో మంత్రాంగం సాగించారు. కవిత వ్యవహారంలో వేచి చూసే ధోరణితో కనిపిస్తున్నారు. అటు ఈ వ్యవహారంలో కేటీఆర్ లక్ష్యంగా కవిత అడుగులు స్పష్టంగా ఉన్నాయి. కేటీఆర్ వ్యూహాత్మకం గానే ఈ సమయం లో విదేశీ పర్యటనకు వెళ్లారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ట్వీట్లకే పరిమితం అవుతారా అంటూ తన అన్న ను టార్గెట్ చేసిన కవిత.. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే ఆందోళనలు చేయరా అంటూ నిల దీసారు. ఇప్పుడు తానే ఆ పనికి సిద్ధమయ్యారు. కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నేతల నుంచి తనకు మద్దతు లేకపోవటం.. తన అన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండటంతో తన సొంత సంస్థ జాగృతి నుంచి తన రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించారు. అందులో భాగంగా తన ఇంటి వద్దే కొత్తగా జాగృతి ప్రధాన కార్యాలయం ప్రారంభిస్తున్నారు. ఇదే సమయంలో తన తండ్రి కోసం మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తన అన్న చేయలేనిది తాను చేసి చూపిస్తానే విధంగా ఈ నిర్ణయంతో కవిత నేరుగా రంగంలోకి దిగుతున్నారు. కాళేశ్వరం కమిషన్ ప్రాజెక్టులో అక్రమాలపై విచారణ కోసం కేసీఆర్ కు నోటీసులు జారీ చేసింది. జూన్ 5న విచారణకు కేసీఆర్ హాజరు కావాల్సి ఉంది. దీనికి నిరసనగా కవిత జూన్ 4న ఇందిరా పార్క్ వద్ద ధర్నాకు నిర్ణయించారు. ఇది ఒక విధంగా కేటీఆర్ ను ఫిక్స్

# ఏపీ మెగా డీఎస్సీ.. హాల్‌టికెట్ల విడుదల

- ఏపీ మెగా డీఎస్సీ 2025 హాల్ టిక్కెట్లను విడుదల చేసిన మంత్రి లోకేష్
- అధికారిక పోర్టల్ లేదా వాట్సప్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

2



అమరావతి-నవభూమిబ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ ఏపీ మెగా డీఎస్సీ 2025 హాల్ టిక్కెట్లను నేడు మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. అభ్యర్థులుకు అధికారిక పోర్టల్ https://apdsc.apcfss.in లేదా వాట్సాప్ ద్వారా కూడా హాల్ టికెట్లు డౌన్

# శ్రీశైలానికి భారీ వరద

- కర్ణాటక సహా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాలు
- కృష్ణానదిలో పెరిగిన వరదనీరు
- నిండుకుండలా మారిన జూరాల
- జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

2



కర్నూలు-నవభూమిబ్యూరో

కర్ణాటక సహా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాల వల్ల కృష్ణానది జలకళను సంతరించుకుంది. వరదనీటితో పోటెత్తుతోంది. భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఫలితంగా జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. గరిష్ఠస్థాయి నీటిమట్టాన్ని అందుకుంది. దీనితో గేట్లను ఎత్తివేశారు అధికారులు. వరద నీటిని దిగువకు వదులుతున్నారు.

మహారాష్ట్ర, కర్ణాటకల్లో కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తోన్న విషయం తెలిసిందే. దీని ప్రభావంతో అటు గోదావరి, ఇటు కృష్ణానదికి వరద పోటుకు గురయ్యాయి. భారీగా

# బీజేపీకి కేబినెట్‌లో బెర్త్

- ఏపీలో మంత్రివర్గ విస్తరణకు కసరత్తు
- మంత్రివర్గంలో మార్పు చేర్పులు
- ముగ్గురికి కొత్తగా ఛాన్స్
- మంత్రి పదవిని ఆశిస్తున్న బీజేపీ
- జనసేన నుంచి నాగబాబుకు ఛాన్స్

2



అమరావతి-నవభూమిప్రతినిధి

ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి అవుతోంది. పాలనా - రాజకీయంగా మార్పుల దిశగా కూటమి నేతలు సిద్ధం అవుతున్నారు. మహానాడు ద్వారా పార్టీలో జోష్ పెంచేందుకు ప్రయత్నించిన టీడీపీ నాయకత్వం.. ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులను త్వరగా భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇదే సమయంలో మంత్రివర్గ విస్తరణ పైన చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. మెగా బ్రదర్ నాగబాబుకు మంత్రి పదవి పైన హామీ ఇచ్చారు. నాగబాబుతో పాటుగా బీజేపీకి మరో మంత్రి పదవి దక్కనున్నట్లు సమాచారం. ప్రస్తుత మంత్రివర్గంలోనూ మార్పులు ఉంటాయని కూటమి నేతల ద్వారా తెలుస్తోంది. కేబినెట్ ప్రక్షాళన కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తవుతోంది. దీంతో, రాష్ట్ర మంత్రివర్గంలో మార్పుల దిశగా కసరత్తు జరుగుతోంది. మెగా బ్రదర్ నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వనున్నట్లుగా స్వయంగా చంద్రబాబు

# జనంలోకి జగన్

- వరుస కేసుల వేళ కూటమికి జగన్ రిటర్న్ గిఫ్ట్
- త్వరలో జనంలోకి వెళ్లనున్న వైసిపి అధినేత జగన్
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజల్లోకి..
- ఇక పూర్తిస్థాయిలో ప్రభుత్వంపై పోరుబాట
- రంగం సిద్ధం చేస్తున్న వైసీపీ అధినేత జగన్

2



అమరావతి-నవభూమిప్రతినిధి

ఏపీ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసు కొంటోంది. మూడు పార్టీలు తమ భవిష్యత్ కోసం కొత్త వ్యూహాలను అమలు చేస్తున్నాయి. వైసీపీ లక్ష్యంగా టీడీపీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బీజేపీ పూర్తిగా పట్టు పెంచుకుంటోంది. కూటమి పాలన పైన ప్రజల్లో వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందని జగన్ అంచనా వేస్తున్నారు. వరుస కేసుల తో తమ పార్టీ కేడర్ ను ఇబ్బంది పెడుతున్నారని భావిస్తున్న జగన్.. ఇక ప్రభుత్వం పై పోరు బాటకు సిద్ధమయ్యారు. ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. ఇందు కోసం దాదాపు ముహూర్తం ఖరారైంది. ముందుగా కూటమి కంచుకోటల పైనే జగన్ ఫోకస్ చేసారు.

# అంగన్‌వాడీ టీచర్లకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

- అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచుతూ కీలక నిర్ణయం
- అంగన్ వాడీ టీచర్ల రిటైర్ మెంట్ బెనిఫిట్స్‌ను రూ. లక్ష నుంచి రూ. 2 లక్షలకు పెంపు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ వయసును 65 సంవత్సరాలకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాక అంగన్ వాడీ టీచర్ల రిటైర్ మెంట్ బెనిఫిట్స్‌ను రూ. లక్ష నుంచి రూ. 2 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణలోని అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారి పదవీ విరమణ వయసును 65 సంవత్సరాలకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు

# జగన్ టీమ్ విస్తరణ

- కొత్త ముఖాలకు వైసీపీలో చోటు
- యువ నాయకులకు పెద్ద పీఠ వేసిన జగన్
- సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారికి ఛాన్స్

2

అమరావతి-నవభూమిబ్యూరో

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీన్ని విస్తరించింది వైఎస్ఆర్సీపీ అగ్రా నాయకత్వం. పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటైంది. పలువురు యువ నాయకులకు ఇందులో చోటు దక్కింది. సోషల్ మీడియాలో యాక్టివ్ ఉండే కొందరికీ ఈ కమిటీలో చోటు కల్పించింది.

వైఎస్ఆర్సీపీ యువజన విభాగం రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రాజానగరం మాజీ శాసన సభ్యుడు జక్కంపూడి రాజా నియమితులయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి కొనసాగుతున్నారు. నంద్యాల జిల్లాకు ఆయన ప్రాతినిధ్యాన్ని వహిస్తోన్నారు. తిరుపతి జిల్లా నుంచి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా అపాయింట్ అయ్యారు.

ఉపాధ్యక్షులుగా.. మెంటాడ స్వరూప్ కుమార్- శ్రీకాకుళం, మేరుగు చందన్ నాగ్- ప్రకాశం, రేగం చాణక్య- అల్లూరి సీతారామరాజు, షేక్ షఫీవుల్లా- వైఎస్ఆర్ కడప నియమితులయ్యారు.

జోనల్ అధ్యక్షులుగా.. అంబటి నాగ వినాయక శైలేష్ (అంబటి శైలేష్)- విశాఖపట్నం, దాడిశెట్టి శ్రీనివాస్- కాకినాడ, కల్లం హరికృష్ణ రెడ్డి- గుంటూరు, మారెడ్డి

# సినిమాలకు కమల్ గుడ్‌బై?

- అప్పుడే సినిమాలు వదిలేస్తానన్న లోకనాయకుడు
- రిటైర్మెంట్ ఎప్పుడో ప్రకటించిన కమల్ హాసన్ !
- తనను మించిన నటుడు వస్తే సినిమాలు వదిలేస్తా

2



చెన్నై-నవభూమిబ్యూరో

లోక నాయకుడు “కమల్ హాసన్” గురించి పరిచయం అక్కర్లేదు. సినీ పరిశ్రమలో ఆల్ టైం బెస్ట్ యాక్టర్స్‌లో ఆయన కూడా ఒకరు అనడంలో సందేహం అక్కర్లేదు. తమిళంతో పాటు తెలుగు, హిందీ సహా పలు భాషల్లోనూ నటుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రస్తుతం సినిమాలతో పాటు రాజకీయ రంగంలోనూ చురుగ్గా కొనసాగుతున్నారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్ | ఆదివారం | 01 । జూన్ । 2025

# ఉద్యాన డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు.. జూన్ 26 వరకు దరఖాస్తులు



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో 2025-26 విద్యాసంవత్సరానికి ఆదిలాబాద్ జిల్లాలోని దాస్నాపూర్, పెద్దపల్లి జిల్లా రామగిరి ఖిల్లా, నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్, సూర్యాపేట జిల్లా గడ్డిపల్లిలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. శనివారం ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు.ఆంగ్ల మాధ్యమంలో నిర్వహించే ఈ కోర్సుల్లో 60 శాతం గ్రామీణ, 40 శాతం పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సీట్లు కేటాయించామని వర్సిటీ రిజిస్ట్రార్ భగవాన్ తెలిపారు. విద్యార్హతలు, ఫీజు, ఇతర వివరాల కోసం తమ వెబ్‌సైట్ www.skltghu.ac.inలో చూడాలని వెల్లడించారు. ఏవైనా సందేహాలు ఉంటే మొబైల్ నంబర్లు.. 9603268682, 91215 57037, 93981 66973, 70751 20145 లేదా యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించ వచ్చని పేర్కొన్నారు.

## నవ వార్త



## బీఆర్ఎస్ బీజేపీలో కలిసే ప్రసక్తే లేదు.. తేల్చిచెప్పిన ఎమ్మెల్సీ మధుసూదనాచారి



**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో కలవబోతుంది అనే కొంతమంది వ్యక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిసున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మధుసూద నాచారి మీడియాతో మాట్లా డారు.ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ వ్యతిరేకంగా టీడీపీ ఆవిర్భావం జరిగింది. ప్రతికూల పరిస్థితుల్లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించారు. తెలంగాణ అంటే నక్సలైట్లు అన్న సందర్భంలో కేసీఆర్ పార్టీని పెట్టారు. కాంగ్రెస్, టీడీపీలకు ధీటుగా టీఆర్ఎస్ ఆవిర్భావం జరిగింది. ఇద్దరు బలమైన నాయకులు చంద్రబాబు, వైఎస్ఆర్‌ను కేసీఆర్ ఎదుర్కొన్నారు. తెలంగాణ సాధించి కేసీఆర్ సీఎం అయ్యి అభివృద్ధి చేశారు. బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చాలని కుట్ర పూరితంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడవని ఆయన స్పష్టం చేశారు.

## మిస్ వరల్డ్-2025 విజేతగా సుచాత చువాంగ్

**(1వపేజీ తరువాయి)** అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మిస్ వరల్డ్-2025 పోటీల్లో చరిత్ర సృష్టించిన సుచాత చువాంగ్ శ్రీ కి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.ఇక ఈ ఫైనల్ పోటీలకు సోనూ సూద్, సుధారెడ్డి, 2014 మిస్ ఇంగ్లండ్ కరీనా జడ్జిలుగా ఉన్నారు. మిస్ వరల్డ్ జడ్జిల ప్యానెల్ హెడ్ గా మిస్ వరల్డ్ సంస్థ ఛైర్మన్ జూలియా మోర్లీ ఉన్నారు. ఇక మిస్ వరల్డ్ జడ్జిల ప్యానెల్ లో రానా దగ్గుబాటి,జయేశ్ రంజన్ కూడా ఉండటం విశేషం. ఇక సోనూసూద్ కు మిస్ వరల్డ్ హుమానిటేరియన్ అవార్డు లభించింది. ఈ అవార్డును టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి సోనూసూద్ కు అందించారు.

## విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు.. జూన్ రెండో వారం నుంచి విస్తారంగా వర్షాలు

**హైదరాబాద్-నవభూమి:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతోపాటు వాయుగుండం ప్రభావం కూడా కనిపిస్తున్న నేపథ్యంలో వాతావరణశాఖ కీలక ప్రకటన చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయని తెలిపింది. రుతుపవనాల రాకతో జూన్ రెండోవారం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని అంచనావేసింది. రుతుపవనాలు విస్తరిస్తుండటంతో ఏపీ, తెలంగాణలో మరో వారం రోజులపాటు వర్షాలు ఇలాగే కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది.

## జగన్ టీమ్ విస్తరణ

**(1వపేజీ తరువాయి)**వెంకటాద్రి రెడ్డి- ప్రకాశం, పిట్టా హేమంత్ రెడ్డి- చిత్తూరు, ఎల్లారెడ్డిగారి ప్రణయ్ రెడ్డి- అనంతపురం అపాయింట్ అయ్యారు.ప్రధాన కార్యదర్శులుగా.. కొంగర మురళీ కృష్ణ- అల్లూరి సీతారామరాజు, గౌరా శ్రీహరి- కృష్ణా, దండమూడి రాజేష్- ఎన్టీఆర్, గాలివీటి వివేకానందరెడ్డి- అన్నమయ్య రాయచోటి, కోటగిరి సందీప్- ఏలూరు, కడివేటి చంద్రశేఖర్ రెడ్డి- నెల్లూరు, పలిశెట్టి సురేష్ రాజ్ కుమార్- అనకాపల్లి, కంద్రేగుల సీహెచ్ అచ్యుతరామారెడ్డి- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ నియమితులయ్యారు.

## అంగన్‌వాడీ టీచర్లకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

**(1వపేజీ తరువాయి)**సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ సర్కార్ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లు సంతోషం వ్యక్తం చేశారు.

అంగన్ వాడీ టీచర్ల రిటైర్ మెంట్ బెనిఫిట్స్ ను రూ. లక్ష నుంచి రూ. 2 లక్షలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అలాగే హెల్పర్ల రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రూ. 50వేల నుంచి రూ. లక్షకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 60 ఏళ్లు దాటి వీఆర్ఎస్ తీసుకునే టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో 70వేల మందికి లబ్ధి చేకూరనుంది.

## ఏపీ సర్కారు అలా చేస్తుంటే రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు: మాజీ ఎమ్మెల్సీ కవిత

**(1వపేజీ తరువాయి)**తెలంగాణలో మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. బంజారాహిల్స్‌లో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత మాట్లాడుతూ.. సంస్థ భవిష్యత్ కార్యచరణతో పాటు ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని తరలించుకుపోతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.కేసీఆర్, ఆచార్య జయశంకర్ ల స్ఫూర్తితో తెలంగాణ జాగృతి ఏర్పడిందని.. ఈ సంస్థను ప్రారంభించి నేటికి 18 సంవత్సరాలు పూర్తయింది అని వెల్లడించారు. ఈ ప్రయాణంలో ఎంతోమంది ఆశీస్సులు తమకు లభించాయని.. అనేక ఉద్యమాల ఫలితంగా ఎన్నో జీవోలు కూడా వచ్చాయని తెలిపారు. కేసీఆర్‌కు తాము అండగా ఉంటామని కవిత స్పష్టం చేశారు. కేసీఆర్ కి తెలంగాణ జాగృతి, బీఆర్ఎస్ రెండు కళ్లలాంటివని చెప్పుకొచ్చారు. ఆయనపై ఈగ వాలినా మేం సహించం. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే అది యావత్ తెలంగాణ ప్రజానీకానికి నోటీసులు ఇచ్చినట్లేనని స్పష్టం చేశారు.

గత పదేళ్ల కేసీఆర్ పాలనకు, ఇప్పటి కాంగ్రెస్ పాలనకు చాలా తేడా ఉందని కవిత ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలని.. తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించాలని కోరారు. కనీసం జూన్ 2న జరగబోయే రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా ఆయన 'జై తెలంగాణ' నినాదం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అంతే కాకుండా జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

# ఏకంగా ఎస్సై మెడలోనే గోల్డ్ చైన్ కొట్టేసిండు



**హైదరాబాద్-నవభూమి:**అసలే బంగారం ధర కొండెక్కి కూర్చుంది. ఈ సమయంలో పిసరంత గోల్డ్ పోయినా.. ఆ బాధ వర్ణణాతీతం. అలాంటిది తులాలలకు తులాల బంగారం పోతే ఇంకేమన్నా ఉందా.. ప్రాణం పోయినంత బాధ కలుగుతుంది. కానీ ఈజీ మనీకి అలవాటు పడ్డ వారికి ఈ బాధలు పట్టవు. సైలెంట్‌గా వచ్చి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు లాక్కెళ్లిపోతారు. ఆ తర్వాత ఎంత మొత్తుకున్న ప్రయోజనం ఉండదు. ఇక కొందరు దర్జాగా పట్టపగలే ఇళ్లలో దూరి భద్రంగా దాచిన బంగారం తీసుకుని ఉడాయిస్తారు.ఆ తర్వాత బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి గోడు చెప్పుకుని.. ఫిర్యాదు చేస్తారు. అదృష్టం బాగుంటే పోయిన బంగారం దొరుకుతుంది. లేదంటే ఆశ వదిలేసుకోవాల్సిందే. కొంత కాలంగా నగరంలో చైన్ స్నాచింగ్, బంగారం దొంగతనం కేసులు పెరుగుతున్నాయి. అయితే తాజాగా మాత్రం కాస్త విస్తుపోయే ఘటన చోటు చేసుకుంది. ఓ వ్యక్తి ఏకంగా ఎస్సై మెడలో నుంచి బంగారు చైన్ కొట్టేసి పరారయ్యాడు. ఆ వివరాలు..బస్సులో ప్రయాణిస్తున్న ఓ ఎస్ఐ మెడలోంచి గోల్డ్ చైన్ కొట్టేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ సైఫాబాద్ పోలీసులు తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ సీఆర్పీఎఫ్ కాలనీలో ఉండే నేనవత్ చంద్రు నాయక్ (52) అనే వ్యక్తి బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు నివాసం ఉండేది రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సీఆర్పీఎఫ్ కాలనీలో. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం అనగా మే, 26న చంద్రు నాయక్ డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లడం కోసం సిద్ధమయ్యాడు. దీనిలో భాగంగా లక్డీకాపూల్‌లో బస్సు ఎక్కాడు. బస్ ఎక్కి.. అసెంబ్లీ ఎదురుగా ఉన్న ఆల్ ఇండియా రేడియో స్టేషన్ దగ్గరకు వచ్చిన తర్వాత అనుమానం వచ్చి తన మెడ తడిమి చూసుకున్నాడు. ఇంకేముంది.. అప్పటికే చంద్రు నాయక్ మెడలో ఉన్న తులం బంగారు గొలుసు మాయం అయ్యింది. దాంతో తీవ్రంగా ఆందోళన చెందాడు. వెంటనే బస్సులో ఉన్న వారందరని చెక్ చేశాడు. కానీ లాభం లేకపోయింది. అప్పటికే దొంగ పరారయ్యాడు. చేసేదేం లేక.. సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కానీ ఎస్ఐకే తెలియకుండా అతడి మెడలోని చైన్ కొట్టేసిన దొంగ తెలివి మామూలుగా లేదంటున్నారు ఈ వార్త తెలిసిన జనాలు. మరి ఈ దొంగతనం చేసిన వ్యక్తి దొరుకుతాడో లేదో చూడాలి.

# హైదరాబాద్ శివారులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్..



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడుతూ.. వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అందుకు తగిన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. నగర జనాభా, వాహనాల రద్దీ పెరుగుదలకు అనుగుణంగా రోడ్లు, రవాణా, పారిశుధ్యం, తాగునీరు వంటి కీలక రంగాల్లో పనులు వేగవంతం చేస్తోంది. ఇక నగర ప్రజల అవసరాలు తీర్చేందుకు మార్కెట్లు కూడా సిద్ధం చేస్తుంది.దేశంలోనే నంబర్‌వన్ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కోహెడ వద్ద నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సెక్రటేరియెట్లో కోహెడ మార్కెట్ అంశంపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. కోహెడ మార్కెట్‌ను దేశంలోనే రోల్ మోడల్ మార్కెట్‌గా నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని సీఎస్ వెల్లడించారు. ఇది ప్రభుత్వానికి ఒక 'డ్రీమ్ ప్రాజెక్టు' అని అన్నారు. కోహెడ మార్కెట్‌ను 250 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో నిర్మించనున్నారు. ఇందులో కోల్డ్ స్టోరేజ్‌లు (శీతల గిడ్డంగులు), విశాలమైన షెడ్లు, వెడల్పైన రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఉంటాయని సీఎస్ సూచించారు. తెలంగాణలో విస్తారంగా పండే మామిడి, బత్తాయి, పండ్లు, కూరగాయలు వంటి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచేలా, రైతులు, వినియోగదారులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయం కల్పించడం ఈ మార్కెట్ ప్రధాన లక్ష్యమన్నారు. కోహెడ మార్కెట్ ఏర్పాటుకు రూ.2890 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు సీఎస్‌కు తెలిపారు. భూ సేకరణ, రోడ్లు, ఆధునిక షెడ్లు, సోలార్ రూఫ్ టాప్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లతో పాటు ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఈ నిధులు అవసరమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో కమిషనర్, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ సురేంద్ర మోహన్, అదనపు డైరెక్టర్ లక్ష్మీ బాయి, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా రైతులు, వినియోగదారులకు గణనీయమైన ప్రయోజనాలను చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు.

# బీజేపీకి కేబినెట్‌లో బెర్తు

**(1వపేజీ తరువాయి)**ప్రకటించారు. ఆ తరువాత ఎమ్మెల్సీగా నాగబాబు ఎన్నికైన తరువాత మంత్రివర్గం కి తీసుకోవాలని నిర్ణయించారు. నాగబాబు ఎమ్మెల్సీ అయ్యారు. ఇప్పటి వరకు మంత్రి పదవి ఎప్పుడనేది స్పష్టత రావటం లేదు. ఇదే సమయంలో ఏడాది పాలన సమీక్షలో భాగంగా కొందరు మంత్రుల పని తీరు పై ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో, మంత్రివర్గ ప్రక్షాళన తప్పదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మారుతున్న లెక్కలు కూటమి పాలన.. క్షేత్ర స్థాయిలో పరిస్థితుల పైన సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వంలో మార్పులకు సిద్దం అవుతున్నారు. భారీ మార్పులు ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఒక మంత్రి పదవి నాగబాబుకు ఇవ్వం పైనా కొత్త చర్చ వినిపిస్తోంది. బీజేపీ సైతం తమకు రెండో పదవి ఇవ్వాలని రాష్ట్ర నేతల ద్వారా రాయబారం చేసినట్లు పార్టీ నేతల సమాచారం. కేంద్రంలో బీజేపీ నుంచి ఇద్దరు మంత్రులు ఉన్నారు. రాష్ట్రంలో బీజేపీకి రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ప్రతిపాదించినట్లు సమాచారం. దీంతో, బీజేపీకి మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయిస్తే.. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో తొలిగింపు పైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఏడాది కాలం మంత్రుల పని తీరు పైన ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తి స్థాయిలో నివేదికలు సిద్దం చేసినట్లు తెలుస్తోంది. మంత్రులుగా తమ శాఖల పైన పట్టు.. పాలనా వ్యవహారా ల్లో పని తీరు.. పార్టీ వ్యవహారాల్లో చొరవ వంటి విషయాల ఆధారంగా మంత్రుల ప్రోగ్రెస్ కార్డులను సిద్దం చేసారు. ఈ నెల 4న జరిగే మంత్రివర్గ భేటీలో వీటిని బయట పెట్టే అవకాశం ఉంది. ఆ ముగ్గురి స్థానంలో ఇక, మంత్రివర్గంలో మార్పులు భారీగా ఉంటాయనే ప్రచారం ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. దీనికి అనుగుణంగా ముగ్గురు మంత్రుల పని తీరు ఆశాజనకంగా లేదని.. ఎన్ని సార్లు చెప్పినా వారి లో మార్పు రావటం లేదని చెబుతున్నారు. అందులో ఉత్తరాంధ్ర కు చెందిన మంత్రితో పాటుగా, గోదావరి జిల్లాల్లో వివాదాల్లో చిక్కుకుంటున్న మరో మంత్రి.. అదే విధంగా సీమ ప్రాంతానికి చెంది న మంత్రి పైన ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఆశ్చర్యం అవసరం లేదనే చర్చ వినిపిస్తోంది. అయితే, ఏడాది మాత్రమే పాలన పూర్తి కావటంతో.. ఇప్పుడే మంత్రులను తొలిగించటం ప్రతికూల సంకేతాలు వెళ్తాయనే అభిప్రాయం వినిపిస్తోంది. వీరిని తెలిగిస్తే సామాజిక సమతుల్యత దెబ్బ తినకుండా కొత్త మంత్రులను ఖరారు చేయాల్సి ఉంది. దీంతో.. మంత్రివర్గ ప్రక్షాళన పైన సీఎం చంద్రబాబు తుది నిర్ణయం ఏంటనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# జనంలోకి జగన్

**(1వపేజీ తరువాయి)**కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి కానుంది. జూన్ 12 తో కూటమి ప్రభుత్వం కొలువు తీరి సంవత్సరం అవుతుంది. ఈ ఏడాది పాలన పైన ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని జగన్ అంచనాగా కనిపిస్తోంది. హామీల అమలు లో వైఫల్యం.. రెడ్ బుక్ పేరుతో వరుస కేసులతో పాలన పూర్తిగా వదిలేసారని జగన్ ఆరోపిస్తున్నారు. పార్టీ నేతలు.. కేడర్ పైన కేసులతో రాజకీయ ప్రతీకారానికి దిగుతున్నారని జగన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. అధికారంలో ఉన్న సమయంలో పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరిగిందని.. ఈ సారి ఖచ్చితంగా కార్యకర్తలకే ప్రాధాన్యత ఉంటుందని జగన్ హామీ ఇస్తున్నారు. ఈ ఏడాది కాలంలో జగన్ పరామర్శలకు మాత్రమే జిల్లాలకు వెళ్లారు. ఇప్పుడు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

జగన్ సంక్రాంతి నుంచే జనంలోకి వెళ్లాలని.. ప్రతీ పార్లమెంట్ పరిధిలో కార్యకర్తలతో రెండు రోజు ల పాటు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ప్రభుత్వానికి ఏడాది సమయం కూడా ఇవ్వకుండా ప్రజల్లోకి వెళ్లటం సరి కాదనే అభిప్రాయం పార్టీ సీనియర్ల నుంచి వ్యక్తం అయింది. దీంతో ,జగన్ జిల్లాల పర్యటనలు వాయిదా పడ్డాయి. ఇక.. వరుసగా పార్టీ నేతల పైన కేసులు నమోదు అవుతున్న వేళ పార్టీ కేడర్ లో మనోధైర్యం నింపాల్సిన అవసరం పైన పార్టీ ముఖ్య నేతలతో జగన్ తాజాగా చర్చించారు. అదే సమయంలో ప్రభుత్వానికి ఏడాది సమయం పూర్తి కావటంతో ఇక ప్రజల్లోకి వెళ్లాలని.. జిల్లాల వారీగా పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించే లా నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు దాదాపు ముహూర్తం ఫిక్స్ చేసారు.

**కూటమి కంచుకోటల్లో,,**ఇక నుంచి జిల్లాల్లోనే ఉండటం ద్వారా ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచాలని జగన్ భావిస్తున్నారు. కేసులు.. హామీల విస్మరణ గురించి నిలదీయాలని డిసైడ్ అయ్యారు. జూలై 8న వైఎస్సార్ జన్మ దినం నాడు జగన్ జిల్లాల పర్యటన ప్రారంభించాలని సూత్ర ప్రాయంగా నిర్ణయించినట్లు పార్టీ నేతల సమాచారం. తొలి విడతలో కూటమి కంచు కోటల్లోనే జగన పర్యటన ఉండేలా షెడ్యూల్ సిద్దం చేస్తున్నారు. అక్కడే తమ బలం చాటాలని భావిస్తున్నారు. అదే విధంగా ప్రతీ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలతోనూ సమావేశం కానున్నారు. గోదావరి లేదా శ్రీకాకుళం జిల్లా నుంచి జగన్ పర్యటనలు ప్రారంభం కానున్నాయి. వచ్చే వారం పల్నాడు పర్యటన తరువాత జగన్ జిల్లాల పర్యటన పైన అధికారికంగా నిర్ణయం వెలువరించే అవకాశం ఉంది.

# సినిమాలకు కమల్ గుడ్‌బై?

**(1వపేజీ తరువాయి)**మణిరత్నం దర్శకత్వంలో కమల్ నటించిన "నాయకుడు" మూవీ ఆల్ టైమ్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు మళ్లీ 38 ఏళ్ల తార్వాత వీరి కాంబినేషన్ లో "థగ్ లైఫ్" అనే చిత్రం రాబోతుంది. ఇందులో కమల్ తో పాటు శింబు, త్రిష, అభిరామి కీలక పాత్రలు పోషిం చారు. ఈ సినిమా జూన్ 5న విడుదల కానుండటంతో, కమల్ హాసన్ ప్రస్తుతం ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో కమలహాసన్ తన రిటైర్మెంట్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.గతంలో "రిటైర్మెంట్ అంటే మరణంతో సమానం" అన్న ఆయన, ఈసారి మాత్రం "ప్రస్తుతం ఉన్న లేదా వచ్చే తరం నటుల్లో ఎవరైనా తనను మించిన నటుడు ఉంటే.. తాను సినిమాలు వదిలేస్తాను అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయన అభిమానులు కమల్‌ని మించే నటుడు రాడు.. రాలేరు.. ఆయనకు రిటైర్మెంట్ అంటే మరణమే అంటూ స్పందిస్తున్నారు. మరోవైపు బెంగుళూరులో జరిగిన ఈవెంట్ లో కన్నడ భాష తమిళ్ నుంచి పుట్టింది అంటూ కమల్ వ్యాఖ్యానించారు. దీంతో ఈ వ్యవహారంపై కన్నడ ప్రజాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కమల్ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. సినిమాని బ్యాన్ చేస్తామంటూ ఉద్యమిస్తున్నారు.

## ఏపీ ప్రజలకు తీపికబురు

**(1వపేజీ తరువాయి)** వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం ఉద్ధండపురం గ్రామంలో హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ తరువాత గ్రామంలో ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్న టీడీపీ కార్యకర్త ఆవాల నాగేశ్వరరావును పరామర్శించారు. అనంతరం గోవింద్ ఇంటికి వెళ్లిన మంత్రి అనిత.. వారి కుటుంబాన్ని పలకరించారు. కిచెన్‌లోకి వెళ్లి స్వయంగా టీ కాచారు. గోవింద్ కుటుంబ సభ్యులకు చాయ్ అందించారు.ఈ సందర్భంగా హోంమంత్రి అనిత రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలు పెట్టిన భిక్షతోనే నేను ప్రజలకు సేవ చేస్తున్నాను అని అన్నారు. జూన్ 01 సెలవు కావడంతో, ఫించన్‌లను ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాయకరావుపేట పట్టణంలో అన్నా క్యాంటీన్‌కి శంకుస్థాపన చేశానని, త్వరలో నక్కపల్లి ప్రభుత్వ హాస్పటల్ వద్ద కూడా అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని హోంమంత్రి అనిత తెలిపారు. తాగునీటి, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టాల్లో ఉన్నా, ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు అనిత. ఉద్ధండపురం జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సీసీ కెమెరాలు, స్టాఫ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను హోం మంత్రి అనిత ఆదేశించారు.

## బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే బదులిస్తాం

**(1వపేజీ తరువాయి)**ఆపరేషన్ సింధూర్ ద్వారా శత్రుదేశానికి తెలియజేశామని మోదీ అన్నారు. ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలు, వాటి యజమానులకు ముఖం పగలిలా సమాధానం ఇచ్చామని పేర్కొన్నారు. పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారం తీర్చుకోవాలని, శత్రుదేశానికి వ్యతిరేకంగా పోరాడాలని దేశం మొత్తం కోరిందని ప్రధాని మోదీ చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా 140 కోట్ల మంది ప్రజలు ప్రజలు ఒక్కటయ్యారని, ఏకతాటిపైకి వచ్చారని ఆయన గుర్తు చేశారు. బుల్లెట్ కు బుల్లెట్ తోనే సమాధానం ఇవ్వాలని ఒక్కసారిగా గర్జించారని పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ లో బీఎస్ఎఫ్ పెద్ద పాత్ర పోషించిందని మోదీ కితాబిచ్చారు. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ జవాన్లు రెప్పవాల్చకుండా పహారా కాశారని ప్రశంసించారు. సరిహద్దు కాల్పులకు తగిన సమాధానం ఇచ్చారని, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుండి శత్రువుల పోస్టులను నాశనం చేశారని అన్నారు. దేశ చరిత్రలో ఉగ్రవాదులపై జరిగిన అతిపెద్ద విజయం ఆపరేషన్ సింధూరేనని వ్యాఖ్యానించారు మోదీ. పాకిస్తాన్ సైన్యం ఎప్పుడూ ఊహించని ప్రాంతాల్లో దేశ సాయుధ దళాలు దాడులు జరిపాయని, ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశాయని చెప్పారు. ఉగ్రవాదుల సహాయంతో ప్రాక్సీ యుద్ధం అస్సలు ఆమోదయోగ్యం కాదనే విషయాన్ని ఆపరేషన్ సింధూర్ తెలియజేసిందని అన్నారు. ఇప్పుడు పాకిస్తాన్ భూభాగంలోనే ఆ దేశంపై దాడి చేయడానికీ వెనుకాడబోమని ప్రధాని హెచ్చరించారు. ఉగ్రవాదులకు సహాయం చేసే వారు కూడా భారీ మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. భారత్ పై కన్నెత్తి చూడటానికి ఉగ్రవాద సంస్థలు భయపడే స్థితికి వచ్చాయని చెప్పారు.

## తండ్రి కోసం తనయ

**(1వపేజీ తరువాయి)**చేయటమే. ఇదే సమయంలో కేటీఆర్ కంటే తాను సమర్థురాలినని నిరూపించుకునే ప్రయత్నం లో కవిత ఉన్నట్లు స్పష్టం అవుతోంది.

## బీజేపీకి కేబినెట్‌లో బెర్తు

**(1వపేజీ తరువాయి)**లోడ్ చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీతో లాగిన్ అయి వారి హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఏపీ డీఎస్సీ హాల్ టికెట్ విడుదల సందర్భంగా మంత్రి లోకేష్ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. 'మెగా డీఎస్సీ నిర్వహణ పట్ల మా నిబద్ధత నెరవేరింది. డీఎస్సీలో అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలి' అని ఆకాంక్షించారు.ఏపీ మెగా డీఎస్సీ హాల్ టికెట్లు రిలీజ్ అయ్యాయి. అధికారిక వెబ్‌సైట్ cse.ap.gov.inలో అందుబాటులోకి వచ్చాయి. అయితే, ఈసారి అధికారులు వాట్సప్ ద్వారా కూడా అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. 95523 00009కు మెసేజ్ చేస్తే చాలు. హాల్ టికెట్లు పొందవచ్చని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లోని 16,347 టీచర్ పోస్టుల ప్రభుత్వం ఈ నియామకం ద్వారా భర్తీ చేయనుంది. స్కూల్ అసిస్టెంట్ సెకండరీ గ్రేడ్ టీచర్ శిక్షణ పొందిన గ్రాడ్యుయేట్ టీచర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ ,ప్రిన్సిపాల్స్ పోస్టులు భర్తీ చేసేందుకు జూన్ 6 నుంచి 30 వరకు సీబీటీ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. . మొత్తం 3,35,401 మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేశారు.

## శ్రీశైలానికి భారీ వరద

**(1వపేజీ తరువాయి)**వరదనీరు వచ్చి చేరుతోంది. కృష్ణా ఉపనదులు ఘటప్రభ, మలప్రభ, భీమా, తుంగ, భద్ర సైతం పొంగిపొర్లుతున్నాయి. కర్ణాటకలోని ఉత్తర కన్నడ, బెళగావి, హావేరి, విజయపురా, బాగల్‌కోటె, కలబురగి, బళ్లారి.. వంటి జిల్లాల్లో అతి భారీగా వర్షాలు కురిశాయి. ఆయా ప్రాంతాలన్నీ కూడా కృష్ణా బేసిన్ పరిధిలోకి వచ్చేవే. అటు మహారాష్ట్రలోనూ కృష్ణా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో ఏకధాటిగా వర్షాలు పడుతున్నాయి.ఫలితంగా కృష్ణానది ఉరకలేస్తోంది. కర్ణాటకలో దీనిపై నిర్మించిన ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. ఆలమట్టి, నారాయణ్‌పూర్ ప్రాజెక్టులు గరిష్ఠ నీటి మట్టానికి చేరుకున్నాయి. దీనితో కొద్ది రోజుల కిందటే వాటి గేట్లను ఎత్తివేశారు కర్ణాటక జలవనరుల అధికారులు. లక్షకు పైగా క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.దీని ప్రభావం తెలంగాణపై పడింది. జూరాల ప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరుకుంటోంది. జూరాల ఇన్‌ఫ్లో 65,000 క్యూసెక్కులుగా రికార్డయింది. ఈ ప్రాజెక్టు గరిష్ఠ స్థాయి నీటి మట్టం 318.51 అడుగులు.. ప్రస్తుతం 317 అడుగుల నీటిమట్టం అందుకుంది. ఈ కొద్దిరోజుల్లోనే ఆరు టీఎంసీలకు పైగా వరదనీరు జూరాలకు వచ్చి చేరింది.దీనితో అధికారులు రెండు రోజుల కిందటే జూరాల ప్రాజెక్టు గేట్లను ఎత్తివేశారు. వరదనీటిని దిగువకు వదులుతున్నారు. మరోవంక- జల విద్యుత్ కేంద్రానికి పని చెప్పారు. 365 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని చేపట్టినట్లు తెలంగాణ జెన్‌కో వెల్లడించింది.ఈ వరద ప్రవాహం శ్రీశైలం రిజర్వాయర్ కు వచ్చి చేరుతోంది. క్రమంగా నిండుతోంది డ్యామ్. గరిష్ఠ స్థాయి నీటి మట్టానికి చేరువ అవుతోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
ఆదివారం
01 । జూన్ । 2025

## తాజ్‌మహల్‌కు ప్రత్యేక రక్షణ.. యాంటీ డ్రోన్ వ్యవస్థ ఏర్పాటు



**ఆగ్రా-నవభూమి:** తాజ్‌మహల్‌కు ప్రత్యేక రక్షణ వ్యవస్థను కల్పించారు. ఆ పాలరాతి కట్టడం వద్ద యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అదనపు భద్రతలో భాగంగా ఈ ఏర్పాట్లు చేశారు. తాజ్ సెక్యూర్టీకి చెందిన ఏసీపీ సయ్యద్ ఆరిబ్ అహ్మద్ మాట్లాడుతూ.. యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను తాజ్ పరిసరాల్లో దాన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. తాజ్‌మహల్ పరిసరాల్లో ఎటువంటి డ్రోన్లను రానివ్వకుండా యంటీ డ్రోన్ వ్యవస్థను అమర్చినట్లు ఆయన చెప్పారు.తాజ్‌మహల్ చుట్టూ 500 మీటర్ల మేర యాంటీ డ్రోన్ వ్యవస్థ నిఘా ఉంటుందన్నారు. తాజ్ నుంచి 500 మీటర్ల చుట్టూ ఎటువంటి డ్రోన్ కనిపించినా దాన్ని గుర్తించి, ధ్వంసం చేస్తుందని ఆరిబ్ చెప్పారు. వాస్తవానికి యాంటీ డ్రోన్ వ్యవస్థ.. సుమారు 8 కిలోమీటర్ల పరిధి వరకు పనిచేస్తుందని, కానీ తాజ్ పరిసరాలను సెక్యూర్టీ సున్నిత ప్రదేశంగా భావిస్తూ కేవలం 500 మీటర్ల పరిధికే పరిమితం చేసినట్లు అహ్మద్ తెలిపారు.రేడియో ఫ్రీక్వెన్సీ, జీపీఎస్ సిగ్నల్ జామ్ టెక్నాలజీ ద్వారా యాంటీ డ్రోన్ వ్యవస్థ.. డ్రోన్లను కూల్చుతుందని ఆయన తెలిపారు. డ్రోన్ కూలిపోగానే అక్కడకు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం వెళ్తుందని, తర్వాత ఆ లొకేషన్‌ను ఆధీనంలోకి తీసుకుంటారని చెప్పారు. డ్రోన్‌ను ఆపరేట్ చేసిన వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిపారు.వీఐపీలు, ప్రఖ్యాత ప్రదేశాలకు భద్రత కల్పించేందుకు యూపీ పోలీసు శాఖ యాంటీ డ్రోన్ వ్యవస్థలను వినియోగిస్తున్నది. ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళా, ఆ తర్వాత గత ఏడాది అయోధ్యలో జరిగిన రామ మందిరం ఓపెనింగ్ సెర్మనీ సమయంలో హై టెక్నాలజీ యాంటీ డ్రోన్ వ్యవస్థలను వాడారు.

## బంగ్లాలోఎన్నికలతో సంబంధం లేకుండా అధికారాన్ని అనుభవిస్తున్నారు

ఎన్నికలు డిసెంబరులోనే జరగాలంటూ ఖలీదా జియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) నిర్వహించిన భారీ ప్రదర్శన అక్కడి రాజకీయ పరిస్థితులకు అద్దంపడుతోంది. బిఎన్‌పి కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఖలీదా కుమారుడు అయిన తారిఖ్ రహ్మాన్ లండన్ నుంచి ఒక వీడియో లింక్ ద్వారా వేలాదిమంది కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. గత పదినెలల కాలంలో మహ్మద్ యూనిస్ ప్రభుత్వాన్ని బిఎన్‌పి ఎన్నడూ ఇంతగా తప్పుబట్టలేదు. తాత్కాలిక ప్రభుత్వాలంటే ఓ మూడునెలల్లో ఎన్నికలు జరిపి, ప్రజలు ఎన్నుకున్నవారికి అధికారం అప్పగించాలే తప్ప, ఏళ్ళకు ఏళ్ళు దేశాన్ని పాలించవని ఆయన విమర్శించారు. ఎన్నికలతో సంబంధం లేకుండా అధికారాన్ని అనుభవిస్తున్నవారు విదేశాంగ విధానాన్ని ఎలా నిర్ణయిస్తారు, దేశభవిష్యత్తుతో ముడివడిన కీలక నిర్ణయాలు ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. నోబెల్ విజేత మహ్మద్ యూనిస్‌కు పదవీకాంక్ష పట్టుకుందని, ఎన్నికల నిర్వహణను కుట్రపూరితంగా వాయిదావేస్తూ, అధికారాన్ని అనుభవిస్తున్నారన్న అర్థం వచ్చేలా తారీఖ్ వ్యాఖ్యలు చేశారు. డిసెంబరులో ఎన్నికలు జరపాలన్న ఈ డిమాండ్‌కు జవాబుగా, వచ్చే ఏడాది జూన్ లోపు గ్యారంటీ అంటూ టోక్యోలో ఉన్న యూనిస్ సమాధానం చెప్పారు. ఎవ్వరు ఏమనుకున్నా ఎన్నికలకు ఇంకొంత సమయం పడుతుందన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. డిల్లీకాదు, పిండి కాదు, బంగ్లాదేశ్‌కే ప్రాధాన్యం అంటూ ఈ ప్రసంగంలో తారిఖ్ రహ్మాన్ ఉద్ఘాటించడమే కాక, కార్యకర్తలతో పలుమార్లు నినాదాలు చేయించారు. న్యూఢిల్లీతో, రావల్పిండితో రాసుకుపూసుకోవడం కాక, బంగ్లాదేశ్ ప్రయోజనాలే తనకు ముఖ్యమని అర్థం. రేపు ఈ పార్టీ అధికారంలోకి వస్తే, ఆచరణ అలాగే ఉంటుందన్న నమ్మకం ఏ మాత్రం లేదు. పాకిస్థాన్‌తో ఖలీదాజియా కుటుంబానికి ఉన్న అనుబంధం తెలియనిదేమీ కాదు.కానీ, తాత్కాలికంగా కుర్చీలో కూర్చున్న యూనిస్ కఠిన మైన భారత వ్యతిరేకవైఖరి తీసుకొని, పాకిస్థాన్‌తో రాసుకుపూసుకు తిరుగుతున్న నేపథ్యంలో, ఆ విధానాన్ని ప్రశ్నిస్తూ, దేశానికి నష్టం జరుగుతోందని తారిఖ్ హెచ్చరించడం విశేషమైనదే. హసీనాను దేశం నుంచి వెళ్ళగొట్టి పదినెలలు అవుతున్నా ఇంకా ఎన్నికల దిశగా అడుగులుపడకపోవడం బిఎన్‌పికి ఆగ్రహం కలిగిస్తోంది. సమస్త వ్యవస్థలు కట్టకట్టుకొని అవామీలీగ్ మీద నిషేధం విధించి, ఎన్నికల్లో పాల్గొనకుండా చేసిన నేపథ్యంలో, తనకు ఇక ఎదురుండదన్న ధైర్యం బిఎన్‌పికి వచ్చింది. ఎన్నికలు వెంటనే జరిగితే తనకు ఘన విజయం ఖాయమన్న నమ్మకంతోపాటు, ఆలస్యమవుతున్న కొద్దీ కొత్తశక్తులు బలపడతాయన్న భయం దానిది. వెంటనే ఎన్నికల రోడ్‌మ్యాప్ ప్రకటిస్తేనే ప్రభుత్వానికి సహకరిస్తానని అది బెదిరిస్తోంది. హసీనా విధించిన నిషేధంనుంచి ఈ మధ్యనే బయటపడిన జమాతే ఇస్లామీ కూడా బిఎన్‌పి వాదనలనే బలపరుస్తోంది. హసీనామీద తిరుగు బాటుచేసిన విద్యార్థులంతా ఏర్పాటు చేసుకున్న జాతీయ నాగరిక్ పార్టీ (ఎన్సీపీ) మాత్రం ముందుగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం పట్టుబడుతోంది. బిఎన్‌పిని ఈ యువకులంతా అణచివేతకు, నియంతృత్వానికీ మారుపేరుగా, మరో అవామీ లీగ్‌గా అభివర్ణిస్తున్నారు. ఎన్నికలు జరిగేలోగానే సమస్తవ్యవస్థల ప్రక్షాళన పూర్తికావాలని, ఎన్నికల, రాజకీయ సంస్కరణలు సమూలంగా జరగాలని వీరు పట్టుబడుతున్నారు. మరోపక్క, దేశభద్రతకు సంబంధించిన కీలక నిర్ణయాలు మీరెలా తీసుకుంటారంటూ ఆర్మీచీఫ్ వకార్ కూడా యూనిస్‌ను ప్రశ్నిస్తున్నారు. ఆర్మీకీ, యూనిస్‌కు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొని, ఒక దశలో సైన్యం తిరుగుబాటు అవకాశాలమీద విశ్లేషణలు కూడా వెలువడ్డాయి. రొహింగ్యాలకు మానవతాసాయం, చట్టోగ్రామ్ పోర్టు విదేశీ నిర్వహణ, ఎలాన్‌మస్క్ స్టార్‌లింక్‌కు అనుమతి ఇత్యాది విషయాల్లో ఈ ఘర్షణ ఇంకా పెరిగింది. హసీనాకు వ్యతిరేకంగా ఉద్యమించి, ఆమెను దేశం విడిచిపోయేట్టుగా చేసి, అమెరికా ఆదేశాలమేరకు యూనిస్‌ను తాత్కాలిక అధినేతగా ప్రకటించడం వరకూ మనకు కనిపించిన ఏకాభిప్రాయం ఇప్పుడు లేకుండా పోవడం విచిత్రం. హసీనాపార్టీని నిషేధించి, ఆ నాయకులను జైళ్ళలో కుక్కుతున్న నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు ఎప్పుడు జరిగినా, అవి విస్తృత ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించబోవన్నది వాస్తవం.

## పరాధీనంలో తెలంగాణ పల్లెలోని భూములు:ఆందోళనలో పేద రైతులు









తెలంగాణ పల్లెలలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తర్వాత దాని కొనసాగింపుగా 1980 తరువాత తెలంగాణలో నక్సలైట్ ఉద్యమంతో గ్రామాలలో ఉన్న భూస్వాములు, జాగీర్దారులు, దేశ్‌ముకులు గ్రామాలను, భూములను వదిలి పట్టణాలకు వలస పోయిన తర్వాత ఆ గ్రామాల మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి మళ్లీ తెలంగాణ పల్లెలలో ఆనాటి వలసదారులే ఈనాడు రైతుల నుండి వందల ఎకరాలలో భూములు కొని ఫామ్ హౌస్ పేర్లతో నయా భూస్వామ్య విధానం కళ్ళ ముందే కనబడుతుంది. గతంలో అయితే భూస్వాములు ఆ గ్రామాల రైతులకు తెలిసేవారు కానీ ఇప్పటి ఫామ్ హౌస్ పట్టాదారులు ఆ గ్రామస్తులకు కనీసం పరిచయం కూడా ఉండరు అదేనేమో

ఈ ఫామ్ హౌస్ కల్చర్ తెలంగాణ పల్లెల్లో 2005 సంవత్సరం వరకు ఆ గ్రామాలలో రైతుల అవసరాల కోసం భూములు అమ్ముకుంటే పక్కన ఉన్న రైతులు గ్రామస్తుల సమక్షంలో గ్రామపంచాయతీ దగ్గర ఆ భూమికి ధర నిర్ణయించి వాయిదాల పద్ధతిలో పంటల మీద వచ్చిన ఆదాయంతో ఆరు నెలలకు ఒక కిస్తీల రూపంలో కొన్నవారు. అమ్మినవారికి డబ్బులు కట్టి సాదా బైనామా లేదా రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు. కానీ ఇప్పుడు ఏ గ్రామంలో నైనా భూములను అమ్మితే ఆ పక్కకు ఉన్న రైతు కూడా తెలియకుండా అమ్మడమే రియల్ ఎస్టేట్ వ్యాపారమా ?

**ఈ వ్యాపారంతో భూమిని రెండు రకాలుగా విభజించవచ్చు !**

1. **భూమిని నమ్ముకునేవారు రైతులు**
2. **భూమిని అమ్ముకునేవారు కొని,అమ్మేవారు వ్యాపారులు**

ఈ రియల్ ఎస్టేట్ వ్యాపార భూతం తెలంగాణ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రైతుల భూములను దవానంల దహించి వేస్తుంది. పట్టణాలలో,నగరాలలోవిదేశాలలో డబ్బు ఉండి వ్యవసాయం అంటే తెలియని వారి చేతుల్లోకి తెలంగాణ వ్యవసాయ భూములు సగానికి పైగా వెళ్లిపోయాయి. ముఖ్యంగా హైదరాబాద్ కు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల వ్యవసాయ భూములు సగం కంటే ఎక్కువగా ఆ గ్రామ రైతులు కానీ రైతుల చేతుల్లోకి వెళ్లిపోయాయి అంటే అతిశయోక్తి కాదు. తెలంగాణలో ఉన్న 80 శాతం మంది పేదలకు 10 ఎకరాలు 5 ఎకరాలు లోపు ఉన్న రైతులే ఉన్నారు. 1971లో వచ్చిన భూ పరిమితి చట్టం ప్రకారం భూస్వాముల నుండి భూములను తీసుకొని పేద మధ్యతరగతి వారికి పంచారు అదే సమయంలో భూస్వాములు , దేశముఖలు దొరలు రెడ్లు తమ ఇంట్లో పని చేసే వారి పేరు మీద , జీతగాళ్ల పేరు మీద కుక్కల పేర్ల మీద జంతువుల పేర్ల మీద కూడా భూములు రాసుకున్నారని నానుడి. మహబూబ్నగర్ నల్గొండ రంగారెడ్డి జిల్లాలో భూదాన్ బోర్డు ఆధ్వర్యంలో భూస్వాముల నుండి భూములను తీసుకొని పేదవారికి పంచిన సంఘటన అందరికీ తెలిసిందే . అదే సమయంలో కౌలుదారి చట్టం , భూ పరిమితి చట్టం రావటముతో భూస్వాములందరు కొంచెం వెనక్కి తగ్గారు. 1970- 80 దశకంలో పేదలు బడుగు వర్గాల వారు ఎకరా రెండు ఎకరాలు చొప్పున కొనుక్కొని విస్తరించుకుంటూ వచ్చారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో గరీబి హటావో కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని ఎస్సీ లు, మైనారిటీ , ఎస్టీ బీసీలకు భూ పంపిణీ చేశారు. దీంతో కొంతమేర పేద వర్గాలకు భూములు దక్కాయి. మరోవైపు భూమికోసం భుక్తి కోసం పేదవాడి విముక్తి కోసం అంటూ కమ్యూనిస్టులు కూడా పేదవారికి భూ పంపిణీ చేశారు. 1980- 90 దశకంలో నక్సలైట్లు ప్రభావములు ఉధృతంగా ఉండటంతో ఎవరు కూడా భూములు అమ్మడం కొనడం వైపు వెళ్ళలేదు . ఒకవేళ అమ్మిన తమ పక్క భూములవారికి విక్రయించే పద్ధతి కొనసాగుతుంది.

1990 నుండి 2004 సంవత్సరాలు వరకు భూములు పైన అంత శ్రద్ధ ఎవరికి లేదు . దానికి ప్రధాన కారణం సరైన వర్షాలు లేక పంటలు పండక శ్రద్ధ పెట్టలేదు . నీరు లేక కరెంటు లేక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుని అన్నమో రామచంద్ర అంటూ కాలం వెళ్లి తీశారు . 2005 తరువాత కొద్దిపాటి వాతావరణ మార్పులు జరగడం వర్షాలు సరిగా కురవటం చిన్నా పెద్దా రైతులు మళ్లీ వ్యవసాయం వైపు మొగ్గు చూపారు . అ ప్పటినుండి నక్సల్ ప్రభావం కూడా తగ్గడంతో నిన్నటి వరకు గ్రామాలు పట్టణాలు వదిలిన భూస్వాములు తిరిగి గ్రామాలకు చేరారు దీనితో భూముల ధరలు పెరుగుతూ వచ్చాయి. హైదరాబాదు నగరంలో ఐటీ రంగం విస్తరించడంతో పెట్టుబడిదారులు అందరు కూడా హైదరాబాద్ చుట్టూ 50 కిలోమీటర్ల వరకు భూముల కొగోలు ప్రారంభించారు. దీంతో ఒక్కసారిగా భూములకు ధరలు రెక్కలు వచ్చాయి . తెలంగాణ ఉద్యమ క్రమంలో 2006 నుండి 2014 వరకు కూడా భూముల ధరలు అంతంత మాత్రమే ఉన్నాయి . తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ మొత్తంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి పల్లె నుంచి పట్నం వరకు లక్షల్లో ఉన్న భూములు కోట్లకు పెరిగాయి . భారతదేశం వాసులతో పాటు ప్రపంచ దేశాల వాసులు కూడా హైదరాబాద్ నగరం కేంద్రంగా నివాసం ఉండడానికి వ్యాపారాలు చేయటానికి భూములు కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారు.

బడ వ్యాపారస్తులందరూ సినీ నటులు అందరు కూడా హైదరాబాద్ శివారులో వందల కొద్ది ఎకరాలను ఖరీదు చేసి ఫామ్ హౌస్ ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో భూముల కు దర్గా ధరల రెక్కలొచ్చి సామాన్యులకు అందనంత దూరం ఎగు రు తున్నాయి . మళ్లీ మధ్యతరగతి పేదలు భూమి నేలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ప్రతి బడా వ్యాపారి ప్రతి చోటామోటా రాజకీయ నాయకులు పట్టణాల్లో గృహాలు నివాసాలు ఉండడంతో పాటు ఫామ్ హౌస్ లు ఉండటం

ప్రెస్టేజ్ గా మారిపోయింది . ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ రింగ్ రోడ్డు రావడం, ట్రిబుల్ ఆర్ రోడ్డు విస్తరణ రావడంతో మరింత శరవేగంగా భూములకు రెక్కలొచ్చి సామాన్యులకు దూరమవుతున్నాయి .


తెలంగాణ చుట్టూ 100 కిలోమీటర్ల దూరంలో , పట్టణాల్లో మారుమూల పల్లెల్లో సైతం భూ వ్యాపారస్లు చేరుకున్నారు. ముందుగా దొరికినంత కొని

కొని ఆ తర్వాత తర్వాత విస్తరిస్తున్నారు. తెలంగాణ ప్రాంత ప్రజలకు సరియైన ఆదాయం లేక ఇంట్లో శుభకార్యం జరగాలన్న ముందుగా భూములనే విక్రయిస్తున్నారు . హైదరాబాద్ చుట్టుపక్కల 100 కిలోమీటర్ల వరకు కూడా ప్రధాన రహదారులు రహదారులు ఎక్కడ చూసినా పంట పొలాలు మాయమైపోయాయి . రోడ్డు ఇరువైపులా ఎక్కడ చూసినా రియల్ ఎస్టేట్ వ్యాపారమే సాగుతోంది. భూ పరిమితి చట్టం అమలులో లేకపోవడంతో ఒక్కొక్కరు వందలు వేల ఎకరాలు కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. నయా భూస్వామ్య విధానంతో భూములు మధ్యతరగతి వారికి దూరం అవుతున్నాయి. పేద మధ్యతరగతి కుటుంబాలు రైతులు భూమిని ఆత్మగౌరవంగా భావిస్తారు. తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయదారులకు ఒక నానుడి ఉంది. వ్యవసాయం చేస్తే ముళ్ళు కర్ర కూడా మిగలదని పెద్దలు చెప్పే సామెతలు ఉన్నాయి. అయినా సరే అదే జీవనోపాధిగా ఇంట్లో వారందరూ కూడా అదే వ్యవసాయంపై జీవనం గడిపే వారు. మారుతున్న సమాజంలో ప్రతి ఒక కుటుంబాలు తమ తమ పిల్లలకు విద్యను బోధించాలని వారు చదువుల కోసం ఖర్చు చేస్తున్నా , మరోవైపు ఆడకూతుర్ల పెళ్లిలో వ్యయం ఖరీదు కావడంతో కట్నాలు కానుకల కోసం ఉన్న భూమిలో కొంత అమ్ముకొని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు . రైతుకు ఏ కష్టం వచ్చినా భూమిని నమ్ముకుని బతుకుతున్నాడు . వస్తున్న అవసరాలకు భూమిని విక్రయించి రైతు మళ్లీ కూలీలుగా మారిపోతున్నారు . కారణాలు ఏవైనా తెలంగాణ ప్రాంత వాసులు భూములను అంచలంచెలుగా కోల్పోతున్నారు. మళ్లీ 50 సంవత్సరాలు వెనక్కి వెళ్లి భూమిలేని రైతులుగా రైతు కూలీలుగా మిగిలిపోతున్నారు .

**అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**9440037196**

## ఎల్డర్‌లైన్ 14567: సీనియర్ సిటిజన్స్ కోసం సమగ్ర సహాయం







ఎల్డర్‌లైన్ 14567, భారతదేశంలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించబడిన జాతీయ హెల్ప్‌లైన్, దాని పనితీరు, ప్రభావం, సవాళ్లు, భవిష్యత్తు సాధ్యతలపై లోతైన విశ్లేషణ అవసరం.ఎల్డర్‌లైన్ 14567 అనేది 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల సీనియర్ సిటిజన్స్ కోసం టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్, ఇది 2021 అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రారంభించబడింది. ఇది సమాచారం, సూచన, సానుభూతి ఆధారిత సహాయం, ఫిర్యాదుల పరిష్కారం, ఫీల్డ్ ఇంటర్వెన్షన్ సేవలను అందించడం ద్వారా వృద్ధుల జీవన నాణ్యతను మెరుగుపరచడం ఈ సేవ ప్రధాన లక్ష్యం. టాటా ట్రస్ట్ వంటి సంస్థలతో భాగస్వామ్యంతో నిర్వహించబడుతుంది. దీని లక్ష్యం ఒకే వేదిక ద్వారా సమగ్ర సహాయం అందించడం, పెన్షన్, ఆరోగ్య సంరక్షణ, చట్టపరమైన సహాయం, సానుభూతితో సహకరించడం, వివక్ష, దుర్వినియోగం, నిర్లక్ష్యం వంటి సమస్యలపై చర్యలు తీసుకోవడం, స్థానిక సంస్థలతో అనుసంధానం చేయడం.ఎల్డర్‌లైన్ అనేక రకాల సేవలను అందిస్తుంది. పెన్షన్ సంబంధిత సమస్యలు (జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం, రాష్ట్ర పెన్షన్ పథకాలు), ఆరోగ్య సంరక్షణ (ఆయుష్మాన్ భారత్, స్థానిక ఆసుపత్రుల సమాచారం), ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి సమాచారం అందిస్తుంది. ఒంటరితనం, ఒత్తిడి, డిప్రెషన్ వంటి భావోద్వేగ సమస్యలకు కౌన్సెలింగ్ సేవలు అందిస్తుంది. తెలుగు వంటి స్థానిక భాషలలో సేవలు అందుబాటులో ఉండటం వల్ల తెలంగాణలోని సీనియర్ సిటిజన్స్ సులభంగా సమస్యలను వ్యక్తీకరించగలుగుతారు. వివక్ష, వేధింపులు, అన్యాయంపై ఫిర్యాదులను నమోదు చేసి, జిల్లా చట్ట సేవల అధికారులకు అందజేస్తుంది. నిరాశ్రయ లేదా నిర్లక్షించబడిన వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తుంది, ఓల్డ్ ఏజ్ హోమ్స్‌లో చేర్పిస్తుంది, లేదా కుటుంబాలతో తిరిగి కలుపుతుంది. అత్యవసర సందర్భాల్లో స్థానిక ఆసుపత్రులతో సమన్వయం చేస్తుంది. కోవిడ్-19 సమయంలో వ్యాక్సినేషన్ సమాచారం, హోమ్ కేర్, వైద్య సలహాలు అందించింది.తెలంగాణలో ఎల్డర్‌లైన్ అన్ని జిల్లాలలో సేవలు అందిస్తూ, ఆర్థిక, ఆరోగ్య, మనోభావ సంబంధిత అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తోంది. రాష్ట్రంలో ఆసరా పెన్షన్ వంటి పథకాలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తుంది. తెలంగాణ వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖతో సమన్వయం చేస్తుంది. తెలుగు భాషలో సేవలు అందుబాటులో ఉండటం వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో యాక్సెసిబిలిటీ పెరుగుతుంది. హైదరాబాద్‌లో 2019లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమై, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. కోవిడ్-19 సమయంలో వ్యాక్సినేషన్ సమాచారం, హోమ్ కేర్ సేవలు, అత్యవసర వైద్య సహాయం అందించడంలో కీలకంగా వ్యవహరించింది.

ఎల్డర్‌లైన్ యొక్క ఆధికారిక సేవలలో టోల్-ఫ్రీ నంబర్, ఉదయం 8:00 గంటల నుంచి రాత్రి 8:00 గంటల వరకు అందుబాటులో ఉండే 12 గంటల సేవలు, పలు భాషలలో సేవల అందుబాటు, సమగ్ర సహాయం, స్థానిక సంస్థలతో సమన్వయం వంటి అంశాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ విజయం దాని సమర్థతను సూచిస్తుంది. అయితే, గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లోపం ఒక ప్రధాన సవాలు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, కేవలం 28% మంది సీనియర్ సిటిజన్స్ మాత్రమే సంక్షేమ పథకాల గురించి అవగాహన కలిగి ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో టెలిఫోన్ నెట్‌వర్క్ సమస్యలు, డిజిటల్ సాంకేతికత లేని వృద్ధులకు డిజిటల్ ఛానెల్‌లు ఉపయోగపడకపోవడం, కాల్ సెంటర్ సిబ్బంది పరిమితులు, రాష్ట్రాలలో అమలులో వైవిధ్యం వంటి సవాళ్లు ఉన్నాయి.2021 నుండి 2023 వరకు, ఎల్డర్‌లైన్ 1.5 మిలియన్ కంటే ఎక్కువ కాల్‌లను నిర్వహించింది, ఇందులో పెన్షన్, ఆరోగ్య సంరక్షణ, చట్టపరమైన సమస్యలు ప్రధానమైనవి. తెలంగాణలో వేలాదిమంది వృద్ధులు ఎల్డర్‌లైన్ సేవల ద్వారా సహాయం పొందగా, అందులో సుమారు 30 శాతం ఫిర్యాదులు అమానవీయ ప్రవర్తన లేదా నిర్లక్ష్యానికి సంబంధించినవిగా నమోదయ్యాయి. భవిష్యత్తులో, గ్రామీణ ప్రాంతాలలో రేడియో, టెలివిజన్, స్థానిక సమావేశాల ద్వారా అవగాహన పెంచడం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సహకరించడం, డిజిటల్ ఛానెల్‌లను సరళీకృతం చేయడం, టెలికాం సంస్థలతో సహకరించడం, కాల్ సెంటర్ సిబ్బంది శిక్షణను మెరుగుపరచడం, జిల్లా అధికారులతో రెగ్యులర్ సమావేశాలు నిర్వహించడం, డేటా ఆధారిత విధానం అవలంబించడం వంటి చర్యలు సేవలను మెరుగుపరుస్తాయి.సిటిజన్స్ సంక్షేమం కోసం ఎల్డర్‌లైన్ 14567 ఒక వరంగా నిలుస్తోంది. తెలంగాణలో ముఖ్యంగా ఆర్థిక, ఆరోగ్య, మానసిక, చట్టపరమైన అవసరాలను తీర్చడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. అవగాహన లోపం, సాంకేతిక అడ్డంకులు, స్థానిక సమన్వయంలోని వైవిధ్యాలను అధిగమించగలిగితే ఈ సేవలు మరింత ప్రభావవంతంగా మారగలవు. అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక విస్తరణ, స్థానిక సంస్థలతో సమన్వయ బలోపేతం ద్వారా భారతదేశంలోని వృద్ధుల జీవన నాణ్యతను మెరుగుపర్చే శక్తి ఇందులో ఉంది.

**మహమ్మద్ అక్బర్**
**జర్నలిస్ట్, నవభూమి దినపత్రిక**
**మహబూబాబాద్ టౌన్**

భక్తి

## భారతీయ అపోస్తులుడు



యేసు క్రీస్తు రెండువేల ఏళ్ళ క్రితం నరావతారుడైన దేవుడిగా జన్మించాడు. 33 సంవత్సరాలు ఈ భూమిమీద సంచరించాడు. సుమారు మూడున్నర ఏళ్ళపాటు సువార్తను బోధించాడు. తన సువార్త వ్యాప్తికి...

యేసు క్రీస్తు రెండువేల ఏళ్ళ క్రితం నరావతారుడైన దేవుడిగా జన్మించాడు. 33 సంవత్సరాలు ఈ భూమిమీద సంచరించాడు. సుమారు మూడున్నర ఏళ్ళపాటు సువార్తను బోధించాడు. తన సువార్త వ్యాప్తికి సహాయకులుగా పన్నెండు మంది శిష్యులను ఏర్పరచుకున్నాడు. వారిలో పేతురు, యోహాను, యాకోబు, తోమా (థామస్) ముఖ్యులు. క్రీస్తు మరణం, పునరుత్థానం తరువాత... ఆయన ప్రత్యక్ష శిష్యుడైన థామస్ భారతదేశంలో అడుగుపెట్టాడు. క్రీస్తు గురించి బోధించాడు, సేవలు అందించాడు. కేరళ (మలబారు) తీరానికి సముద్రమార్గం ద్వారా చేరుకొని, కొడంగలూరు, పలయూరు, కొక్కిమంగళం, కొల్లం, నిరనం, నీలక్కల్, పరవూరుల్లో ఏడు చర్చిలు నిర్మించాడు. తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో ఉన్న తిరువితమ్‌కోడ్ దగ్గర మరో చర్చి నిర్మాణం చేపట్టినా పూర్తి చేయలేకపోయాడు. అందుకే దాన్ని 'అరప్పల్లి' అంటారు. అంటే 'సగం' అని అర్థం.

థామస్ క్రాస్...

థామస్ హయాంలో అనేక విద్య, వైద్య సంబంధమైన కార్యక్రమాలు అనాడే భారతదేశంలో ప్రారంభమయ్యాయి. ఇక్కడ క్రైస్తవ్యం బ్రిటిష్ వారి ద్వారా వచ్చిందనేది అవాస్తవం. దానికి ఆద్యుడు థామస్. అందుకే క్రీస్తు ప్రత్యక్ష శిష్యుడైన ఆయనను 'భారతీయ అపోస్తులుడు' అని పిలుస్తారు. అపోస్తులుడు అంటే 'పంపించినవాడు' అని అర్థం. థామస్... క్రీస్తు భారతదేశానికి పంపినవాడు. భారతదేశంలో ఏడున్నర చర్చిలు నిర్మించిన థామస్ ... చెన్నైలోని లిటిల్‌మౌంట్ (శాంథోమ్ చర్చి) దగ్గర ఒక గుహలో ప్రార్థన చేసుకుంటూ ఉంటగా... అతను బతికి ఉంటే క్రైస్తవం ఇంకా ప్రబలుతుందన్న భావనతో కొందరు దుండగులు శూలంతో వెనుకనుంచి పొడిచి ఆయనను చంపేశారు. అతని పేరిట చెన్నైలో 'శాంథోమ్ బసిలికా' ఉంది. థామస్ భారత దేశంలో తన సేవా కార్యక్రమాల్లో ఉంటూనే... బైబిల్‌లోని కొత్త, పాత నిబంధనల కలయికతో... త్రిత్వాన్ని (దేవుడు, ఆయన కుమారుడైన క్రీస్తు, పరిశుద్ధాత్మ అనే మూడు) ప్రతిబింబించే విధంగా ఒక క్రాస్‌ను తయారు చేశాడు. దాన్ని 'థామస్ క్రాస్' లేదా 'భారతీయ క్రాస్' అంటారు. ప్రపంచంలో ఎన్నో క్రైస్తవ దేశాలు ఉన్నా.. థామస్ తయారు చేసిన క్రాస్‌ను మన దేశం పేరుతో పిలవడం మనకు గర్వకారణం. థామస్ తన సువార్త-సేవా ప్రయాణంలో ఎందరో రోగులను స్వస్థతపరిచాడు. మరణించినవారిని బ్రతికించాడనీ,థామస్ మృతదేహాన్ని తాకి ఎందరో రోగులు స్వస్థత పొందారనీ, వారికి పట్టిన దుష్టశక్తులు వదిలిపోయాయనీ కథలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు క్రైస్తవ మందిరాలకు ఆయన భౌతిక అవశేషాలను పంపారు. అక్కడ వాటిని భద్రపరిచారు. ఇజ్రాయిల్ దేశంలోని గలలియ ప్రాంతంలో, క్రీస్తుశకం ఒకటో శతాబ్దంలో థామస్ జన్మించాడు. క్రీస్తు పునరుత్థానం తరువాత... క్రీస్తుశకం 52లో భారతదేశానికి వచ్చాడు. క్రీస్తుశకం 72లో చెన్నైలో హత్యకు గురయ్యాడు. మన దేశాన్ని ఎంతో ప్రేమించిన థామస్ గౌరవార్థం భారత ప్రభుత్వం 1964లో ఒక తపాలా స్టాంపును విడుదల చేసింది.

## బీఎస్ఎఫ్ మహిళా ఆఫీసర్ నేహా భండారిని సత్కరించిన ఆర్మీ చీఫ్



**జమ్మూ-నవభూమి:** ఆపరేషన్ సింధూర్ సమయంలో బీఎస్ఎఫ్ దళాలు .. పాకిస్థాన్ బలగాలను సమర్ధవంతంగా తిప్పి కొటా ్టయి. అయితే బీఎస్ఎఫ్ మహిళా ఆఫీసర్ అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారీ నేతృత్వంలోని మహిళా దళం కూడా అసాధారణ సత్తాను చాటింది. ఈ నేపథ్యంలో నేహా భండారిని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సత్కరించారు. కమెండేషన్ డిస్క్‌తో ఆమెను సన్మానించారు. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఆమెను కీర్తించారు. జమ్మూలోని ఆక్నూర్ సెక్టార్ వద్ద.. పాక్ ఫార్వర్డ్ దళాలను ఆమె బృందం అడ్డుకున్నది. అంతర్జాతీయ బోర్డర్ వద్ద ఉన్న పాకిస్థానీ పోస్టుపై చాకచక్యంగా నేహా భండారి బృందం ఎదుర్కొన్నది. జీరో లైన్ వద్ద సుమారు మూడు ఫార్వర్డ్ పోస్టులను ఆ దళం తిప్పికొట్టింది. నేహను సత్కరించిన అంశంపై బీఎస్ఎఫ్ జమ్మూకు చెందిన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు పెట్టారు. చాలా విపత్కరమైన పరిస్థితుల్లో నేహా తన టీమ్‌ను లీడ్ చేసినట్లు తెలిపారు. నేహాతో పాటు మరో ఆరు మంది మహిళా కానిస్టేబుళ్లు ఫార్వర్డ్ పోస్టుల వద్ద గన్ పొజిషన్‌లో ధీటుగా బదులిచ్చారు. సాంబా, ఆర్ఎస్ పురా, ఆక్నూర్ సెక్టార్ల వద్ద శత్రువులను ఎదుర్కొన్నారు. నేహా భండారి స్వరాష్ట్రం ఉత్తరాఖండ్. నేహా కుటుంబం ఆర్మీలో ఉన్నది. ఆమె మూడవ తరం ఆఫీసర్ కావడం విశేషం. బీఎస్ఎఫ్‌లో విధులు నిర్వర్తించడాన్ని గర్వంగా భావిస్తున్నారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో ఆక్నూర్ సెక్టార్‌లోని పర్గ్వాల్ ఫార్వర్డ్ ఏరియాను ఆమె కమాండ్ చేశారు. ఇంటర్నేషనల్ బోర్డర్ వద్ద దళాలతో నిఘా నిర్వహించడం పట్ల గర్వంగా ఉందని, ఆక్నూరు పోస్టుకు 150 మీటర్ల దూరంలో పాకిస్థానీ పోస్టు ఉన్నట్లు ఆమె తెలిపారు.



## ఆపరేషన్ సింధూర్.. స్టేట్మెంట్ వెనక్కి తీసుకున్న కొలంబియా



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆపరేషన్ సింధూర్ గురించి ప్రపంచ దేశాలకు భారతీయ ఎంపీలు వివరిస్తున్న విషయం తెలిసిందే. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న అంశాన్ని మన ఎంపీలు వివిధ దేశాలకు తెలియజేస్తున్నారు. అయితే ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో కొలంబియా దేశం పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేసింది. పాక్ పట్ల సానుభూతి వ్యక్తం చేసింది. ఆ దేశం వెళ్లిన శశిథరూర్ నేతృత్వంలోని బృందం దీని పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కొలంబియా వైఖరి పట్ల ఇండియాన తన విముఖతను వ్యక్తం చేయడంతో ఆ దేశం దిగివచ్చింది. దక్షిణ అమెరికా దేశం తన స్టేట్మెంట్‌ను వెనక్కి తీసుకున్నది. %కొలంబియా రాజధాని బొగొటలో జరిగిన కార్యక్రంలో ఎంపీ శశిథరర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో మృతి చెందిన వారి పట్ల సంతాపం తెలిపిన కొలంబియా వైఖరిని ఆయన తప్పుపట్టారు. ఇండియా అసంతృప్తితో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. పెహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు పట్ల కొలంబియా తన విచారాన్ని వ్యక్తం చేయలేకపోయిందన్నారు. పాక్ అనుకూల స్టేట్మెంట్‌ను కొలంబియా వెనక్కి తీసుకుంటుందని, ఆ తర్వాత భారత్‌కు మద్దతుగా స్టేట్మెంట్ ఇవ్వనున్నట్లు ఎంపీ శశిథరూర్ పేర్కొన్నారు. బొగోటలో ఉన్న తాడియో లొజానో యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో శశిథరూర్ ఆ వ్యాఖ్యలు చేశారు. అక్కడ మహాత్మా గాంధీకి ఆయన నివాళి అర్పించారు.

## అడ్వాన్స్ టిప్ పేరుతో రైడ్ హెయిలింగ్ కంపెనీల యాప్‌ల దోపిడీ




**న్యూఢిల్లీ-నవభూమి:** ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి రైడ్ హెయిలింగ్ కంపెనీల యాప్‌లపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) దర్యాప్తు చేస్తున్నదని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ చెప్పారు. సత్వర సేవల కోసం ముందుగానే టిప్‌ను చెల్లించాలని కస్టమర్లను బలవంతపెట్టడం లేదా సుతిమెత్తగా కోరడం అనైతికమని, దోపిడీతో కూడుకున్నదని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు అనుచిత వ్యాపార పద్ధతుల కిందికి వస్తాయన్నారు. టిప్ అంటే ప్రశంసాపూర్వకంగా ఇచ్చేదని, సేవకు ముందస్తు షరతు కాదని తెలిపారు.

**టిప్ ఇస్తే డ్రైవర్లు వేగంగా అంగీకరిస్తారు**

డ్రైవర్లకు ముందుగానే టిప్ ఇస్తే, రైడ్‌ను అంగీకరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఉబర్ చెప్తున్నది. ర్యాపిడో, ఓలా క్యాబ్స్ కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. వేగంగా రైడ్ దొరకాలంటే అదనంగా చెల్లించాలని యూజర్లకు చెప్తున్నాయి.

**అడ్వాన్స్ టిప్పింగ్ ఎలా మొదలైంది?**

కర్ణాటక ప్రభుత్వ రంగంలోని నమ్మ యాత్రి యాప్ 2022లో ఈ విధానాన్ని ప్రారంభించింది. దీనిని ర్యాపిడో 2023లో అనుసరించింది. ఉబర్ ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదలుపెట్టింది. నమ్మ యాత్రి యాప్‌లో 'టిప్‌ను కలపండి' అని చెప్పడానికి బదులుగా, 'మరింత కలపండి (స్వచ్ఛందం)' అని పేర్కొంది. అంటే, అడ్వాన్స్ టిప్పింగ్ కస్టమర్ ఇష్టాన్ని బట్టి ఉంటుందని, స్వచ్ఛందంగా ఇస్తే ఇవ్వవచ్చునని అర్థం వచ్చేలా యాప్‌ను రూపొందించింది. కానీ వాస్తవంగా క్యాబ్‌లను అప్పటికప్పుడు బుక్ చేసుకోవలసి ఉంటుంది కాబట్టి, అడ్వాన్స్ టిప్పింగ్ స్వచ్ఛందం కాబోదు. ఎందుకంటే, 'నేను ఇవ్వకపోతే, మరొకరు ఇచ్చేసి, క్యాబ్‌ను బుక్ చేసేసుకుంటారు' అనే భయం కస్టమర్లకు ఉంటుంది.

**యూజర్లు ఏమంటున్నారు?**

కస్టమర్లు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ఫిర్యాదులు చేస్తున్నారు. అడ్వాన్స్ టిప్ కుంభకోణం నమ్మ యాత్రి నుంచి మొదలైందని, ఈ వైరస్ ఉబర్, ర్యాపిడోలకు పాకిందని మండిపడుతున్నారు. మెరుగైన సేవల ముసుగులో ముందుగానే అదనంగా చెల్లించాలని కోరడం పట్టపగలు చేసే దోపిడీ అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫీచర్ రావడానికి పూర్వం రైడ్ బుకింగ్ సునాయాసంగా జరిగేదని, ర్యాపిడో, ఉబర్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ టిప్ నిజంగానే డ్రైవర్లకు వెళ్తున్నదా? కంపెనీ కొంత వాటా కొట్టేస్తున్నదా? అని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

## నైతిక ప్రవర్తన బాగుంటేనే..! అమెరికా పౌరసత్వం

**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటున్నారా? అయితే, నైతిక ప్రవర్తన సరిగా లేనివారు 'న్యూట్రలైజేషన్'కు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అమెరికా పౌరసత్వ, శరణార్థి సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) స్పష్టం చేసింది. నైతిక ప్రవర్తన సరిగా లేని గ్రీన్‌కార్డు హోల్డర్లకు అమెరికా పౌరసత్వాన్ని మంజూరు చేసే అంశాన్ని పరిశీలించబోమని పేర్కొంటూ.. దరఖాస్తుదారులు ఉన్నత నైతిక, సామాజిక ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సిందేనని తేల్చిచెప్పింది. గ్రాండ్ తెఫ్ట్ ఆటో అనే దొంగతనానికి సంబంధించిన యాక్టివ్ వారెంట్‌తో అమెరికాలోకి ప్రవేశించిన ఓ వలసదారుడి కేసును ప్రస్తావిస్తూ యూఎస్‌సీఐఎస్ ఈ హెచ్చరిక చేసింది. అమెరికా పౌరుడు కావడం గొప్ప హక్కని, అమెరికాను నిర్వచించే విలువలు, బాధ్యతలు, స్వేచ్ఛలను స్వీకరించే వారికే ఈ గౌరవం ఇవ్వబడుతుందని, అంతేతప్ప ఇది అందరికీ హామీ ఇవ్వబడిన హక్కు కాదని 'ఎక్స్' (ట్విట్టర్)లో యూఎస్‌సీఐఎస్ పేర్కొన్నది. అమెరికా పౌరసత్వ చట్టంలో 'మంచి నైతిక స్వభావం' అనేది దరఖాస్తుదారులు నిరూపించుకోవాల్సిన చట్టబద్ధమైన ప్రమాణమని, స్టాట్యుటరీ పీరియడ్ (సాధారణంగా పౌరసత్వ దరఖాస్తుకు ముందు ఐదేండ్లు)లో తమ ప్రవర్తన సమాజంలోని సగటు సభ్యుడు ఆశించే నైతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్టు దరఖాస్తుదారులు నిరూపించుకోవాల్సి ఉంటుందని 'బర్జియన్ లా' సీనియర్ పార్ట్‌నర్ కేతన్ ముఖీజా తెలిపారు. న్యూట్రలైజేషన్ అంటే.. గ్రీన్‌కార్డు హోల్డర్ అమెరికా పౌరుడిగా మారే ప్రక్రియనే న్యూట్రలైజేషన్ అంటారు. ఇందుకు సాధారణంగా దరఖాస్తుదారుడి స్థితిగతులను బట్టి మూడు నుంచి ఐదేండ్ల సమయం పడుతుంది. దరఖాస్తుదారులు నివాస నిబంధనలను పాటించడం, మంచి నైతిక స్వభావాన్ని కలిగి ఉన్నట్టు నిరూపించుకోవడంతోపాటు ఇంగ్లిష్, పౌరశాస్త్ర పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలి. అమెరికా పట్ల విధేయతను ప్రకటిస్తూ ప్రమాణం చేయాలి.

**నైతిక ప్రవర్తన విషయంలో పరిశీలించే అంశాలు ఇవీ..**

**దరఖాస్తుదారుల అరెస్టులు, నేరచరిత్ర, వారిపై ఉన్న నేరారోపణలు.**

**పన్ను చట్టాలను పాటిస్తున్నారా? లేదా? ఆర్థిక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారా? లేదా?**

**ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులు, ఇంటర్వ్యూల్లో నిజాయితీ.**


**సామాజిక ప్రవర్తన.**

# షిర్డీలో బంగారు వాచీ లభ్యం




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన షిర్డీ సాయిబాబా మందిరం గురించి అందరికీ తెలిసిందే. అయితే ప్రతిరోజూ వేలాది మంది సాయిబాబాను దర్శించుకుంటుండగా.. అక్కడే ఎవరో ఒక భక్తుడు తన బంగారు వాచీని పోగొట్టుకున్నారు. అయితే ఈ విషయం గుర్తించిన ఆలయ సిబ్బంది ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలిపింది. ముఖ్యంగా ఎవరో గుడిలో దాన్ని పోగొట్టుకున్నారని.. వెంటనే వచ్చి దాన్ని తీసుకెళ్లాలని సూచించారు. కానీ ఇప్పటి వరకు ఎవరూ రాకపోవడంతో దాన్ని వేలం వేయాలని నెటిజెన్లు సూచిస్తున్నారు. మరోవైపు ఆలయ యాజమాన్యం మాత్రం అలాంటిదేమీ చేయమని.. ఈ వాచీని పోగొట్టుకున్న భక్తులు తిరిగొచ్చి తీసుకునే వరకు అక్కడే ఉంచుతామని చెబుతున్నారు. ఎప్పటిలాగే మే 21వ తేదీన వేలాది మంది భక్తులు షిర్డీకి వచ్చారు. దేశ, విదేశాల నుంచి వచ్చి మరీ సాయిబాబా సమాధిని సందర్శించుకున్నారు. అక్కడి నుంచి భక్తులు బాబా తన జీవితాంతం ఫకీరుగా గడిపిన ద్వారకామాయికి కూడా వెళ్లారు. అందులో ఎవరో ఒకరు తమ గోల్డెన్ వాచీని పోగొట్టుకున్నారు. ఈక్రమంలోనే ఇద్దరు మహిళా భద్రతా గార్డులు అయన రంజనా కుంభార్, రషీద్ షేక్‌లకు ద్వారకామాయిలోని సాయిబాబా కూర్చున్న పవిత్ర రాయి వద్ద ఈ వాచీ దొరికింది. అయితే దీనిపై క్వీన్ విక్టోరియా చిత్రం, విక్టోరియా ఎంప్రెస్ అని రాసి ఉండగా.. అది బంగారుది అని కూడా వారు గుర్తించారు. దీంతో వెంటనే దాన్ని సాయిబాబా సంస్థాన్ ట్రస్టుకు అప్పగించారు. దీంతో సంస్థాన్ ఈ వాచీ గురించి మైకు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసింది. అది ఎవరిదో గుర్తించి వారే తీసుకెళ్లాలని చెప్పింది. అయితే వాచీ దొరికి 10 రోజులు కావొస్తున్నా ఎవరూ రాలేదు. దీంతో నెటిజెన్లు ఈ వాచీని వేలం వేయాలని కోరుతున్నారు. అయితే అంతకంటే ముందు దీన్ని వేలం వేయబోతున్నట్లు ప్రెస్ నోట్ కూడా విడుదల చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ వాచీని వేలం వేస్తే రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు వచ్చే అవకాశం ఉండడంతో అంతా ఆసక్తి కనబరుస్తున్నారు. సాయి సంస్థాన్ తాజాగా ఈ గోల్డెన్ వాచీ వేలం డిమాండ్లపై స్పందించింది. వేలం ఏమీ వేయమని తేల్చి చెప్పింది. ఈ వాచీని సంస్థాన్ లాకర్‌లో భద్రంగా దాచి పెడతామని ఆలయ సీఈఓ గోరక్షన్ గడిల్కర్ చెప్పారు. అయితే భవిష్యత్తులో యజమాని వస్తే అతను రుజువు సమర్పించిన తర్వాతే దీన్ని తిరిగి ఇస్తామన్నారు. అలాగే ఆలయంలో దొరికే వస్తువులను ఇలాగే దాచి పెడతామని.. వేలం వేసే పద్ధతి లేదని పేర్కొన్నారు. భక్తులు హుండీలో వేసినవి, సాయిబాబాకు సమర్పించినవి మాత్రమే వేలం వేస్తామని చెప్పుకొచ్చారు.

# ఎలాన్ మస్క్‌కి ప్రత్యేక బహుమతి




**వాషింగ్టన్-నవభూమి:** డోజ చీఫ్ బాధ్యతల నుంచి తప్పుకున్న ఎలాన్ మస్క్.. మే 30న తన పదవికి చివరి రోజు కావడంతో అధ్యక్షుడు ట్రంప్ ఆఫీస్‌కి వచ్చి కలిశాడు. మస్క్‌కి వీడ్కోలు పలికిన ట్రంప్.. అతడికి ప్రత్యేక బహుమతి ఇచ్చాడు. డోజ్‌కు సేవలు అందించినందుకు గానూ మస్క్‌కు వైట్‌హౌస్ బంగారు తాళం అందించారు. ప్రత్యేకమైన వ్యక్తులకే ఈ గిఫ్ట్ ఇస్తామని తెలిపిన ట్రంప్.. దేశం తరఫున మస్క్‌కి ఇప్పుడు ఈ ప్రత్యేక బహుమతి అందిస్తున్నాని చెప్పుకొచ్చాడు. మస్క్ వీడ్కోలు సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ట్రంప్ మాట్లాడుతూ.. టెస్లా అధినేతపై ప్రశంసలు కురిపించాడు. డోజ్ చీఫ్‌గా బాధ్యతలు తీసుకున్న మస్క్.. ఎంతో సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వహించారని చెప్పుకొచ్చాడు. మస్క్.. ప్రపంచంలోనే ఒక గొప్ప వ్యాపారవేత్త, ఆవిష్కర్త అని ప్రశంసించాడు. మస్క్ తన తెలివితేటలను.. అమెరికా అభివృద్ధికి వాడేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపాడు. డోజ్ తన సేవలను కొనసాగిస్తుందని ట్రంప్ చెప్పుకొచ్చాడు. అనంతరం మస్క్ మాట్లాడుతూ.. డోజ్ చీఫ్‌గా తనకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపాడు. ఈ బాధ్యతను నుంచి వైదొలగినప్పటికీ.. తాను అధ్యక్ష కార్యాలయానికి వస్తాను అన్నాడు. ట్రంప్ కోరితే తన సలహాలు, సూచనలు చేస్తానని వెల్లడించాడు. 'డోజ్' పదవి కాలం పరిమితితో కూడుకున్నదన్నాడు. తాను 134 రోజులు డోజ్ ఛీఫ్‌గా బాధ్యతలు నిర్వహించానని ల్లడించాడు. 'డోజ్'కు ఇది ముగింపు కాదని, ప్రాజెక్ట్ ఇప్పుడే ప్రారంభమైందన్నాడు. ఇది డబ్బు వృథాను అరికడుతుందని తెలిపాడు. రానున్న రోజుల్లో డోజ్ వ్యవస్థ క్రమంగా బలపడుతూ..ఒక జీవిత విధానంగా మారుతుందని చెప్పుకొచ్చాడు. ట్రంప్ రెండో సారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. ఎలాన్ మస్క్‌ను తన పాలకవర్గంలోకి సలహాదారుగా తీసుకున్నాడు. ప్రభుత్వంలో భారీగా చోటు చేసుకుంటున్న వృథా ఖర్చులను తగ్గించడమే లక్ష్యంగా 'డోజ్' శాఖను ఏర్పాటు చేశాడు. దీని బాధ్యతలను మస్క్‌కు అప్పగించాడు ట్రంప్. అయితే మస్క్ చేసిన సూచనలపై భారీ ఎత్తున విమర్శలు వచ్చాయి. అంతేకాక తాజాగా ట్రంప్ తీసుకువచ్చిన ది వన్ బిగ్ బ్యూటిఫుల్ కొత్త పన్ను విధానాన్ని విమర్శించాడు. ఆ మరుసటిరోజే డోజ్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు.

## ఫోన్ టార్చ్ వెలుతురులో నలుగురికి ప్రసవం..



**లక్నో-నవభూమి:** బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని విద్యుత్ సరఫరా, ప్రభుత్వ దవాఖానాల్లో మౌలిక వసతులు ఎంత అధ్వానంగా ఉన్నాయో తెలిపే ఉదంతమిది! విద్యుత్తు కోతల వల్ల బలియా జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొబైల్ టార్చ్‌లైట్ వెలుతురులో నలుగురు మహిళలు ప్రసవించిన సంగతి వెలుగులోకి వచ్చింది. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినటంతో విద్యుత్తు సరఫరా ఆగిపోయిందని తెలిసింది. ఇదే జిల్లాలో కొద్ది రోజుల క్రితం ఓ ఆరోగ్య కేంద్రం మెట్లమీదే ఓ గర్భిణి ప్రసవించటం రాష్ట్రంలో సంచలనం రేపింది. రాష్ట్రంలో విద్యుత్తు కోతలు, ప్రజారోగ్య కేంద్రాల్లో అధ్వాన పరిస్థితులకు ఈ ఘటనలు అద్దం పడుతున్నాయని సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. తాజా ఘటనపై బాలియా ముఖ్య వైద్య అధికారి డాక్టర్ సంజీవ్ బర్మన్ మాట్లాడుతూ, 'బెరువార్ బారీ పీహెచ్‌సీ ఇన్‌చార్జ్, ఇతర అధికారుల నుంచి వివరణ కోరాం. దవాఖాన వద్ద ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్న తర్వాత, దాన్ని మార్చారు. జెనరేటర్ కూడా మంచి కండీషన్‌లోనే ఉంది. అయినా ఈ ఘటన జరగటంపై విచారణకు ఆదేశించాం' అని అన్నారు.

# సంజయ్ రౌత్, ఉద్ధవ్ థాక్రేలకు పిచ్చి పట్టింది



**న్యూఢిల్లీ-నవభూమి:** ఏప్రిల్ 22వ తేదీన జమ్ము కశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ముష్కరులు పురుషులను, ముస్లిం కాని వారినే లక్ష్యంగా చేసుకుని 26 మందిని చంపేశారు. ఇందుకు ప్రతిగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. వందల మంది ముష్కరులను హతమార్చింది. కానీ దాడికి పాల్పడ్డ ఆరుగురు ఉగ్రవాదులను మాత్రం ఇప్పటికీ పట్టుకోలేకపోయింది. అయితే తాజాగా ఇదే విషయమై మాట్లాడుతూ.. బీజేపీ సర్కారు వీరిని ఇంకా పట్టుకోలేదంటే వారు బీజేపీలో చేరే అవకాశం ఉందంటూ కామెంట్లు చేశారు. అయితే తాజాగా దీనిపై బీజేపీ స్పందించింది. సంజయ్ రౌత్, ఉద్ధవ్ థాక్రేలకు పిచ్చి పట్టిందని.. అందుకే వారలా మాట్లాడుతున్నార ంటూ వ్యాఖ్యానించింది. వారిని వెంటనే మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలంటూ కూడా చెప్పుకొచ్చింది. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడ్డ ఆరుగురు ఉగ్రవాదులు బీజేపీలో చేరినా చేరవచ్చని సంజయ్ రౌత్ వ్యాఖ్యలు చేశారు. ఏదో ఒకరోజు ఇందుకు సంబంధించిన ప్రెస్ నోట్ కూడా విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలోనే బీజేపీ నేత రామ్ కదమ్ సంజయ్ రౌత్ సహా ఉద్ధవ్ థాక్రే శివసేన పార్టీ నాయకులు అందరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శివసేన (ఉద్ధవ్ థాక్రే) పార్టీ నాయకులైన ఉద్ధవ్ థాక్రే, సంజయ్ రౌత్ సహా ఇతర నాయకులు పిచ్చి పట్టినట్లుగా మాట్లాతున్నారని బీజేపీ మండిపడింది. వారిని వెంటనే పిచ్చాసుపత్రిలో చేర్పించాలని ఆగ్రహం వ్యక్తం చేసింది. చెక్‌పోస్టుల్లో ఆ వాహనాలకు ఫీజు తగ్గింపు.. ఉద్ధవ్ థాక్రే, అలాగే ఆయన పార్టీలో సంజయ్ రౌత్ సహా ఇతర నాయకులు మతి స్థిమితం కోల్పోయి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని, వాళ్లు మెంటల్ ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకోవాలని రామ్ కదమ్ మండిపడ్డారు. అదే విధంగా ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన నేత సంజయ్ నిరుపమ్ కూడా రౌత్ వ్యాఖ్యలపై స్పందించారు. ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన నేతలు ఎన్డీయే కూటమిలో చేరాలని ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ అందుకు అవకాశం ఇవ్వకపోవడంతో ఫ్రస్టేషన్‌లో ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. రౌత్ వ్యాఖ్యలు భారత జవాన్‌లకు అవమానకరమని అన్నారు. కొన్ని రోజుల క్రితం కూడా సంజయ్ రౌత్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ పూర్తిగా ఫెయిల్ అయిందని చెప్పారు. పహల్గాం ఉగ్రవాద దాడులను ఆపే విషయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పూర్తిగా విఫలం అయ్యారని విమర్శించారు. ఇందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత తీసుకుని పదవికి రాజీనామా చేయాలని కూడా సూచించారు.

## సీబీఐకి చిక్కిన ఈడీ!




**భువనేశ్వర్-నవభూమి:** ఓ వ్యాపారి నుంచి రూ. 20 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడో ఈడీ అధికారి. ఒడిశాలోని డెంకనల్‌కు చెందిన స్టోన్ మైనింగ్ వ్యాపారి రతికాంత రౌత్‌పై ఈడీ కేసు నమోదైంది. ఈ కేసు నుంచి ఆయనను బయటపడేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న చింతన్ రఘువంశీ రూ.5 కోట్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అతడి నుంచి మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20 లక్షలు అందుకుంటుండగా ఈడీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం.. ఈడీ తనపై కేసు నమోదు చేసి ప్రశ్నించేందుకు పిలవడంతో రౌత్ వెళ్లగా కేసు నుంచి ఉపశమనం పొందాలంటే భగతి అనే వ్యక్తిని కలవాలని సూచించారు. ఈ కేసులో అరెస్ట్ కాకుండా ఉండాలంటే రఘువంశీకి రూ. 5 కోట్లు చెల్లించాలని భగతి డిమాండ్ చేశాడు. ఆ తర్వాత రఘువంశీతో మాట్లాడి రూ. 2 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ. 20 లక్షలు పుచ్చుకుంటుండగారెడ్ హ్యాండెడ్‌గా రఘువంశీని పట్టుకున్నారు.

# మెక్రాన్ దంపతులకు ట్రంప్ సూచన



**వాషింగ్టన్-నవభూమి:** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ దంపతులకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అందులో ఆయన సతీమణి బ్రిగెట్టా అతడి ముఖంపై కొట్టినట్లు వీడియోలో రికార్డు కాగా.. అది చూసిన ప్రతీ ఒక్కరూ వీరిద్దరి మధ్య గొడవ జరిగిందని భావించారు. అంతేనా త్వరలోనే విడాకులు కూడా తీసుకోబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. ఇప్పటికే మెక్రాన్ దంపతులు దీనిపై క్లారిటీ కూడా ఇచ్చినా అంతా అదే నిజం అనుకుంటున్నారు. అయితే తాజాగా దీనిపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. అలాంటివి జరిగేటప్పుడు తలుపులు వేసుకోవాలంటూ సూచించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, బ్రిగెట్టా దంపతుల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయని ఇటీవలే సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. ముఖ్యంగా వీరిద్దరూ కలిసి వియత్నాం పర్యటనకు వెళ్లిన సమయంలో గొడవ జరిగినట్లు తెలిసింది. ముఖ్యంగా విమానం హనోయ్‌లో దిగిన తర్వాత.. ఒక అధికారి తలుపును తెరిచినప్పుడు మెక్రాన్ ఎవరితోనో మాట్లాడుతున్నట్లు కనిపించింది. అంతలోనే ఎర్రని స్లీవ్ డ్రెస్ ధరించిన ఓ మహిళ చేతులు మెక్రాన్ ముఖంపై కొట్టినట్లు కూడా వీడియోలో రికార్డు అయింది. దీంతో ఆయన వెంటనే తలతిప్పుకొని వెనక్కి జరిగారు. అయితే ఇదంతా రికార్డు అవుతున్నట్లు గుర్తించిన మెక్రాన్ ఆ వెంటనే చేతులు ఊపుతూ నవ్వారు. మీరు యూపీఐ ట్రాన్సాక్షన్స్ చేస్తున్నారా? జూన్ 30 నుంచి కొత్త రూల్స్.. ఆ టెన్షనే లేదుగా!అయితే ఆ తర్వాత.. అదే రెడ్ కలర్ డ్రెస్సులో మెక్రాన్ సతీమణి బ్రిగెట్టా కనిపించగా.. ఆమెనే అతడిని కొట్టిందని అంతా భావించారు. ముఖ్యంగా ఆ తర్వాత కూడా మెక్రాన్ ఆమె చేయి పట్టుకోవాలని చూడగా.. ఆమె అందుకు అంగీకరించలేదు. దీంతో వీరిద్దరి మధ్య గొడవ జరిగిందని అందరూ భావించారు. ఇందుకు సంబంధించిన ఈ వీడియోలు కూడా నెట్టింట వైరల్ కాగా అంతా అది నిజమేననుకున్నారు. ఈ ఘటనకు ముందే వీరిద్దరి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయని, విడాకులు తీసుకునే అవకాశం ఉందంటూ వార్తలు రాగా.. ఈ వార్తలకు మరింత బలం ఏర్పడింది. కానీ దీనిపై మెక్రాన్ స్పందించారు. ఆ సందర్భాన్ని అంతా తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తమ మధ్య గొడవ జరగలేదని.. తానొక టిష్యూ తీసుకుని, ఒకరికి షేక్ హ్యాండ్ ఇచ్చినట్లు చెప్పారు. ఇదే తమ మధ్య జరిగిన సరదా సన్నివేశమని కూడా క్లారిటీ ఇచ్చారు. అలాగే తనకు, తన భార్యకు ఎప్పుడూ ఇలా జరుగుతూనే ఉందని చెప్పుకొచ్చారు. ఇంత జరిగాకా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీరిద్దరి మధ్య గొడవ జరిగిందంటూ వచ్చిన వీడియోపై స్పందించారు. ముఖ్యంగా ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ విషయంపై తాను నేరుగా మెక్రాన్‌తో మాట్లాడానని చెప్పారు. అంతా బాగానే ఉందని.. కాకపోతే అలాంటి ఘటనలు జరిగినప్పుడు తలుపులు వేసి ఉన్నాయో లేదో ఒకసారి గమనిమంచుకోవాలని సూచించారు.

## పహల్గాం ఉగ్రవాదులు బీజేపీలో చేరుతారేమో?



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ శుక్రవారం తీవ్ర విమర్శలు చేశారు. పహల్గాంలో ఆరుగురు ఉగ్రవాదులు ఇంకా పరారీలో ఉన్నారని, వారు బీజేపీలో చేరుతారేమోనని ఆరోపించారు. 'ఆరుగురు తీవ్రవాదులు అక్కడ ఇంకా పట్టుబడలేదు. బహుశా వారు బీజేపీలో చేరారంటూ ఒకరోజు బీజేపీ కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల కావొచ్చు' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రధాని మోదీ రాజకీయం చేస్తున్నారని, భారత సైనికులు నిర్వహించిన మిలిటరీ ఆపరేషన్ క్రెడిట్‌ను ఆయన కొట్టేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆయన రాష్ట్రం రాష్ట్రం తిరుగుతూ అదంతా తన ఘనతే అని చెప్పకోవడానికి తంటాలు పడుతున్నారన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఒక లేఖను అందిస్తాయన్నారు.

## ఏం భయంలేదు.. మళ్లీ అధికారం మనదే..

**చెన్నై-నవభూమి:** 'మదురైలో డీఎంకే సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిద్దాం... 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి తీరుదాం' అంటూ డీఎంకే కార్యకర్తలకు పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ బహిరంగ లేఖ రాశారు. తన సారథ్యంలోని ద్రావిడ మోడల్ ప్రభుత్వ పనితీరుపై ఏదో ఒక విమర్శ చేయాలన్న ధోరణితోనే విపక్షాల వ్యవహా రశైలి ఉంది. వచ్చే ఎన్నికల్లో బలమైన డీఎంకే కూటమిని ఎదుర్కోలేక అనేక పార్టీలను కలుపుకుని కూటమిగా ఏర్పడటం లేదా రహస్యంగా సమావేశమై మంతనాలు జరుపుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా మదురైలో పార్టీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని భావించి, స్థలాన్ని కూడా రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, తంగం తెన్నరసు పరిశీలించారని, జూన్ ఒకటో తేదీ ఉదయం 9 గంటలకు మదురైలో పార్టీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని స్టాలిన్ తెలిపారు.. ఈ సమావేశం విజయవంతమయ్యేలా సర్వసభ్యులతో పాటు పార్టీ నేతల సహాయ సహకారాలందించాలి.



# హీరో విజయ్‌పై విమర్శలు వద్దు: మాజీ సీఎం పళనిస్వామి



**చెన్నై-నవభూమి:** రాష్ట్రంలో డీఎంకే(ప్రభుత్వ అసమర్ధ పాలనను ప్రజలకు తెలియజేయాలని, అదే సమయంలో టీవీకే అధ్యక్షుడు విజయ్‌పై ఎలాంటి విమర్శలు చేయవద్దని పార్టీ శ్రేణులకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సూచించారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో ఈపీఎస్ నేతృత్వంలో గురువారం ప్రారంభమైన జిల్లా ఇన్‌చార్జ్‌లు, జిల్లా కార్యదర్శుల సమావేశం రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. తొలిరోజు సమావేశంలో 42 జిల్లాల ఇన్‌చార్జులు, కార్యదర్శులు, రెండో రోజు సమావేశంలో 40 జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు. జిల్లాల్లో ఏర్పాటుచేసిన బూత్ కమిటీల వివరాలు తెలుసుకున్న ఈపీఎస్.. మిగిలిన ప్రాంతాల్లో జూన్ నెలాఖరులోపు బూత్ కమిటీలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో బలమైన మెగా కూటమి ఏర్పాటుకానుందని, ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు, నేతలు సమష్టిగా కృషిచేయాలన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిపై విమర్శలు గుప్పించాలని, అదే సమయంలో టీవీకే అధ్యక్షుడు విజయ్‌పై ఎలాంటి విమర్శలు చేయరాదని సూచించారు. రాబోయే ఏడాది కాలంలో నేతలు విహారయాత్రలకు వెళ్లకుండా కార్యకర్తలు, బూత్ కమిటీలను సమన్వయపరచి, డీఎంకే అసమర్ధపు పాలనను ప్రజలకు తెలియజేసి పార్టీ మళ్లీ అధికారం చేపట్టేలా ప్రచారం సాగించాలని ఈపీఎస్ పిలుపునిచ్చారు.

## పాక్‌కు గూఢచర్యం.. భారత యుద్ధ నౌకల వివరాలను చేరవేసిన ఇంజినీర్



**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్థానీ నిఘా ఏజెంట్లకు భారత యుద్ధ నౌకల సమాచారం అందజేసిన మహారాష్ట్ర యువకుడు రవీంద్ర వర్మను (27) పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. థానేలో ఉంటున్న అతడు మెకానికల్ ఇంజినీర్ అని చెప్పారు. పాక్ ఏజెంట్ల ఉచ్చులో పడి అతడు యుద్ధ నౌకలు, జలాంతర్గాములకు సంబంధించిన గోప్యమైన సమాచారాన్ని చేరవేశాడని తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రవీంద్ర వర్మ ఓ ప్రైవేటు రక్షణ రంగ టెక్నాలజీ సంస్థలో పని చేసేవాడు. ఫేస్‌బుక్ ద్వారా పాకిస్థానీ ఏజెంట్‌లు అతడికి పరిచయమయ్యారు. సదరు పాక్ ఏజెంట్‌లు తమని తాము యువతులుగా పరిచయం చేసుకున్నారు. ఇక రక్షణ రంగ సంస్థ ఉద్యోగి అయిన వర్మకు యుద్ధనౌకలు, జలాంతర్గాముల్లోకి వెళ్లేందుకు అనుమతి ఉండేది. అతడు తన వెంట సెల్‌ఫోన్ కూడా తీసుకెళ్లేవాడు. తన విధులు పూర్తి చేశాక, నౌకలకు సంబంధించిన గోప్యమైన సమాచారాన్ని సేకరించి పాక్ ఏజెంట్‌లకు అందించేవాడు. బొమ్మలు, ఇతర డిజైన్లు వేసి సమాచారాన్ని ఇచ్చేవాడు. కొన్ని సార్లు ఆడియో రూపంలో కూడా సీక్రెట్ సమాచారాన్ని చేరవేసేవాడు. 2024లో పాయల్ శర్మ, ఇస్‌ప్రీత్ పేరిట ఉన్న ఫేస్‌బుక్‌ల నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు వచ్చాక అతడు పాక్ ఏజెంట్లతో టచ్‌లోకి వచ్చాడని పోలీసులు తెలిపారు. పాక్ ఏజెంట్లు ఇద్దరూ తమని తాము భారతీయ పౌరులుగా పరిచయం చేసుకున్నారు. తాము పనిచేస్తున్న ప్రాజెక్టుకు కోసం భారత యుద్ధ నౌకలకు సంబంధించిన సమాచారం కావాలని కోరారు. వర్మ పంపించిన సమాచారానికి అతడికి భారత్‌లోని వివిధ బ్యాంక్ అకౌంట్‌ల నుంచి డబ్బులు బదిలీ అయ్యేవని కూడా పోలీసులు తెలిపారు. "అతడికి తాను ఏం చేస్తున్నదీ, గోప్యమైన సమాచారాన్ని ఎవరికి ఇస్తున్నదీ పూర్తిగా తెలుసు. ఈ సమాచారం ఇచ్చినందుకు అతడికి డబ్బు ముట్టేవి" అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. పహల్గాం దాడి తరువాత భారత నిఘావర్గాలు హైఅలర్ట్‌లో ఉంటున్నాయి. పాక్ కోసం గూఢచర్యానికి పాల్పడుతున్న అనేక మందిని అదుపులోకి తీసుకున్నాయి. రాజస్థాన్, మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, పంజాబ్‌లకు చెందిన సుమారు 15 మంది పాక్ కోసం గూఢచర్యానికి పాల్పడుతూ పోలీసులకు చిక్కారు.

## పెళ్లికి వెళ్లి వస్తుండగా ఘోర ప్రమాదం.. ఐదుగురు మృతి, ఆరుగురికి గాయాలు..




**హర్దోయ్-వభూమి:** పలువురు పెళ్లి వేడుకకు హాజరై కారులో తిరిగి వస్తున్న క్రమంలో అనుకోకుండా అది బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఓ చిన్నారి సహా ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతోపాటు మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ విషాద ఘటన ఉత్తర్ ప్రదేశ్ హర్దోయ్ జిల్లా మజ్హిలా పోలీస్ స్టేషన్ పరిధిలోని భూప్ప పూర్వా మలుపు వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పటియానీం గ్రామంలో నిర్వహించిన నీరజ్ వివాహ వేడుక ముగించుకుని, పలీ గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. అందరూ ఒకే కారులో ప్రయాణిస్తున్న సమయంలో అతి వేగంగా వెళ్తున్న వాహనం నియంత్రణ కోల్పోయి అలమ్నగర్ రోడ్డుపై మలుపు వద్ద డిచ్‌లోకి పడిపోయింది. ఇది చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఐదుగురు మృతి చెందినట్లు ప్రకటించారు. మిగతా ఆరుగురిని ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. శహాబాద్ సర్కిల్ ఆఫీసర్ అనుజ్ మిశ్రా మృతుల వివరాలను వెల్లడించారు. వారిలో జితేంద్ర (22), ఆకాష్ (18), సిద్ధార్థ్ (6), రాము (35), జౌహరి (40) ఉన్నారు. ఈ ఐదుగురు హర్దోయిలోని పలీ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నవారే. గాయపడినవారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది. వారిని హర్దోయి జిల్లా ఆసుపత్రికి తరలించి ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. ఈ ప్రమాదం వారి కుటుంబాల్లోనే కాదు, వారి గ్రామాల్లోనూ తీవ్ర విషాదాన్ని నింపింది.

కారణాలు ఇవేనా.. పోలీసుల సమాచారం ప్రకారం పటియానీంగ్రామానికి చెందిన వారంతా, కుస్మాలోని నీరజ్ వివాహానికి హాజరై తిరిగి పాలి గ్రామానికి వెళ్తున్నారు. ఆ క్రమంలోనే భూప్ప పూర్వా వద్ద ఉన్న మలుపు సమీపంలో డ్రైవర్ కారు కంట్రోల్ తప్పి ప్రమాదానికి గురైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. అయితే డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్న క్రమంలో ప్రమాదం జరిగిందా లేదా మద్యం సేవించాడా అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు ఇదే రోజు ఉదయం జౌన్‌పూర్ జిల్లాలో కూడా మరో విషాద ఘటన చోటుచేసుకుంది. బక్షా పోలీస్ స్టేషన్ పరిధిలోని లఖౌవా గ్రామం వద్ద ప్రయాణికులతో నిండిన ఒక ప్రైవేట్ బస్సు అకస్మాత్తుగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## మన దళాల దెబ్బకు పాక్ ఇప్పట్లో కోలుకోలేదు



**పూంచ్/జమ్మూ-నవభూమి:** ఆపరేషన్ సిందూర్ సమయంలో 118కి పైగా పాక్ సైనిక పోస్టులను, వాటి నిఘా నెట్‌వర్క్‌ను బీఎసఎఫ్ పూర్తి గా ధ్వంసం చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మన దళాల దెబ్బకు పాకిస్థాన్ ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ, అమర్‌నాథ్ యాత్ర సన్నాహాలపై సమీక్షించడంతో పాటు పాక్ జరిపిన షెల్లింగ్ దాడులకు గురైన బాధిత కుటుంబాలను కలుసుకోవడానికి జమ్మూలో ఆయన చేపట్టిన రెండు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. పాక్ దురాక్రమణకు దీటుగా స్పందించిన సరిహద్దు భద్రతా దళాన్ని(బీఎసఎఫ)ను ఆయన ప్రశంసించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రధాని మోదీ హయాంలో 2014లో ప్రారంభమైన జమ్మూ కశ్మీర్ అభివృద్ధి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగడం లేదా మందగించడం అనేదే ఉండదని స్పష్టం చేశారు.

# అంకితా భండారీ కేసులో కీలక మలుపు



**న్యూఢిల్లీ-నవభూమి:** అంకితా భండారీ.. మూడు సంవత్సరాల క్రితం ఈపేరు దేశంలో సంచలనం సృష్టించింది. కారణం రిసెప్షనిస్ట్‌గా చేసే తను.. అత్యంత దారుణంగా హత్యకు గురి కావడం. వీఐపీ కస్టమర్లకు ప్రత్యేక సేవల పేరిట వారికి లైంగిక సేవలు అందించేందుకు అంకిత నిరాకరిచండంతో ఆమెను అత్యంత పాశవీకంగా హత్య చేశారు. దేశాన్ని కుదిపేసిన ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కోర్టు ముగ్గురికి యావజ్జీవ కారగార శిక్ష విధించింది. ఆ వివరాలు..కుటుంబానికి అండగా నిలబడాలనే ఉద్దేశంతో.. రిసార్ట్‌లో రిసెప్షనిస్ట్‌గా చేరిన అంకితా భండారీ.. కేవలం నెల రోజుల వ్యవధిలోనే కనపించకుండా పోయింది. తల్లిదండ్రుల దీని గురించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు సరిగా స్పందించలేదు. పైగా కేసులో రాజకీయ నాయకులకు కూడా సంబంధం ఉండటంతో.. నిర్లక్ష్యం వహించారు. కానీ ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం కావడంతో.. పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఎట్టకేలకు మూడేళ్ల తర్వాత అంకితా భండారీ హత్య కేసులో కోర్టు.. రిస్టార్ట్ యజమాని పులకిత్ ఆర్య, సిబ్బంది అంకిత్ గుప్తా, సౌరభ్ భాస్కర్‌లను దోషులుగా తేల్చి.. వారికి యావజ్జీవ కారగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.

అసలేం జరిగిందంటే..

హత్యకు గురైన అంకితా భండారీ స్వస్థలం ఉత్తరాఖండ్‌లోని పౌడీ గఢ్వాల్ జిల్లాలో డోబ్-శ్రీకోట్ గ్రామం. చనిపోయే నాటికి ఆమె వయసు కేవలం 19 సంవత్సరాలు మాత్రమే. ఇంత చిన్న వయసులోనే కుటుంబానికి అండగా నిలవాలనుకున్న అంకిత.. 2022 ఆగస్టులో రిషికేశ్ దగ్గర ఉన్న ఒక రిసార్ట్‌లో రిసెప్షనిస్ట్ ఉద్యోగంలో చేరింది. అదే ఆమె పాలిట మృత్యుపాశమయ్యింది. అయితే ఈ రిసార్ట్ నిర్వహణ బాధ్యతలను.. ఒకప్పటి బీజేపీ సీనియర్ నేత వినోద్ ఆర్య కొడుకైన పులకిత్ ఆర్య చూసుకునేవాడు.

రిసెప్షనిస్ట్‌గా ఉద్యోగంలో చేరిన అంకిత.. నెల రోజులకే కనిపించకుండా పోయింది. కారణం.. రిసార్ట్‌కు వచ్చే వీఐపీ అతిథిలుకు ప్రత్యేక సేవలకు నిరాకరించడం. వీఐపీ కస్టమర్లకు లైంగిక సేవలు అందిచాలని పులకిత్ ఆమెపై ఒత్తిడి తెచ్చాడు. ఈ విషయంలో పులకిత్ దగ్గర పని చేసే అంకిత్ గుప్తా, సౌరభ్ భాస్కర్ కూడా అంకితను బలవంతపెట్టారు. ఆమె మాట వినకపోవడంతో ఘర్షణకు దారి తీసింది. అప్పటికే విచక్షణ కోల్పోయిన పులకిత్.. మిగతా ఇద్దరి సాయంతో ఆమెను ఒక వాహనంలోకి ఎక్కించి బలవంతంగా తీసుకెళ్లారు. ఆ తర్వాత రిషికేశ్ సమీపంలోని ఓ కెనాల్‌లో పడేసి.. రిసార్ట్‌కు వెళ్లిపోయారు.

అంకిత స్నేహితుడి రాకతో మలుపు..

అంకితను అడ్డుతొలగించుకున్న పులకిత్ ఆర్య, మిగతా ఇద్దరూ సిబ్బంది రిసార్ట్‌కు వచ్చి.. తమకే తెలియదన్నట్లు పనిలో పడిపోయారు. అయితే వీరి వేధింపులు గురించి అప్పటికే అంకిత తన స్నేహితుడికి కాల్ చేసి చెప్పింది. దీంతో అతడు అదే రోజు రాత్రి అంకితకు ఫోన్ చేశాడు. కానీ ఆమె మొబైల్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆ తర్వాత రిసార్ట్‌కు వెళ్లి ఆర్య, ఇతర సిబ్బందిని ప్రశ్నింగా.. ఒక్కొక్కరు ఒక్కో సమాధానం చెప్పారు.

మరుసటి రోజున ఆర్య మొబైల్ కూడా స్విచ్ఛాఫ్ అయ్యింది. అనుమానం మరింత బలపడింది. దీంతో అంకిత స్నేహితుడు.. ఆమె తల్లిదండ్రులతో కలిసి పోలీసు స్టేషన్‌కి వెళ్లి దీని గురించి ఫిర్యాదు చేశాడు. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన అంశం ఏంటంటే.. అంకితను చంపేసిన వ్యక్తే.. ఆమె కనిపించడం లేదంటూ పోలీసులకు కంప్లైంట్ ఇచ్చాడు.


**పోలీసులు అలసత్వం.. అడుగడునా నిర్లక్ష్యం**

ఫిర్యాదు తీసుకున్న పోలీసులు.. దర్యాప్తులో అలసత్వం ప్రదర్శించారు. పైగా అంకిత పని చేసిన రిసార్ట్ ఉన్న ప్రాంతం రెవెన్యూ పోలీస్ అధికారి పరిధిలో ఉంది. దీంతో ఆమెను గుర్తించడంలో చాలా ఆలస్యం జరిగింది. ఎలాంటి పురోగతి లేకపోవడంతో.. మూడు రోజుల తర్వాత ఈ కేసును సాధారణ పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత ఆరు రోజులకు కెనాల్‌లో అంకిత మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే డెడ్‌బాడీని పోస్ట్‌మార్టంకి పంపించారు. నివేదికలో.. కాలువలో కొట్టుకుపోవడం వల్లే అంకిత మృతి చెందిందని తెలిసింది. అయితే ఆమెపై లైంగిక దాడి జరగలేదని.. కాకపోతే శారీరంగా దారుణంగా హింసించారని వెల్లడయ్యింది. అప్పటికే ఈ ఘటనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రమం నెలకొని ఉంది. దీనికి తోడు పోలీసులు నిర్లక్ష్యం వారిని దాడులకు పాల్పడేలా ప్రేరేపించింది. నిందితులపైనే కాక పులకిత్ రిసార్ట్‌పైనా దాడి చేశారు. ప్రభుత్వం నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తుందంటూ విపక్షాలు సైతం విమర్శలు చేశాయి. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. రిసార్ట్‌ను అక్రమంగా నిర్మించారంటూ రాత్రికి రాత్రే దాన్నిబుల్డోజర్‌తో కూల్చేసింది. ఆతర్వాత పులకిత్ తండ్రి వినోద్‌ని బీజేపీ నుంచి బహిష్కరించారు.

**మూడేళ్ల తర్వాత తీర్పు వెల్లడి..**

ఇంత జరుగుతున్నా సరే.. నిందితులు కేసు నుంచి బయటపడేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. పైగా అంకిత స్నేహితుడిని కేసులో ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. చివరకు ఆమె అంత్యక్రియలు కూడా సజావుగా జరగనీయలేదు. ఈ కేసును త్వరగా సాల్వ్ చేసుందుకు గాను.. నాటీ ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి.. దీన్ని ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించాడు. మూడేళ్ల నుంచి కేసుకు సంబంధించి వాదనలు సాగుతున్నాయి. ఇక తాజాగా ఈ కేసులో మే 19న కోర్టులో తుది వాదనలు ముగిశాయి. 30న తీర్పు వెలువడింది. అంకిత భండారీ హత్య కేసులో కోర్టు పులకిత్‌తో పాటుగా అతడి సిబ్బంది సౌరభ్, అంకిత్‌లను కూడా దోషులుగా తేల్చింది. అంతేకాక వారికి యావజ్జీవ కారగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.

# ద్రవ రూపంలో రోబో



**న్యూఢిల్లీ-నవభూమి:** సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు మరో అద్భుతాన్ని ఆవిష్కరించారు. మానవ శరీరం లోపల సున్నితమైన పనులను నిర్వహించడానికి ప్రత్యేకంగా రూపొందించిన, ద్రవ రూపంలో ఉండే రోబోను విజయవంతంగా తయారు చేశారు. ఈ విప్లవాత్మక ఆవిష్కరణ రోబోటిక్స్ చరిత్రలోనే ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది.

ఈ నూతన రోబోట్, సాధారణ రోబోలతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉంటుంది. దీని ప్రత్యేకత ఏమిటంటే.. ఇది తన ఆకారాన్ని అవసరాన్ని బట్టి మార్చుకుంటుంది. చూడ్డానికి జెల్లీ లాగా, లేదా ఒక చిక్కటి ద్రవం లాగా కనిపించే ఈ రోబో అత్యంత చిన్న, కఠినమైన ప్రదేశాల్లోకి కూడా సులభంగా ప్రవేశించగలదు. ఇది మెత్తని పదార్థాలతో (సాఫ్ట్ రోబోటిక్స్) తయారు చేయబడినందున, సంక్లిష్టమైన ప్రదేశాల్లో కదలడానికి, సున్నితమైన పనులను నిర్వహించడానికి ఇది అద్భుతమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ ద్రవ రోబోను ముఖ్యంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో అభివృద్ధి చేశారు. మానవ శరీరం లోపల సాధారణ పరికరాలతో చేరుకోలేని క్లిష్టమైన భాగాలలో, ఈ రోబోను ఉపయోగించి సున్నితమైన పనులను నిర్వహించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉదాహరణకు:నిర్దిష్ట ప్రాంతాలకు ఔషధాల పంపిణీ క్యాన్సర్ కణాలు ఉన్న చోటికి లేదా ఇన్ఫెక్షన్ ఉన్న ప్రాంతానికి నేరుగా ఔషధాలను చేర్చడానికి ఇది ఉపయోగపడుతుంది, తద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ను తగ్గించవచ్చు. అతి తక్కువ కోతలతో శస్త్రచికిత్సలు చిన్నపాటి కోతల ద్వారా లేదా సహజ రంధ్రాల ద్వారా శరీరంలోకి ప్రవేశించి, క్లిష్టమైన శస్త్రచికిత్సలను నిర్వహించే అవకాశం ఉంది. అంతర్గత పరీక్షలు, నమూనాల సేకరణ శరీరంలోని లోపలి భాగాలను పరీక్షించడానికి లేదా నమూనాలను సేకరించడానికి ఇది సహాయపడుతుంది. శరీరం లోపల క్లిష్టమైన పనులను నిర్వహించడానికి ఈ రోబోట్ దాని ఉష్ణోగ్రతను మార్చుకోవడం ద్వారా లేదా అయస్కాంత క్షేత్రాల సహాయంతో తన ఆకారాన్ని మార్చుకోగలదని పరిశోధకులు వివరిస్తున్నారు. ఈ టెక్నాలజీ భవిష్యత్తులో వైద్య చికిత్సలను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా, రోగులకు తక్కువ బాధ కలిగించే విధంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆవిష్కరణ రోబోటిక్స్, మెడికల్ టెక్నాలజీలో ఒక సరికొత్త మైలురాయిగా నిలవనుంది.

# భారత సంతతి విద్యార్థినిపై నిషేధం



**వాషింగ్టన్-నవభూమి:** అమెరికాలోని ప్రముఖ విద్యాసంస్థ మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో చోటుచేసుకున్న ఒక ఘటన విద్యా వర్గాల్లో తీవ్ర చర్చలకు దారి తీసింది. క్లాస్ ప్రెసిడెంట్ అయిన భారత సంతతి విద్యార్థిని మేఘా వేమూరి పాలస్తీనా పట్ల మద్దతు తెలిపినందుకు యూనివర్సిటీ యాజమాన్యం ఆమెపై నిషేధం విధించింది. గ్రాడ్యుయేషన్ వేడుక సందర్భంగా వేదికపై మాట్లాడిన మేఘా వేమూరి, ఇజ్రాయెల్ పాలస్తీనా ప్రజలపై కొనసాగిస్తున్న దాడులపై తీవ్ర విమర్శలు చేశారు. అమెరికా ప్రభుత్వం , %వీ×ు% లాంటి విద్యాసంస్థలు ఇజ్రాయెల్‌కు పరోక్ష మద్దతు ఇస్తున్నాయంటూ ఆమె ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలు విన్న వెంటనే వేదికపై నిరసనలు ప్రారంభమయ్యాయి. వివాదం రేగిన నేపథ్యంలో యూనివర్సిటీ యాజమాన్యం ఆమెపై నిషేధం విధించింది. స్పందన ఈ విషయంలో స్పందించిన %వీ×ు% యాజమాన్యం, "భావప్రకటనా స్వేచ్ఛను మేము గౌరవిస్తాము. కానీ, గ్రాడ్యుయేషన్ వంటి అధికారిక కార్యక్రమాలలో రాజకీయ వ్యాఖ్యలు.. నిరసనలకు ఇది సరైన వేదిక కాదు," అని స్పష్టం చేసింది. విద్యార్థినిపై తీసుకున్న చర్య సంస్థాగత నియమాల పరంగా తీసుకున్నదని పేర్కొంది. - భావ స్వేచ్ఛ వ్యవస్థాపిక నిబంధనలు ఈ పరిణామం విద్యా సంస్థల్లో వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తీకరించే స్వేచ్ఛపై మరోసారి చర్చ ప్రారంభించింది. మేఘా వేమూరి తన భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసినందుకు ఆమెను శిక్షించడం సమంజసమా? లేక విద్యాసంస్థల నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవైపు విద్యార్థులు రాజకీయంగా చైతన్యంతో ఉండాలని, మానవ హక్కుల కోసం గళమెత్తాలని కోరుకునే వర్గాలు ఉన్నా, మరోవైపు విద్యా సంస్థలు తమ కార్యక్రమాలను చక్కగా నిర్వహించేందుకు నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందని వాదించే వర్గాలు ఉన్నాయి. పెరుగుతున్న ఆందోళనలు ఈ సంఘటనకు ముందుగా, అమెరికాలోని పలు యూనివర్సిటీలలో ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణ నేపథ్యంలో విద్యార్థుల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. మేఘా వేమూరిపై తీసుకున్న చర్య ఈ నిరసనల తీవ్రతను మరోసారి హైలైట్ చేస్తోంది. భారత సంతతికి చెందిన విద్యార్థినిపై ఈ స్థాయిలో చర్యలు తీసుకోవడం కూడా భారతీయ సమాజంలో చర్చనీయాంశంగా మారింది. మేఘా వేమూరిపై విధించిన నిషేధం వ్యక్తిగత హక్కులు, సంస్థాగత నిబంధనల మధ్య ఉన్న సున్నిత సమతౌల్యాన్ని ఎత్తిచూపుతోంది. భావప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందనిపించినా, సంస్థల నిబంధనల పరిధిలోని వ్యవహారాల్ని విస్మరించలేం. ఈ ఘటన విద్యార్థుల పాత్ర, సంస్థల బాధ్యత, సమాజానికి విద్యాసంస్థలు ఇచ్చే సందేశం పట్ల మనం మళ్ళీ ఆలోచించాల్సిన అవసరం ఉందని సూచిస్తుంది.

# టర్కీకి కోలుకోలేని షాకిచ్చిన ఇండియా



**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి సమయంలో టర్కీ పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడంతో భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతిగా, టర్కీకి చెందిన సెలెబ్ ఏవియేషన్ సంస్థ సెక్యూరిటీ క్లియరెన్స్‌ను రద్దు చేయడంతో పాటు, టర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో ఇండిగో, ఎయిర్ ఇండియా చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కేంద్రం ఆదేశించింది. ఆగస్టు 31 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని గడువు విధించింది. తద్వారా టర్కీకి ఆర్థికంగా నష్టం వాటిల్లేలా భారత్ చర్యలు చేపట్టింది. పహల్గాం ఉగ్రదాడి వేళ.. మనకు మిత్రులు ఎవరు.. శత్రవులు ఎవరో స్పష్టంగా తెలిసింది. పహల్గాం ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ఖండించి.. భారత్‌కు మద్దతుగా నిలిచాయి. కానీ అజర్‌బైజాన్, టర్కీ దేశాలు పాకిస్థాన్‌కు మద్దతి చ్చాయి. మరీ ముఖ్యంగా టర్కీ చర్యలు భారతీయులకు ఆగ్రహం తెప్పించాయి. ఒకప్పుడు సమస్యల్లో ఉన్న టర్కీని భారత్ ఆదుకుంటే.. అది విశ్వాసం మరిచిపోయి.. ఉగ్రదాడి వేళ పాకిస్థాన్‌తో కలిసి ఇండియాపై విషం చిమ్మింది. పైగా ఆపరేషన్ సిందూర్ వేళ.. పాక్‌కు అన్ని విధలా అండగా నిలిచింది. ఈక్రమంలో టర్కీకి బుద్ధి చెప్పేందుకు భారత్ రెడీ అయ్యింది. టర్కీకి చెందిన వస్తువులను బ్యాన్ చేయడమే కాక.. ఆ దేశం నుంచి దిగుమతులు నిలిపివేసింది. తాజాగా మరో కీలక నిర్ణయంతో టర్కీకి చావు దెబ్బ రుచి ఎలా ఉంటుందో చూపించేందుకు ఇండియా రెడీ అయ్యింది. మూడు నెలల్లోనే దీన్ని అమలు చేయాలని నిర్ణయించింది మోదీ ప్రభుత్వం. ఇంతకు ఆ నిర్ణయం ఏంటంటే..చేసిన మేలు మరిచి.. ఇండియాకు నష్టం వాటిల్లేలా చేయాలని భావించిన టర్కీకి భారత్ ఊహించని రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. దీనిలో భాగంగా ఇండిగో ఎయిర్ లైన్స్.. టర్కీ ఎయిర్‌లైన్స్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. మూడు నెలల్లో ఇరు సంస్థల మధ్య ఉన్నఈ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని ఇండిగోకు సూచించింది. టర్కీకి చెందిన సెలెబ్ ఏవియేషన్ అనే ఎయిర్‌ఫోర్స్ కంపెనీ.. ఇండియాలోని 9 కీలక ఎయిర్ పోర్టుల్లో సేవలు అందిస్తోంది. వీటిల్లో ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉంది.

## జై పాక్ యాత్రగా.. జైహింద్ యాత్ర



**న్యూఢిల్లీ-నవభూమి:** కాంగ్రెస్ చేపట్టిన 'జై హింద్ యాత్ర' కాస్తా "జై పాకిస్థాన్ యాత్ర"గా మారిందని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఆ యాత్రను ఆపివేసి, బదులుగా పాకిస్థాన్‌తో కలిసి ఒక ఉమ్మడి విలేకరుల సమావేశం పెట్టాలని వ్యంగ్యంగా సూచించారు. భారత్ - పాక్ మధ్య ఇటీవలి వివాదంపై కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను సంబిత్ శుక్రవారం తిప్పికొట్టారు. రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంటి కాంగ్రెస్ సీనియర్ నాయకులు భారత యుద్ధ విమానాల నష్టాల గురించి అడుగుతున్నారే తప్ప పాకిస్థాన్‌లో ధ్వంసమైన ఉగ్రవాద శిబిరాల వివరాలపై వారికి అంతగా ఆసక్తి లేనట్లుందని ఆయన విమర్శించారు.

## పాక్‌లో ఉగ్రవాదులు మరణిస్తే సంతాపమా..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు చనిపోతే వారికి కొలంబియా సంతాపం తెలియజేయడంపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అసహనం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పాక్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు వివిధ దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శశిథరూర్ నేతృత్వంలోని బృందం కొలంబియా రాజధాని నగరంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సానుభూతి తెలియజేయకుండా.. భారత్ చేసిన దాడుల్లో పాక్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలియజేయడం తమకు నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులను కొలంబియా ప్రభుత్వానికి వివరించేందుకు తాము సిద్ధమని ఆయన వెల్లడించారు.

## బీజేపీ పాలనలో పెరిగిన బ్యాంకు మోసాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో గత 11 ఏళ్లలో బ్యాంకు మోసాలు విపరీతంగా పెరిగిపోయాయని.. దీనికి బీజేపీ పాలనే కారణమంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మోసాలు, కుతంత్రాలతోనే మోదీ సర్కారు నడుస్తోందంటూ ఆరోపణలు గుప్పించారు. 'గత 11 ఏళ్ల మోదీ పాలనలో రూ.6,36,999 కోట్ల బ్యాంకు మోసాలు జరిగాయి. ఇది 416% పెరుగుదల. నోట్ల రద్దు తర్వాత కూడా.. గత ఆరేళ్లలో నకిలీ రూ.500 నోట్ల సంఖ్య 291 శాతం పెరిగింది. అందులోనూ ఈ ఏడాదే ఇంకా అత్యధికం..' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## ఆయుష్ సురక్షా పోర్టల్ ప్రారంభం




**న్యూఢిల్లీ-నవభూమి:** సంప్రదాయ వైద్యంపై తప్పుదోవ పట్టించే ప్రకటనలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆయుష్ సురక్షా పోర్టల్‌ను కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాపరావు జాదవ్ శుక్రవారం ఇక్కడ ప్రారంభించారు. గత ఏడాది సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్రం ఈ పోర్టల్‌ను రూపొందించింది. తప్పుదోవపట్టించే ప్రకటనలు, మందుల దుష్ప్రభావాలపై ఈ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. సామాన్య ప్రజలతో పాటు, వైద్యులకు కూడా ఇది ఉపకరిస్తుందని మంత్రి చెప్పారు. దీని ద్వారా ఫిర్యాదులు చేసే అవకాశం కూడా ఉందని ఆయుష్ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా తెలిపారు.



## డైకి గుడ్‌బై!



మూడు పదులు దాటకుండానే.. మాడు మొత్తం ముగ్గుబుట్టలా మారిపోతున్నది. చేసేదిలేక 'హెయిర్ డై' వేయాల్సి వస్తున్నది. దీంతో జుట్టు నల్లబడ్డా.. లేనిపోని రోగాల ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ సమస్యకు 'ఆయుర్వేదం' చక్కని పరిష్కారం చెబుతున్నది. ఉసిరి, భృంగరాజ్‌తో 'హెయిర్ డై'కి గుడ్‌బై చెప్పొచ్చని అంటున్నది.ఒక గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల చొప్పున ఉసిరి పొడి, భృంగరాజ్ పొడి, కొబ్బరి లేదా నువ్వుల నూనెను తీసుకోవాలి. గిన్నెను స్టవ్‌మీద పెట్టి.. సన్నని మంటపై వేడిచేయాలి. కొద్దిగా చల్లబడిన తర్వాత.. జుట్టు కుదుళ్లకు బాగా పట్టించాలి. రాత్రంతా అలాగే ఉంచి.. ఉదయాన్నే తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి.ఒక టేబుల్ స్పూన్ కొబ్బరినూనెకు, ఒక టేబుల్ స్పూన్ ఉసిరిపొడిని కలపాలి. ఈ మిశ్రమాన్ని కొద్దిగా వేడిచేసుకొని.. కాస్త చల్లారిన తర్వాత జుట్టుకు బాగా పట్టించాలి. అరగంటపాటు అలాగే వదిలేసి.. చల్లటి నీటితో తలస్నానం చేయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే.. తెల్ల జుట్టు సమస్య తగ్గి.. జుట్టు ఒత్తుగా మారుతుంది.కొన్ని కరివేపాకులు, ఉసిరిపొడి, బ్రాహ్మీపొడి ఒక్కో టేబుల్ స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఈ మూడిటినీ మెత్తగా రుబ్బుకుని, దానికి కొద్దిగా నీళ్లు కలిపి పేస్ట్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి.. గంట తర్వాత తలస్నానం చేయాలి. వారానికి ఒకసారైనా ఇలా చేస్తే.. తెల్లజుట్టు సహజంగానే నల్లగా మారిపోతుంది.



## క్రీడల అభివృద్ధికి కవితారెడ్డి నిరంతర కృషి



వైద్యం... ఆమె వృత్తి. ఎంతోమంది పేద మహిళలకు వైద్య సహాయం అందిస్తున్నారు. ఫుట్‌బాల్... ఆమెకు ఆసక్తి. గ్రామీణ బాలికలకు ఉచితంగా శిక్షణనిచ్చి ప్రోత్సహిస్తున్నారు. తన పేరిట ఓ అకాడమీ నెలకొల్పి... మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి... రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా నిజామాబాద్ ప్రజల ప్రశంసలు అందుకొంటున్న సామాజిక కార్యకర్త, గైనకాలజిస్టు... డాక్టర్ కవితారెడ్డి పంచుకున్న విశేషాలివి.

"నిత్యం మన చుట్టూ ఎన్నో సామాజిక సమస్యలు. వాటి పరిష్కారానికి ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూస్తుంటాం. కానీ ఈ సమాజంలో జీవిస్తున్న వ్యక్తులుగా మనమూ కొంత బాధ్యత తీసుకోవాలి. అందుకే నావంతు ప్రయత్నం చేస్తున్నాను. ఇది ఎవరి మెప్పు కోసమో కాదు... గ్రామీణ బాలికలు, మహిళల వికాసం కోసం. ముప్పై ఏళ్ల కిందట నిజామాబాద్‌లో మొదలైంది నా ఈ ప్రయాణం. నా వద్దకు ఎక్కువగా గర్భిణులు, బాలికలు వైద్యం కోసం వచ్చేవారు. కొందరిలో బలహీనత, అలసట లాంటివి గమనించాను. అనుమానం వచ్చి వారికి వైద్య పరీక్షలు చేయించాను. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత (అనీమియా) ఉన్నట్టు గుర్తించాను. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి సరైన పోషకాహారం లభించక తలెత్తిన సమస్య ఇది. వారికి అవగాహన కల్పించడంతో పాటు వైద్యం, అవసరమైన మందులు ఇచ్చాను. అయితే ఇది ఒకరిద్దరి సమస్య కాదని అర్థమైంది. అది నిరంతరం కొనసాగిల్సిన ప్రక్రియ. ఈ పరిస్థితిలో కొంతైనా మార్పు తేవాలన్న ఉద్దేశంతో 'డాక్టర్ కవిత ఫౌండేషన్'ను నెలకొల్పాను. దాని ద్వారా ఉచిత వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.

**విద్యార్థినుల కోసం...**

మావారు డాక్టర్ రవీందర్‌రెడ్డి సహకారంతో ఫౌండేషన్ ద్వారా సేవలు మరింత విస్తరించాను. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాను. జిల్లాలోని పాఠశాలల్లో సుమారు పదివేల మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించాం. రక్తహీనత ఉన్నవారికి అవగాహన కల్పించాం. తగు సూచనలు, మందులు ఇచ్చాం. దీంతోపాటు ఇతర సేవా కార్యక్రమాలు కూడా మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టాం.

**అకాడమీకి అంకురార్పణ...**

ఇదిలావుంటే... 2019లో కొన్ని క్లబ్స్ కలిసి నిజామాబాద్‌లో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించాయి. దానికి మా ఫౌండేషన్ సహకారం అందించింది. స్థానికంగా మంచి స్పందన వచ్చింది. ఇది నాలో కొత్త ఆలోచనలను రేకెత్తించింది. ఆ క్రమంలోనే గ్రామీణ ప్రాంత బాలికలకు ఫుట్‌బాల్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. ఈ పోటీల నేపథ్యంలో నేను గమనించింది ఏంటంటే... గ్రామీణ బాలికల్లో ఫుట్‌బాల్ ఆడగలిగే శక్తిసామర్థ్యాలు ఉన్నాయని. అయితే తగిన ప్రోత్సాహం, ఆర్థిక వనరులు లేక వెనకడుగు వేస్తున్నారని తెలుసుకున్నాను. ఆసక్తివున్న వారిని గుర్తించి సరైన శిక్షణ అందిస్తే వీళ్లు కూడా మెరికల్లా తయారవుతారని అనుకున్నాను. అందుకు అనుగుణంగానే ఆరేళ్ల కిందట 'డాక్టర్ కవితారెడ్డి ఫుట్‌బాల్ అకాడమీ' ఏర్పాటు చేశాను.

**ఆదరణ కల్పించాలని...**

దేశంలో క్రికెట్, టెన్నిస్ తదితర క్రీడలకు ఉన్న ఆదరణ ఫుట్‌బాల్‌కు లేదు. ప్రత్యేకించి మన రాష్ట్రంలో ఫుట్‌బాల్ వైపు ఎవరూ రావడంలేదు. ముఖ్యంగా మహిళలు. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది ఆసక్తి చూపుతున్నా వారికి ప్రోత్సాహం లభించడంలేదు. ప్రభుత్వాలు, కార్పొరేటు సంస్థలు కూడా ఇతర క్రీడలకు ఇచ్చినంత ప్రాముఖ్యత ఫుట్‌బాల్‌కు ఇవ్వడంలేదు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఫుట్‌బాల్‌కు పూర్వ వైభవం తేవడానికి నావంతు ప్రయత్నం చేయాలనుకున్నాను. దానిలో భాగమే అకాడమీ ఏర్పాటు. అందులో ఒక కోచ్‌ను నియమించాం.

**క్రీడా పోటీలు...**

మా అకాడమీలో హాస్టల్ సదుపాయం కూడా కల్పించాం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్థిక స్తోమత లేని బాలికలకు ఉచితంగా వసతి, శిక్షణ అందిస్తున్నాం. అకాడమీలో శిక్షణ పొందిన పలువురు అమ్మాయిలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వివిధ స్థాయిల్లో పోటీలు కూడా నిర్వహిస్తున్నాం. గత ఏడాది రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ మార్గదర్శకత్వంలో సీనియర్ ఉమెన్ ఫుట్‌బాల్ టోర్నీని విజయవంతంగా పూర్తి చేశాం. ఈ నెల 15 నుంచి 22 వరకు మహిళా కళాశాలలో ఎనిమిది రోజులపాటు తెలంగాణ ఉమెన్స్ లీగ్ నిర్వహించాం. రాష్ట్రానికి చెందినవారే కాకుండా బిహార్, చత్తీసఘడ్ క్రీడాకారులు కూడా పోటీపడ్డారు.

**ఇంకా ఎన్నో...**

మా ఫౌండేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు, బాలికలకు పోషకాహారం ఆవశ్యకతను వివరించి చెబుతున్నాం. మా నర్సింగ్‌హోమ్‌కు వచ్చేవారికి తక్కువ ఖర్చులోనే వైద్యం చేస్తున్నాం. పేదలకు ఉచిత సేవలు అందిస్తున్నాం. భవిష్యత్తులో వ...

## అల్లనేరేడు చెట్టుకాడ..

### ఆరోగ్య ప్రదాయిని అల్లనేరేడు.. కిడ్నీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధం



కొంచెం తీపి మరికొంచెం వగరుగా ఉండే అల్లనేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. మార్కెట్‌లో నిగనిగలాడుతూ నోరూరిస్తున్నాయి. వీటిని ఇష్టపడని వారుండరంటే అతిశయోక్తికాదు. అల్లనేరేడు పండ్లు ఆరోగ్యానికి మేలు చేకూరుతాయని వైద్యులు కూడా చెబుతున్నారు. ఇందులో విశిష్ట గుణాలుం టాయని పేర్కొంటున్నారు. మధుమేహం, కిడ్నీ రోగులకు ఇవి దివ్యఔషధంగా పనిచేస్తాయి. అల్లనేరేడు పండ్ల చెట్లు గతంలో ఎటుచూసినా ఇళ్ల ఆవరణలో కనపడేవి. కానీ కాలక్రమేనా అవి ఇళ్లలో కాకుండా ఎక్కువ శాతం అడవి ప్రాంతంలోనే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో హైబ్రిడ్ రకం పండ్లు జోరుగా రావడంతో డిమాండ్ బాగా పెరిగింది. సాధారణ రకం నేరేడుపండ్లు మార్కెట్లో కిలో రూ.100 పలుకగా, హైబ్రిడ్ రకం పండ్లయితే రూ.150 వరకు ఉంటుంది. ప్రతి ఏడాది మే, జూన్ మాసాల్లోనే వచ్చే ఈ నేరేడు పండ్ల కోసం గ్రామాలలోని కొంత మంది రోజు కూలీలు ఉదయమే అడవిబాట పట్టి మధ్యాహ్నం వరకు గంపలలో తీసుకొచ్చి మార్కెట్లో విక్రయిస్తుంటారు.ప్రస్తుతం పండ్ల షాపులలో హైబ్రిడ్ పండ్లు అమ్మకాలు జరుపడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అల్లనేరేడు పండ్లు విక్రయించే వారు రామాయంపేట పట్టణంతో పాటు మండలంలోని ఏ ప్రాంతంలో చూసినా వీరి విక్రయాలు కనిపిస్తున్నాయి.దీంతో ప్రజలు ఈ పండ్లపై చాలా ఆసక్తి కనబరుస్తున్నారు.

**గర్భిణీలకు ఎంతో మేలు..**

అల్లనేరేడు పండ్లు సర్వరోగ నివారిని ఈ పండ్లలో ఏ.సీ.విటమిన్లు పుష్కలంగా ఉంటాయని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ హరిప్రియ చెప్పారు. ఈ పండ్లు మనలో ఉన్న మలినాలను, విషాన్ని అరికట్టడంతోపాటు రుచికూడా అధికంగా ఉంటుంది. దీంతో ఎక్కువ శాతం ప్రజలు మొగ్గు చూపుతారు. ముఖ్యంగా గర్భంతో ఉన్న మహిళలు ఈ పండ్లను తింటే వారికెంతో మేలు చేకూరుతుంది. మధుమేహ వ్యాది గ్రస్తులు, కిడ్నీ, షుగర్, నోటిపూత, నోటి క్యాన్సర్, మూత్రాశయ సమస్యలకు టానిక్‌లా పనిచేస్తాయి. నేరేడు గింజలను చూర్ణం చేసి తాగితే షుగర్ లెవల్‌ను తగ్గడంతోపాటు చిగుళ్లవ్యాదితో బాధపడే వారికి త్వరగా ఉపశమనం కలుగుతుంది.

**సీజన్‌లోనే విక్రయాలు..**

అల్లనేరేడు పండ్లు ఎండాకాలంలోనే లభిస్తాయని నిజాంపేట మండలం నస్కల్ గ్రానికి చెందిన సుగుణ అనే మహిళ అన్నారు. గతంలో అడవికి దగ్గరలోనే ఉంటుండే. ప్రస్తుతం అవి దొరకాలంటే అడవిలో కిలోమీటర్ల దూరం వెళ్లాలి. ప్రతిరోజు తెల్లవారుజామున లేచి పది కిలోమీటర్ల మేర అడవికి పోతే ఎక్కడో ఓ చోట చెట్టు కనిపిస్తది. ఆ చెట్టు పైకెక్కి జాగ్రత్తగా పండ్లను తెంపాలి. ఏ మాత్రం అజాగ్రత్త వహిస్తే పండ్లన్నీ చెడిపోతాయి. నేరేడు పండ్లను గంపలలో తీసుకొచ్చి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అమ్ముతాం. ప్రస్తుతం కిలో రూ.100 విక్రయాలు జరుపుతున్నామని తెలిపారు.

### అల్లనేరేడుతో లాభాలు..

**మధుమేహ నివారణలో..**రక్తంలో చక్కెర నిల్వల స్థాయిలను క్రమబద్ధీకరించడంలో జామూన్లు చాలా గొప్పగా పనిచేస్తాయి. వీటి గింజల్లో జంబోలిన్, జాంబోసిన్ అనే సమ్మేళనాలు ఉండి వీటిని తినగానే రక్తంలోకి చక్కెర విడుదల రేటును నియంత్రిస్తాయి. జామూన్ విత్తనాలు కూడా ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతాయి. ఫైబర్ కలిగి ఉండి..అల్లనేరేడు కడుపు ఆరోగ్యాన్ని పెంచుతాయి. వీటి గింజలను తినడం వల్ల కడుపు సంబంధ సమస్యలను నివారించవచ్చు. వీటిలో ఫైబర్ కంటెంట్ అధికంగా ఉండి జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది.ఇవి పేగుల్లో పుండ్లు, మంట, పూతలను ఎదుర్కోవడానికి ఔషధంగా కూడా ఉపయోగించవచ్చు.

**రక్తపోటు నివారణలో..**నేరేడు పండ్లు రక్తపోటు నివారణలో గ్రేట్‌గా పనిచేస్తుంది. వీటి విత్తనంలో ఎల్లాజిక్ యాసిడ్ అనే యాంటీఆక్సిడెంట్ రక్తపోటు హెచ్చుతగ్గులను తనిఖీ చేయడంలో సహాయపడుతుంది. రక్తపోటుతో బాధపడేవారు వీటిని ఎక్కువగా తినడం వల్ల ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.

**రోగనిరోధక శక్తిలో..**అల్ల నేరేడు గింజల్లో ఫ్లేవనాయిడ్స్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు రోగ నిరోధకశక్తిని పెంపొందిస్తాయి. అలాగే వీటిలోని ఫ్రీ రాడికల్స్‌ను దూరంగా ఉంచడంలో సహాయపడే ఫినాలిక్ సమ్మేళనాలు ఉంటాయి.

**బరువు తగ్గడంలో..**శరీరం బరువు తగ్గడంలో నేరేడు పండ్లు సహకరిస్తాయి. వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉండి ఆకలి భావన రాకుండా చూస్తాయి. ఫలితంగా శరీరం బరువు తగ్గించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తుంది.

## గిల్టు నగల మన్నిక కోసం ఇలా చేయాలి..!

మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ప్రస్తుతం రకరకాల గిల్టు నగలు అందుబాటులో ఉన్నాయి. చీర, గౌను, ట్రెండీ డ్రెస్ ఇలా ఏ అవుట్‌ఫిట్ మీదనైనా చక్కగా అమరుతాయి ఈ నగలు. తక్కువ బరువుతో సౌకర్యవంతంగా అనిపిస్తాయి. అందుకే మహిళలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఎంతో ముచ్చట పడి కొనుక్కున్న గిల్టు నగలను ధరించేటప్పుడు చిన్న చిట్కాలు పాటిస్తూ సరైన పద్ధతిలో భద్ర పరచుకుంటే అవి ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. ఆ వివరాలు తెలుసుకుందాం...

గిల్టు నగలకు తడి తగిలితే అవి బంగారు మెరుపును కోల్పోతాయి. అందుకే గొలుసులు, హారాలు, నెక్లెసలు, గాజులు, ఉంగరాలను స్నానం చేసేటప్పుడు తీయడం మంచిది. చేతులు కడుక్కునేటప్పుడు కూడా



వాటికి తడి తగలకుండా చూసుకోవాలి.మేకప్ ఉత్పత్తులు, మాయిశ్చరైజర్, పర్‌ఫ్యూమ్, లోషన్, డియోడరెంట్‌లు వాడేముందు గిల్టు నగలు ధరించకూడదు. అలా చేస్తే ఈ ఉత్పత్తుల్లోని రసాయనాల వల్ల నగలకు ఉన్న గోల్డ్ ప్లేటింగ్ తొలగిపోయి అవి నల్లబడే అవకాశం ఉంటుంది. మేకప్ పూర్తయి పర్‌ఫ్యూమ్ చల్లుకున్న అయిదు నిమిషాల తరవాతనే గిల్టు నగలు ధరించడం మంచిది.వేసవికాలంలో ఎక్కువగా చెమట పట్టే సమయాల్లో ఈ నగలు వేసుకోవద్దు. చెమట తగిలితే నగలు నలుపుతిరుగుతాయి.దుస్తులు ధరించిన తరవాతనే నగలు వేసుకోవాలి. లేదంటే దుస్తులకు ఉండే దారాలు, పోగులు పట్టుకుని నగలు విరిగిపోవచ్చు. నగల్లో ఉండే రాళ్లు, పూసలు రాలిపోవచ్చు.

ఒకసారి ధరించిన నగలను భద్రపరచేముందు వాటిని వెల్వెట్ వస్త్రం లేదా పలుచని కాటన్ గుడ్డతో మెల్లగా తుడవాలి. నగలకు అంటుకున్న చెమట, దుమ్ము లాంటి వాటిని పూర్తిగా తొలగించాలి. లేదంటే నగలు మెరుపును కోల్పోయి పాతబడతాయి.గిల్టు నగలను అన్నింటినీ ఒకే బాక్సులో పెట్టకూడదు. అలా పెడితే ఒకదానికి మరోటి రాసుకుని వాటి మీద గీతలు పడతాయి. మెరుపుదనం తగ్గుతుంది. నగలను వాటికి నిర్దేశించిన బాక్సుల్లో మాత్రమే జాగ్రత్త చేయాలి.ఈ నగలను గాలి, వెలుతురు చొరబడని పెట్టె లేదా సంచిలో పెట్టి ఉంచితే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. పలుచని గుడ్డలో చుట్టి పెడితే వాటి మెరుపుదనం చాలాకాలం వరకూ నిలిచి ఉంటుంది.

## ఈ లక్షణాలు కనబడితే... నిర్లక్ష్యం వద్దు...

మధుమేహం హఠాత్తుగా రాదు. వచ్చే ముందు అనేక లక్షణాలు కనబడతాయి. కానీ వాటిని చాలా మంది పట్టించుకోరు. ముఖ్యంగా మహిళలలో ఈ ధోరణి ఎక్కువగా కనబడుతుంది. అందువల్ల 40 ఏళ్లు దాటిన వారు- ప్రతి ఆరునెలలకు ఒక సారి అన్ని పరీక్షలు చేయించుకుంటే మంచిది. దీని వల్ల మన శరీరంలో మనం గమనించని రుగ్మతలు ఏవైనా ఉంటే అవి బయటపడతాయి. ఇక మధుమేహం విషయానికి వస్తే- ఈ కింది లక్షణాలు మీకు కూడా తప్పనిసరిగా కనబడే ఉంటాయి. కానీ వాటిని మీరు

తప్పకుండా రాత్రిళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తోందంటే- అది మధుమేహ లక్షణమే అని కచ్చితంగా చెప్పవచ్చు.

చాలా సార్లు మధుమేహం వచ్చినవారు హఠాత్తుగా బరువు తగ్గిపోతూ ఉంటారు. ఈ మధ్యకాలంలో ఎక్కువ మంది బరువు తగ్గటానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలు ఏమి చేయకుండానే బరువు తగ్గుతుంటే అది మధుమేహ లక్షణమని కచ్చితంగా చెప్పవచ్చు. మధుమేహం ఉన్న వారి కణాలకు





ఉన్నప్పుడు- మన కిడ్నీలు అదనపు సుగర్‌ను బయటకు పంపటానికి ప్రయత్నిస్తాయి. దీని వల్ల ఎక్కువ సార్లు బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తుంది. చాలా మంది మహిళలకు యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు కూడా ఎక్కువ సార్లు బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తుంది.

అందువల్ల ఈ రెండు లక్షణాలు ఒకటే అనుకొనే ప్రమాద ముంది. కనీసం 15 రోజులు- క్రమం

మధుమేహం ఉన్నట్లు కచ్చితంగా చెప్పవచ్చు. ఇదే విధంగా చాలా సార్లు రాత్రిళ్లు పడుక్కొనే సమయంలో కాళ్లు తిమ్మిర్లెక్కుతాయి. చాలా మంది పొద్దున్న నుంచి నిలబడి ఉండటం వల్ల కాళ్ల నెప్పులతో పాటుగా తిమ్మిర్లు ఎక్కాయనుకుంటారు. కానీ వాస్తవానికి మధుమేహం ఉన్నవారికి ఈ తిమ్మిర్ల సమస్య ఎక్కువగా ఉంటుంది. అందువల్ల రాత్రిళ్లు పడుక్కొనే సమయంలో తిమ్మిర్లు అనిపిస్తే మధుమేహం ఉందా? లేదా అనే పరీక్ష చేయించుకోవటం ఎంత్తైనా మంచిది.మధుమేహం వస్తే కంటి సమస్యలు కూడా పెరుగుతాయి. కళ్లు మసకబారటం వంటి లక్షణాలు కనబడతాయి. చాలా సార్లు కంటి చూపు మందగించటం వల్ల ఈ సమస్యలు ఏర్పడతాయని భావించి కంటి డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ అంతకన్నా ముందు మధుమేహ పరీక్ష చేయించుకోవటం మంచిది.



## రోజుకో నువ్వుల లడ్డూను తింటే ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయా..?



నువ్వుల లడ్డూలను తింటే అనేక పోషకాలను పొందవచ్చు. ఇవి మనకు రోగాలు రాకుండా చూస్తాయి. శక్తిని అందిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఈ సీజన్‌లో వచ్చే దగ్గు, జలుబు, ఫ్లూ వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. కఫం కరిగిపోతుంది.

**శక్తికి, ఎముకల దృఢత్వానికి..**

నువ్వుల్లో ఉండే బెల్లం కారణంగా ఇందులో ఉండే సహజసిద్ధమైన చక్కెరలు మన శరీరానికి తక్షణమే శక్తిని అందిస్తాయి.


సాయంత్రం అయిందంటే చాలు, చాలా మంది అనేక రకాల తినుబండారాలు లేదా నూనె పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్ వంటివి తినేందుకు ఎక్కువ ఆసక్తిని చూపిస్తుంటారు. అయితే అలాంటివి తింటే ఆరోగ్యానికి హాని కలుగుతుంది. అందువల్ల మనం తినే స్నాక్స్ కూడా ఆరోగ్యవంతమైనవి అయి ఉండాలి. పూర్వ కాలంలో మన వాళ్లు అనేక రకాల తినుబండారాలను చేసి తినేవారు. వాటిల్లో నువ్వుల లడ్డూలు కూడా ఒకటి. వీటినే నువ్వుల ఉండలు అని కూడా అంటారు. ఆధునీకరణ పుణ్యమా అని ఇలాంటి తినుబండారాలను చాలా మంది తినడం మానేశారు. కానీ ఇవి మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందించడమే కాదు, శక్తిని, పోషణను కూడా ఇస్తాయి. ఈ క్రమంలోనే రోజుకు ఒక నువ్వుల లడ్డూను తప్పనిసరిగా తినాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల అనేక లాభాలు ఉంటాయని వారు అంటున్నారు.

**పోషకాలకు నిలయం..**

నువ్వుల లడ్డూలను పోషకాలకు గనిగా చెబుతారు. ఈ లడ్డూలలో క్యాల్షియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్, ఐరన్, జింక్, కాపర్, మాంగనీస్ వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవే కాకుండా ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు బి1, బి3, బి6, ఫోలేట్ సైతం ఈ లడ్డూల్లో అధికంగా ఉంటాయి. నువ్వుల లడ్డూల్లో వాడే ప్రధాన పదార్థాల్లో ఒకటి బెల్లం. ఇది సహజసిద్ధమైన తీపి పదార్థంగా పనిచేస్తుంది. ఇందులో ఐరన్, పొటాషియం, మెగ్నిషియం, కొన్ని రకాల బి విటమిన్లు ఉంటాయి. బెల్లాన్ని చాలా మంది చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తారు. అందువల్ల బెల్లంతో తయారు చేసిన నువ్వుల లడ్డూను ఒకటి తింటే చాలు అలసిన శరీరం తక్షణమే శక్తిని పొందుతుంది. శారీరక శ్రమ చేసేవారు, వ్యాయామం చేసేవారు ఒక్క లడ్డూను తింటే త్వరగా శక్తి లభిస్తుంది. కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతారు. మళ్లీ పనిచేసేందుకు కావల్సిన శక్తి లభిస్తుంది. అలాగే నీరసం, అలసట తగ్గిపోతాయి. యాక్టివ్‌గా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. నువ్వులలో క్యాల్షియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. విరిగిన ఎముకలు ఉన్నవారు రోజుకు ఒక నువ్వుల లడ్డూను తింటే త్వరగా కోలుకుంటారు. ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. ఎముకల సాంద్రత పెరుగుతుంది. ఎముకలు బలంగా మారుతాయి.

**గుండె జబ్బులు రాకుండా..**

నువ్వులలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు వీటిల్లో అధికంగా ఉంటాయి. ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు కూడా నువ్వుల్లో ఉంటాయి. అందువల్ల నువ్వులతో తయారు చేసిన లడ్డూలను తింటే మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతో గుండె జబ్బులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. నువ్వుల లడ్డూలను తింటే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా నువ్వుల లడ్డూలను పిల్లలు, పెద్దలు రోజుకు ఒకటి తింటుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను సొంతం చేసుకోవచ్చు.



## అపోలో 8 వేల కోట్ల పెట్టుబడి

హైదరాబాద్-నవభూమి: ప్రముఖ ఆసుపత్రుల నిర్వహణ సంస్థ అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.390 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.254 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.4,944 కోట్ల నుంచి రూ.5,592 కోట్లకు ఎగబాకినట్టు వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.21,794 కోట్ల ఆదాయంపై రూ.1,446 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసుకున్నది.ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి మాట్లాడుతూ..వచ్చే ఐదేండ్లలో రూ.8 వేల కోట్ల పెట్టుబడితో మరో 4,300 పడకలను ఏర్పాటు చేయబోతున్నట్లు, దీంట్లో తొలి దశలో 2 వేల పడకల అడ్వాన్స్ స్టేజ్‌లో ఉన్నాయన్నారు. దీంతోపాటు హైదరాబాద్, పుణె, కోల్‌కతా, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలో ఏర్పాటు చేస్తున్న కేర్ టచ్‌పాయింట్లు, నూతన ఆసుపత్రులు ఈ ఏడాది అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. రోగులకు ప్రపంచస్థాయి చికిత్స అందించాలనే ఉద్దేశంతో నూతన మెడికల్ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 | హైదరాబాద్ ఆదివారం 01 । జూన్ । 2025


## సామాన్యులకు షాకింగ్.. పెరిగిన గోల్డ్, తగ్గిన వెండి ధరలు



న్యూఢిల్లీ-నవభూమి:దేశంలో పెళ్లిళ్ల సీజన్ వేళ బంగారం ధరలు హెచ్చుత గ్గులకు లోనవుతు న్నాయి. ఈ క్రమంలో నిన్న స్వల్పంగా తగ్గిన వీటి ధరలు, నేటి ఉదయం నాటికి మళ్లీ పెరిగాయి. ఈ నేపథ్యంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఈరోజు (%స్త్రశీశ్రీస తీఖ్వర్ శీఖుఎ ఖుఎ 31ర% 2025) ఉదయం 6.30 గంటల నాటికి హైదరాబాద్, విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.140 పెరిగి రూ.97,320కి చేరింది. 22 క్యారెట్ 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 89,210కు చేరుకుంది. మరోవైపు ఢిల్లీలో 24 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ.290 పెరిగిపోయి రూ.97,470కి చేరుకోగా, 22 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ.89,360కు చేరుకుంది.ఇక నేటి వెండి ధరల విషయానికి వస్తే ఇవి పసిడికి వ్యతిరేకంగా మారాయి. అంటే గోల్డ్ రేట్లు పెరిగితే ఇవి మాత్రం తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఢిల్లీలో కేజీ వెండి ధర రూ.100 తగ్గి రూ.99,800 స్థాయికి చేరుకుంది. ఇదే సమయంలో హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి రేటు రూ.110,800గా ఉంది. బెంగళూరు, ముంబై, పూణే, లక్నో, సూరత్, పాట్నా, అయోధ్య వంటి ప్రాంతాల్లో కూడా కిలో వెండి ధర రూ.99,800గా ఉంది. పాండిచ్చేరి, చెన్నై, మధురై, త్రివేంద్రం ప్రాంతాల్లో మాత్రం వెండి రేట్లు రూ.110,800 స్థాయిలో ఉన్నాయి.

**అంతర్జాతీయ ధరలు**

రాయిటర్స్ నివేదిక ప్రకారం స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు %వి%3,300.59 వద్ద 0.5% తగ్గింది. ఈ వారంలో బంగారం ధర 1.7% తగ్గిపోయింది. ఇదే సమయంలో అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ ధర 0.5% తగ్గి %వి%3,298.30 స్థాయిలో ఉంది. స్పాట్ వెండి ధర 0.8% తగ్గి ఔన్స్‌కు %వి%33.07 వద్ద ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్లోబల్ టారిఫ్‌ల కారణంగా డాలర్ విలువ మార్పులు చెందుతోంది. తాజాగా ట్రంప్ చైనా విషయంలో చేసిన వ్యాఖ్యలు కూడా మార్కెట్?పై ప్రభావం చూపించే అవకాశం ఉంది.

**బంగారం స్వచ్ఛమైనదా ఎలా తెలుసుకోవాలి**

బంగారం కొనుగోలు చేసేటప్పుడు దాని స్వచ్ఛత గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. భారతదేశంలో బంగారం స్వచ్ఛతను హాల్‌మార్క్ గుర్తుల ద్వారా గుర్తిస్తారు. ఈ గుర్తులు బంగారం నాణ్యతను తెలియజేస్తాయి. ఉదాహరణకు, 24 క్యారెట్ బంగారం 99.9% స్వచ్ఛమైనదని (999 హాల్‌మార్క్), 22 క్యారెట్‌లో 91.6% బంగారం, మిగిలినవి రాగి, వెండి వంటి లోహాలు (916 హాల్‌మార్క్).ఇలా 23 క్యారెట్ అని (958), 21 క్యారెట్ (875), 18 క్యారెట్ (750) గుర్తులతో సూచిస్తారు. 24 క్యారెట్ బంగారం అత్యంత స్వచ్ఛమైనది, కానీ మృదువుగా ఉండటం వల్ల ఆభరణాల తయారీకి తక్కువగా ఉపయోగిస్తారు. అందుకే 22 లేదా 18 క్యారెట్ బంగారం ఆభరణాలకు ఎక్కువగా ఎంచుకుంటారు. బంగారం కొనే ముందు హాల్‌మార్క్ గుర్తు ఉందో లేదో తప్పకుండా చెక్ చేయాలి. ఒకవేళ హాల్‌మార్క్ లేకపోతే, నమ్మకమైన జ్యూయలరీ షాప్‌లో స్వచ్ఛతను పరీక్షించుకోవాలి.

## 2024-25 జీడీపీ వృద్ధి 6.5 శాతం

న్యూఢిల్లీ-నవభూమి:గత ఆర్థిక సంవత్సరం (2024-25) నాలుగో త్రైమాసికం (క్యూ4)లో జీడీపీ వృద్ధి రేటు మార్కెట్ అంచనాలను మించి ఏడాది గరిష్ఠ స్థాయి 7.4 శాతానికి పెరిగింది. ప్రైవేట్ వినియోగం పుంజుకోవడంతో పాటు నిర్మాణం, తయారీ రంగాలు మంచి పనితీరును కనబర్చడం ఇందుకు దోహదపడింది. క్యూ4 వృద్ధి దన్నుతో 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి జీడీపీ వృద్ధి 6.5 శాతంగా నమోదైంది. ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి, 2023-24 వృద్ధి రేటు 9.2 శాతంతో పోలిస్తే బాగా తగ్గినప్పటికీ, ఈ ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం అంచనా వేసిన స్థాయిలోనే ఉంది. అంతేకాదు, చైనాతో పోలిస్తే భారత్ మెరుగైన స్థితిలో ఉంది. ఈ జనవరి-మార్చిలో చైనా జీడీపీ వృద్ధి 5.4 శాతమే. వార్షిక, త్రైమాసిక వృద్ధిపరంగా ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. వరుసగా నాలుగేళ్లుగా భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లోకెల్లా అధిక వృద్ధిని నమోదు చేస్తోంది.గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం రూ.330.68 లక్షల కోట్లకు (3.9 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. తద్వారా ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో 6.3-6.8 శాతం వృద్ధి రేటుతో భారత్ జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశాలున్నాయి. మరికొన్నేళ్లలో భారత ఎకానమీ సైజు 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా.

వృద్ధి గణాంకాలు ఇలా..జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్ఓ) డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీడీపీ లేదా స్థిర (2011-12 నాటి) ధరల ఆధారిత జీడీపీ రూ.187.97 లక్షల కోట్లకు పెరిగిందని అంచనా. 2023-24 లో నమోదైన రూ.176.51 లక్షల కోట్ల జీడీపీతో పోలిస్తే 6.5 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, 2024-25లో నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ రూ.330.68 లక్షల కోట్లకు ఎగబాకింది. 2023-24లో నమోదైన రూ.301.23 లక్షల కోట్ల నామినల్ జీడీపీతో పోలిస్తే 9.8 శాతం వృద్ధి చెందింది. 2024-25 క్యూ4 విషయానికొస్తే, వాస్తవ జీడీపీ లేదా స్థిర ధరల ఆధారిత జీడీపీ వార్షిక ప్రాతిపదికన 7.4 శాతం వృద్ధితో రూ.51.35 లక్షల కోట్లకు చేరగా.. నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ 10.8 శాతం వృద్ధితో రూ.88.18 లక్షల కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీవీఏ (జోడించిన స్థూల విలువ)ను ఎన్ఎస్ఓ రూ.171.87 లక్షల కోట్లుగా అంచనా వేసింది. 2023-24లో ఈ అంచనా రూ.161.51 లక్షల కోట్లుగా ఉంది.2024-25 నామినల్ జీవీఏను రూ.300.22 లక్షల కోట్లుగా అంచనా వేసింది. 2023-24లో ఇది రూ.274.13 లక్షల కోట్లుగా ఉంది. కాగా, ఈ జూన్‌తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికం (క్యూ1) జీడీపీ వృద్ధి గణాంకాలను ఎన్ఎస్ఓ ఈ ఆగస్టు 29న విడుదల చేయనుంది.

**తలసరి ఆదాయం రూ.1,14,710**

నికర జాతీయ ఆదాయం ప్రకారంగా, గత ఆర్థిక సంవత్సరంలో దేశ ప్రజల తలసరి ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.4 శాతం పెరిగి రూ.1,14,710కి చేరింది. 2023-24లో ఇది రూ.1,08,786గా ఉంది. కాగా, 2024-25లో నికర జాతీయ ఆదాయం రూ.1,61,51,199 కోట్లుగా నమోదైంది.గత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును జీడీపీలో 4.8 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం సాధించింది.

# ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారా?



న్యూఢిల్లీ-నవభూమి: దేశీయ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన ఐడీబీఐ బ్యాంక్ మరోసారి కీలక ప్రకటన చేసింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను సవరించింది. సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్, స్పెషల్ ఉత్సవ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకంతో పాటుగా రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను మార్చింది. సవరించిన కొత్త వడ్డీ రేట్లను మే 16, 2025 నుంచే అమలులోకి తీసుకొచ్చింది. అయితే, ఇప్పుడు ఈ బ్యాంకులో ఎఫ్‌డీ చేయాలనుకునే వారు ఏ టెన్యూర్‌పై అధిక వడ్డీ వస్తుంది? ఎందులో చేస్తే ఎక్కువ లాభం? అనే విషయాలను తెలుసుకోవడం ద్వారా అధిక ప్రయోజనం పొందవచ్చు.

**ఐడీబీఐ బ్యాంక్ ఉత్సవ్ ఫిక్స్‌డ్ డిపాజిట్**

ఐడీబీఐ బ్యాంక్ ఉత్సవ్ ఎఫ్‌డీ పేరుతో ప్రత్యేక డిపాజిట్ పథకాలను అందిస్తోంది. వివిధ టెన్యూర్ల ద్వారా అధిక వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తోంది. ప్రస్తుతం 444, 555, 700 రోజుల టెన్యూర్ల ద్వారా డిపాజిట్లు అందిస్తోంది. ప్రస్తుతం 444 రోజుల మెచ్యూరిటీ కాలవ్యవధి ద్వారా జనరల్ కస్టమర్లకు 7.10 శాతం వడ్డీ ఇస్తోంది. సీనియర్ సిటిజన్లకు 7.60 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఇక 555 రోజుల ప్రత్యేక టెన్యూర్‌పై జనరల్ కస్టమర్లకు 7.15 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.65 శాతం వడ్డీ ఇస్తోంది. ఇక 700 రోజుల టన్యూర్ డిపాజిట్ పథకం ద్వారా జనరల్ కస్టమర్లకు 7 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.50 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఈ వడ్డీ రేట్లు జూన్ 30, 2025 వరకు అమలులో ఉంటాయని బ్యాంక్ తెలిపింది. గతంలో ఉత్సవ్ ఎఫ్‌డీ 300 రోజులు, 375 రోజుల టెన్యూర్ డిపాజిట్ పథకాలు ఉండగా ఏప్రిల్ 16, 2025 నుంచి నిలిపేశారు. అలాగే అంతకు ముందు 444 రోజుల స్కీమ్ ద్వారా జనరల్ కస్టమర్లకు 7.25 శాతం వడ్డీ వచ్చేసది. 555 రోజుల స్కీమ్ ద్వారా 7.30 శాతం వడ్డీ ఇచ్చేవారు. కానీ ఇప్పుడు తగ్గించేశారు. మరోవైపు.. ఐడీబీఐ బ్యాంకులో రూ. 3 కోట్ల లోపు ఉండే రిటైల్ టర్మ్ డిపాజిట్లపై 7 రోజుల నుంచి 10 సంవత్సరాల కాల వ్యవధి గల డిపాజిట్లపై జనరల్ కస్టమర్లకు వడ్డీ రేట్లు 3 శాతం నుంచి 7 శాతం వరకు వడ్డీ ఇస్తోంది. ఇక సీనియర్ సిటిజన్లకు 3.50 శాతం నుంచి 7.50 శాతం వరకు వడ్డీ ఇస్తోంది. సవరించిన వడ్డీ రేట్లు మే 16, 2025 నుంచే అమలులోకి తీసుకొచ్చింది.

## ప్రతిష్టాత్మక వరల్డ్ విస్కీస్ అవార్డ్స్ 2025లో గోల్డ్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న బకార్డి తొలి మేడ్-ఇన్-ఇండియా విస్కీ లెగసీ




న్యూఢిల్లీ-నవభూమి:ఇండియా , 30 మే, 2025: బకార్డి యొక్క మొట్టమొదటి మేడ్-ఇన్-ఇండియా ప్రీమియం విస్కీ అయిన లెగసి , ప్రతిష్టాత్మక వరల్డ్ విస్కీస్ అవార్డ్స్ 2025లో బ్లెండెడ్ విస్కీ విభాగంలో గోల్డ్‌ని అందుకుంది. ఈ గుర్తింపుతో , ప్రపంచ గుర్తింపును పొందిన భారతదేశం యొక్క సరికొత్త ప్రీమియం వ్యక్తీకరణగా లెగసి మారింది. సొగసైన, సమకాలీనమైన , నైపుణ్యంతో రూపొందించబడిన లెగసి కేవలం ఒక కొత్త విస్కీ కాదు - ఇది ఆధునిక భారతీయ అధునాతనత మరియు ప్రపంచ ఆకాంక్షను ప్రతిబింబించే జీవనశైలి ప్రకటన.భారత దేశంలో రాజీలేని నాణ్యతతో రూపొందించ బడిన లెగసి , భారతీయ మరియు స్కాటిష్ మాల్ట్‌ల యొక్క విలక్షణమైన మిశ్రమం. ఈ అవార్డులు లెగసిని ప్రపంచ పటంలో ఉంచడమే కాకుండా, ప్రీమియం విస్కీ తయారీ ప్రపంచంలో బకార్డి యొక్క ప్రభావాన్ని కూడా నొక్కి చెబుతున్నాయి.మూడు సంవత్సరాల కిందట విడుదల చేయబడిన లెగసి , ప్రీమియం విస్కీ విభాగంలో ముందంజలో వుంది. ప్రపంచ విస్కీ అవార్డులు స్పిరిట్స్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డులలో ఒకటి. ఈ ప్లాట్‌ఫామ్‌లో గోల్డ్ అవార్డు అనేది శ్రేష్ఠతకు నిజమైన నిదర్శనం. ఈ విజయం ది డ్రింక్స్ బిజినెస్ ఆసియా నిర్వహించిన ఆసియా స్పిరిట్స్ మాస్టర్స్ 2025లో రజతం ద్వారా సమున్నతం చేయబడింది. "వరల్డ్ విస్కీస్ అవార్డ్స్ 2025లో లెగసి బంగారు పతకం ఆసియా స్పిరిట్స్ మాస్టర్స్ 2025లో రజతం గెలుచుకోవడం పట్ల మేము చాలా సంతోషంగా వున్నాము. ఈ గుర్తింపు భారతీయ వారసత్వంలో ధైర్యంగా, విలక్షణంగా లోతుగా పాతుకుపోయిన ప్రపంచ స్థాయి స్పిరిట్‌లను రూపొందించడంలో మా నిబద్ధతకు శక్తివంతమైన ధృవీకరణ" అని అన్నారు. లెగసి ఇప్పుడు హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, జార?ండ్, మేఘాలయ, అస్సాం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, కేరళ, పాండిచ్చేరి మరియు గోవా వంటి కీలక మార్కెట్లలో 3 పరిమాణాలలో (750%ml, 375ml%, మరియు 180%ml%) అందుబాటులో ఉంది.

## కేంద్రం కీలక నిర్ణయం.. తగ్గనున్న వంటనూనెల ధరలు



న్యూఢిల్లీ-నవభూమి:వంట నూనెల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులకు గుడ్ న్యూస్ వచ్చేసింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం క్రూడ్ వంట నూనెలపై దిగుమతి సుంకాలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. క్రూడ్ పామ్ ఆయిల్, క్రూడ్ సోయాబీన్ ఆయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌లపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయం మే 31 శనివారం నుంచి అమల్లోకి వచ్చిందని ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా తెలిపారు. ఈ నిర్ణయం దేశీయ రిఫైనింగ్ పరిశ్రమలకు మద్దతుగా నిలుస్తోంది. ఇది వినియోగదారులకు కూడా ఊరటనిచ్చే అంశమని చెప్పుకోవచ్చు.

**ధరల తగ్గింపునకు అవకాశం**

ఈ కస్టమ్స్ డ్యూటీ తగ్గింపుతో పాటు ఇతర ఛార్జీలను కలిపిన తరువాత, ఇప్పుడు ఈ క్రూడ్ నూనెలపై దిగుమతి సుంకం 27.5 శాతం నుంచి 16.5 శాతానికి పడిపోయింది. అయితే, రిఫైన్డ్ ఆయిల్స్‌పై ఉన్న 35.75 శాతం సుంకంలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. భారతదేశం దాదాపు 50 శాతం ఆహార నూనెల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడింది. గతంలో దిగుమతి సుంకాలు పెంచినప్పుడు మార్కెట్‌లో నూనెల ధరలు పెరిగాయి. ఇప్పుడు సుంకాలను తగ్గించడం వల్ల వినియోగదారులకు వంట నూనెల రేట్లు తగ్గే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

**దేశీయ పరిశ్రమలకు..**

ఇది దేశీయ రిఫైనింగ్ పరిశ్రమలకు ఊతమిచ్చే నిర్ణయమని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (%ాజుూ%) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వి. మెహతా అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి దోహదపడే చర్య అని పేర్కొన్నారు. భారతదేశం పామ్ ఆయిల్‌ను ముఖ్యంగా మలేషియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఈ క్రూడ్ ఆయిల్స్‌పై సుంకం తగ్గిన తరువాత, స్థానికంగా రిఫైన్ చేసి వినియోగానికి అందించగలిగితే, విదేశీ ఆధారాన్ని తగ్గించుకోవచ్చు.


**వెజిటెబుల్ ఆయిల్**

క్రూడ్ ఫైన్డ్ ఆయిల్స్ మధ్య దిగుమతి సుంకం తేడా 19.25 శాతానికి పెరగడం ఎంతో సంతోషకరమని ఇండియన్ వెజిటెబుల్ ఆయిల్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (%×ఖూా%) అధ్యక్షుడు సుధాకర్ దేశాయ్ అన్నారు. ఇది మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి బలమవుతుందని అభిప్రాయపడ్డారు. రెండు రకాల నూనెల మధ్య సుంకంలో తేడా పెరగడం వల్ల, రిఫైన్డ్ ఆయిల్స్‌కు దోహదపడే విదేశీ దిగుమతుల పట్ల ఆకర్షణ తగ్గి, దేశీయంగా క్రూడ్ ఆయిల్స్‌ను ప్రాసెస్ చేసి వినియోగించడానికి అవకాశం పెరుగుతుందన్నారు.

**గతంలో జరిగిన మార్పులు**

గత సంవత్సరం సెప్టెంబర్ 14న కేంద్రం క్రూడ్ ఆయిల్స్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 0 శాతం నుంచి 20 శాతానికి పెంచింది. అదే సమయంలో రిఫైన్డ్ ఆయిల్స్‌పై డ్యూటీని 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెంచింది. దీని ఫలితంగా, తక్కువ ధరకే లభించే రిఫైన్డ్ ఆయిల్స్ దిగుమతులు ఊపందుకున్నాయి. కానీ ఇప్పుడు తిరిగి క్రూడ్ ఆయిల్స్‌పై డ్యూటీ తగ్గించడంతో పరిస్థితి మారనుంది.

## ప్రపంచాన్నే తన మాయలో పడేసిన బొమ్మ



న్యూఢిల్లీ-నవభూమి: కేవలం 24 గంటల వ్యవధిలో ఒక కంపెనీ సీఈఓ సంపద వేల కోట్ల రూపాయలు పెరిగింది అంటే మీరు నమ్మగలరా? అదేదో దిగ్గజ కంపెనీ అయితే కాదు. అంబానీ, అదానీ, మస్క్, జుకర్‌బర్గ్ అంతకన్నా కాదు. కానీ ఇది అక్షరాలా నిజం. చైనీస్ బొమ్మల కంపెనీ పాప్ మార్ట్ ఇంటర్నేషనల్ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అండ్ సీఈఓ వాంగ్ నింగ్ రాత్రికి రాత్రే.. తన సంపదను అద్భుతంగా ఊహించని రీతిలో పెంచుకున్నారు. దీనికి కారణం ప్రపంచాన్ని తన మాయలో పడేసిన చిన్న బొమ్మ 'లబుబు' ఈ లబుబు బొమ్మల ప్రపంచవ్యాప్త పాపులారిటీతో, వాంగ్ నింగ్ (38) సంపద ఒక్కరోజులో 1.6 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 13,300 కోట్లు) పెరిగిందని ఫోర్బ్స్ నివేదించింది. ఇది నిజంగా ఒక అద్భుతమైన విజయం, వాంగ్ నింగ్ విజనరీ నాయకత్వానికి నిదర్శనం!

**లబుబు: ఎక్కడి నుండి వచ్చిందీ బొమ్మ?**

లబుబు, హాంగ్‌కాంగ్‌కు చెందిన కళాకారుడు కాసింగ్ లంగ్ రూపొందించిన ఒక విలక్షణమైన పాత్ర. ఇది మొదట 2015లో ఆయన రాసిన "ది మాన్‌స్టర్స్" అనే పిక్చర్ బుక్ సిరీస్ నుంచి పుట్టుకొచ్చింది. ఈ బొమ్మకు ప్రత్యేకమైన కుందేలు చెవులు, అల్లరి చిరునవ్వు, ఇంకా టెడ్డీల్లా బూరు రూపం కలిగి ఉంటాయి. మొదట కేవలం కొంతమందికే తెలిసిన డిజైనర్ బొమ్మగా ఉన్న లబుబు, 2019లో లంగ్.. పాప్ మార్ట్‌తో భాగస్వామ్యం చేసుకున్న తర్వాత భారీ ప్రజాదరణ పొందింది. ఆ తర్వాత దీనికి వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు.

**'బ్లైండ్ బాక్స్'ల మాయాజాలం:**

ఈ బొమ్మలను "బ్లైండ్ బాక్స్‌ల"లో అమ్ముతారు. ఈ మార్కెటింగ్ వ్యూహంలో కస్టమర్‌లు సీల్ చేసిన ప్యాకేజీలను కొనుగోలు చేస్తారు, లోపల ఏ బొమ్మ ఉందో వారికి తెలియదు. ఈ సస్పెన్స్ ఇంకా సర్ ప్రైజ్ అనేది విపరీతంగా కొనుగోళ్లు జరిగేందుకు దోహదం చేసింది. తమకు కావాల్సిన బొమ్మ కోసం, లేదా సేకరణ కోసం మళ్లీ మళ్లీ కొనేలా ప్రోత్సహించింది. 2024లో, లబుబు పాప్ మార్ట్ ఆదాయానికి సుమారు 400 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 3,300 కోట్లు) అందించింది. ఇది కంపెనీ ఆర్థిక విజయానికి లబుబు ఎంతగా దోహదపడిందో స్పష్టం చేస్తుంది.

**లబుబు క్రేజ్.. కొన్ని సమస్యలు కూడా:** లబుబు క్రేజ్ కేవలం అమ్మకాలకే పరిమితం కాలేదు, కొన్ని వివాదాలకూ దారితీసింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో, ఈ బొమ్మలకు విపరీతమైన డిమాండ్ కారణంగా దుకాణాలలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. బొమ్మల కోసం పోటీ పడిన కస్టమర్ల మధ్య ఘర్షణలు కూడా జరిగాయి. భద్రతా ఆందోళనలను పరిష్కరించడానికి పాప్ మార్ట్.. యూకేలో చాలా చోట్ల లబుబు బొమ్మల దుకాణంలో అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ చర్యలు తీసుకున్నప్పటికీ, బొమ్మలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి, ఇంకా కంపెనీ జూన్‌లో తిరిగి దుకాణాల్లో అమ్మకాలను ప్రారంభించాలని యోచిస్తోంది.

**సెలబ్రిటీల మద్దతు..** సెలబ్రిటీల ప్రచారాలు లబుబు ప్రజాదరణను మరింత పెంచాయి. రిహానా, దువా లిపా, ఇంకా బ్లాక్‌పింక్ లిసా వంటి ప్రముఖులు తమ లగ్జరీ హ్యాండ్‌బ్యాగులకు లబుబు బొమ్మలను తగిలించుకొని కనిపించారు. ఇది లబుబును ఒక ఫ్యాషనబుల్ యాక్సెసరీగా మార్చింది. టిక్‌టాక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కూడా గణనీయమైన పాత్ర పోషించాయి, హ్యాష్‌ట్యాగ్‌తో 1.4 మిలియన్లకు పైగా పోస్ట్‌లు కనిపించాయి.

**పాప్ మార్ట్ సక్సెస్ సీక్రెట్..**

లబుబు బొమ్మతో.. ఈ కంపెనీ యాప్ యునైటెడ్ స్టేట్స్‌లో అత్యధికంగా డౌన్‌లోడ్ అయిన షాపింగ్ యాప్‌గా మారింది, ఇది బ్రాండ్ విస్తరిస్తున్న ఉనికిని ప్రతిబింబిస్తుంది. ఈ డిజిటల్ జోరు, బలమైన అమ్మకాలతో కలిపి, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని విపరీతంగా పెంచేసింది. ఇది వాంగ్ నింగ్ నికర విలువ గణనీయంగా పెరగడానికి దోహదపడింది.

హెనాన్ ప్రావిన్స్‌లో 1987లో జన్మించిన వాంగ్ నింగ్, 2009లో జెంగ్‌జౌ విశ్వవిద్యాలయం నుంచి అడ్వర్టైజింగ్‌లో డిగ్రీ పొందారు. ఆయన 2010లో పాప్ మార్ట్‌ను స్థాపించారు, బ్లైండ్ బాక్స్‌ల వంటి వినూత్న మార్కెటింగ్ వ్యూహాల ద్వారా సేకరించేటువంటి బొమ్మల అమ్మకాలపై దృష్టి సారించారు. కంపెనీ 2020లో హాంకాంగ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పబ్లిక్‌గా మారింది. ఇది దాని వృద్ధి పథంలో ఒక కీలక మైలురాయి.


ఏప్రిల్ 2025 నాటికి, ఫోర్బ్స్ ప్రకారం వాంగ్ నింగ్ నికర విలువ 18.7 బిలియన్ డాలర్లుగా ఉంది. ఒక చిన్న బొమ్మతో ప్రారంభమైన ఈ ప్రయాణం ఒక సీఈఓ సంపదను రాత్రికి రాత్రే అమాంతం పెంచడం నిజంగా ఆశ్చర్యకరం! మార్కెట్‌తో పాటు వినియోగదారుల మనస్తత్వం అర్థం చేసుకోవడం ద్వారా ఎంత పెద్ద విజయం సాధించవచ్చో లబుబు కథ మనకు నిరూపిస్తుంది.

## గోల్డ్ లోన్లు తీసుకునేవారికి ఊరట!




న్యూఢిల్లీ-నవభూమి:బంగారు రుణాలపై రిజర్వుబ్యాంక్ ప్రతిపాదించిన కొత్త మార్గదర్శకాలపై ఆర్థిక మంత్రిత్వ శాఖ పలు సూచనలు చేసింది. బంగారం తాకట్టుపై రూ.2 లక్షల లోపు తీసుకునే రుణ గ్రహీతలకు ఈ మార్గదర్శకాల నుంచి మినహాయింపు నివ్వాలని సూచించింది. సెంట్రల్ బ్యాంక్ రూపొందించిన ఈ మార్గదర్శకాలపై దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో చివరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా తమిళనాడుకు చెందిన అన్ని రాజకీయ పార్టీలు ఈ ముసాయిదా మార్గదర్శకాలు చిన్నస్థాయి రుణ గ్రహీతలకు రుణాలు తీసుకోవడం కష్టతరంకానున్నదని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన నేపథ్యంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ సూచన చేసింది.గత నెలలో ఆర్బీఐ పసిడి రుణాలపై ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో పసిడి తనఖా పెట్టుకొని ఇచ్చే రుణ విలువ, ఈ పసిడి విలువలో 75 శాతం కంటే మించరాదని పేర్కొంది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులకు రుణాలు లభించడం కష్టతరంకానున్నదని తమిళనాడు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ జారీ చేసిన ముసాయిదాను ఆర్థిక సేవల విభాగం పరిశీలించింది. చిన్న బంగారు రుణ గ్రహీతల అవసరాలపై ప్రభావం పడకుండా ఉండే కొత్త మార్గదర్శకాలను జారీ చేయాలని ఆర్బీఐకి సూచించింది.ఈ నూతన నిబంధనలు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. గత నెలలో జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలపై భారీగా అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీంతో సెంట్రల్ బ్యాంక్ ప్రత్యేక దృష్టి సారించింది. పలువురు రాజకీయ పార్టీలు, ఆర్థిక విశ్లేషకుల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన ఆర్బీఐ..తుది మార్గదర్శకాలను మార్చివేయాలనుకుంటున్నది.

## వాట్సాప్ స్టేటస్ కోసం నాలుగు సరికొత్త ఫీచర్లు




న్యూయార్కు-నవభూమి: ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం అధిక శాతం మంది ఉపయోగిస్తున్న ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్‌లలో వాట్సాప్‌మొదటి స్థానంలో ఉంది. ఈ యాప్‌ను ప్రస్తుతం ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా నిర్వహిస్తోంది. ఇప్పటికే ఎన్నో ఆకట్టుకునే ఫీచర్లను వాట్సాప్‌లో అందిస్తున్నారు. అనేక కొత్త ఫీచర్లను కూడా అందుబాటులోకి తెస్తున్నారు.ఇప్పటికే స్టేటస్‌కు పాటల్ని జోడించడం, నచ్చిన వ్యక్తులను 'మెన్షన్' చేసే సదుపాయం తీసుకొచ్చిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ త్వరలో మరో నాలుగు సరికొత్త స్టేటస్ ఫీచర్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ విషయాన్ని మెటా తన అధికారిక బ్లాగ్‌లో ప్రకటించింది. నచ్చిన లేఅవుట్, మోర్ విత్ మ్యూజిక్, ఫొటో స్టిక్కర్స్, యాడ్ యువర్స్.. ఈ నాలుగు స్టేటస్ ఫీచర్లను యూజర్లకు త్వరలో పరిచయం చేయనున్నట్లు వెల్లడించింది.

**కొత్త ఫీచర్లు ఇవే..**

వాట్సాప్ యాప్‌లోనే కొల్లేజ్ ను సృష్టించే సౌకర్యాన్ని అందిస్తోంది. నచ్చిన లేఅవుట్ తో కొల్లేజ్‌ను రూపొందించవచ్చు. ఎడిటింగ్ టూల్స్ సాయంతో స్టేటస్‌లను మరింత ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు. యూజర్లు గరిష్ఠంగా ఆరు ఫొటోలను ఎంచుకొని, వాటిని వివిధ లేఅవుట్‌లలో కొల్లేజ్‌గా రూపొందించుకోవచ్చు.

ఇక రెండోది.. వాట్సప్ స్టేటస్‌లకు మ్యూజిక్ యాడ్ చేసే సదుపాయాన్ని మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ తాజాగా తీసుకొచ్చింది. ఈ 'మోర్ విత్ మ్యూజిక్' ఫీచర్‌తో యూజర్లు ఒక పాటను నేరుగా వారి స్టేటస్‌గా పోస్ట్ చేయొచ్చు.

ఫొటోలను స్టిక్కర్లుగా మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. దీని సాయంతో ఫొటోను స్టిక్కర్‌గా మార్చేసి స్టేటస్‌లో పోస్ట్ చేయొచ్చు. మీకు నచ్చిన విధంగా స్టైలింగ్ చేస్తూ ప్రత్యేకతను చాటొచ్చు.ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌ల్లో ఇప్పటికే విజయవంతమైన ఇంటరాక్టివ్ టూల్ 'యాడ్ యువర్స్' ఫీచర్ త్వరలో వాట్సప్‌లోకి వచ్చేస్తోంది. దీనివల్ల యూజర్లు తమ ఫ్రెండ్స్‌ను స్టేటస్ సంభాషణలో చేర్చొచ్చు. ఈ కొత్త ఫీచర్లతో వాట్సప్ స్టేటస్ మరింత ఆకర్షణీయంగా మారనుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ ఆదివారం 01 । జూన్ । 2025



# శ్రీలంక పోయిన దానిని మాత్రం నిర్లక్ష్యం చేయని అనసూయ

అందాల ముద్దుగుమ్మ అనసూయ ప్రస్తుతం శ్రీలంకలో బిజీబిజీగా గడుపుతుంది.అనసూయ ఇటీవల కొత్త ఇంట్లోకి గృహప్రవేశం చేసింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన విలాసవంతమైన ఇంటిలో అడుగుపెట్టింది. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేసాయి. ఇక గృహ ప్రవేశం తర్వాత అనసూయ శ్రీలంక టూర్‌కి వెళ్లింది. ఫ్యామిలీతో అక్కడికి వెళ్లిన అనసూయ అక్కడి అందాలని తన ఫాలోవర్స్‌కి కూడా చూపిస్తూ రచ్చ చేస్తుంది. రీసెంట్‌గా బికినీ ట్రీట్ కూడా ఇచ్చింది. స్విమ్మింగ్ పూల్‌లో జలకాలు ఆడుతూ అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది అనసూయ.అయితే విహార యాత్రకి వెళ్లిన కూడా అనసూయ వర్కవుట్ మాత్రం ఆపడం లేదు%ఞ%టూర్ టూరే, వర్క్ అవుట్లు వర్క్ అవుట్లే అన్నట్టు ఉంది ఆవిడ పరిస్థితి. శ్రీలంక వెళ్లిన జిమ్ లో కసరత్తులు చేస్తూనే ఉంది ఈ ముద్దుగుమ్మ. సెల్ఫ్ కేర్ మీద కాన్సెంట్రేట్ చేసినట్టు చెప్పుకొచ్చిన అనసూయ కొన్ని పిక్స్ షేర్ చేసింది. ఇక కుటుంబంతో కలిసి షాపింగ్ కూడా చేశారు అనసూయ. భర్త పిల్లలతో కలిసి శ్రీలంకలో కొన్ని వస్తువులు కొన్నారు. ఏది ఏమైన అనసూయ శ్రీలంక టూర్‌ని బిజీ బిజీగా గడిపేస్తుంది. ఆక ఆమె టూర్ ఫొటోలు ఫ్యాన్స్‌కి ఫుల్ కిక్కిస్తున్నాయి.ఇక అనసూయ కెరీర్ విషయానికి వస్తే.. న్యూస్ రీడర్‌గా కెరీర్ మొదలుపెట్టిన అనసూయకు జబర్దస్త్ మంచి క్రేజ్‌ను సంపాదించి పెట్టింది. జబర్దస్త్ ద్వారా వచ్చిన ఫేమ్‌తో సినిమాల్లో కూడా అవకాశాలు అందుకుంది ఈ బ్యూటీ. క్షణం, రంగస్థలం,కథనం, విమానం , పుష్ప, కిలాడి మొదలగు సూపర్ హిట్ సినిమాల్లో నటించి మంచి గుర్తింపు దక్కించుకుంది.



# నటిగా ఎంట్రీ ఇస్తోన్న సింగర్ అదితి భావరాజు



లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌ను స్థాపించి తొలి చిత్రం 'కలర్ ఫోటో'తో అందరి దృష్టిని ఆకర్షించిన డైనమిక్ ప్రొడ్యూసర్ రవీంద్ర బెనర్జీ ముప్పనేని.. ఆ తర్వాత 'బెదురులంక 2012' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. నిర్మిస్తోన్న మరో చిత్రం 'దండోరా' . ఈ చిత్రానికి మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ తెలంగాణ నేపథ్యంలో రూపొందు తోన్న'దండోరా'లో బలమైన ప్రేమ కథాంశంతో పాటు కఠినమైన నిజాలను, సమాజంలో కొనసాగుతోన్న సామాజిక దుష్ప్రవర్తలను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య తదితరులు ప్రధాన పాత్రల్లో మెప్పించనున్నారు. ఇప్పుడు టాలెంటెడ్ సింగర్ అదితి భావరాజు నటిగా ఈ చిత్రంతో సిల్వర్ స్క్రీన్‌పై ఎంట్రీ ఇస్తున్నారు.ఎన్నో చార్ట్ బస్టర్ సాంగ్స్‌ను ఆలపించిన అదితి..'దండోరా' చిత్రంలో నటనా ప్రతిభను ప్రదర్శించనుంది. ఆమె ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో పలు కీలక షెడ్యూల్స్‌ను పూర్తి చేశారు. ఇటీవల విడుదలైన మూవీ ఫస్ట్ బీట్ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. దీంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. త్వరలో ఇతర విషయాలు తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు మార్క్ కె.రాబిన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రాఫర్‌గా, సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా, క్రాంతి ప్రియం ఆర్ట్ డైరెక్టర్‌గా, రేఖా బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

# ఇది దైవ నిర్ణయం.. నాన్న ఆశీర్వాదం



ఎన్టీఆర్ జాతీయ అవార్డ్‌ను ఆయన తనయుడు బాలకృష్ణకు అందించనున్నట్లు అవార్డుల కమిటీ ప్రకటించింది. తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన అవార్డ్‌ను కొడుకు అందుకోవడం అరుదైన సంఘటనే. ఈ సందర్భంగా బాలకృష్ణ స్పందించారు. ఈ అవార్డ్‌ను అందుకోవడం అదృష్టంగా, దైవ నిర్ణయంగా, తండ్రి ఆశీర్వాదంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. 'ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు పూర్తి చేసుకున్న అద్భుతమైన ఘడియలు ఒక వైపు, ఎన్టీఆర్ నట ప్రస్థాన 75 వసంతాల అమృతోత్సవాలు జరుగుతున్న శుభ ఘడియలు మరో వైపు, నటుడిగా నేను 50 ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న శుభ సందర్భం ఇంకో వైపు, కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పద్మ భూషణ్‌తో సత్కరించిన తరుణంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాకు 'ఎన్టీఆర్ జాతీయ అవార్డ్' ప్రకటించడం నా అదృష్టం, దైవ నిర్ణయం, నాన్న ఆశీర్వాదంగా భావిస్తున్నాను. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి నన్ను ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, జ్యూరీ సభ్యులకు నా కృతజ్ఞతలు' అని ఓ ప్రకటనలో బాలకృష్ణ పేర్కొన్నారు

# వామికా నుంచి వరుస సినిమాలు



సుధీర్ బాబు హీరోగా పదేళ్ల కిందట వచ్చిన భలే మంచి రోజు సినిమాలో హీరోయిన్ గా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన వామికా గబ్బి ఆ తర్వాత ఇక్కడ కనిపించలేదు. వామికా ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 20 ఏళ్లవుతుంది. కెరీర్ స్టార్టింగ్ లో జూనియర్ ఆర్టిస్టుగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేసిన వామికా ప్రస్తుతం బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తూ కెరీర్ లో ముందుకెళ్తుంది. రీసెంట్ గా కీర్తి సురేష్ నటించిన బేబీ జాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన వామికా గబ్బి ఆ సినిమాతో మంచి గుర్తింపే దక్కించు కుంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే వామికాకు ప్రస్తుతం ఆఫర్లు బాగానే వస్తున్నాయి. త్వరలోనే వామికా నుంచి వరుస సినిమాలు రానున్నాయి. భలే మంచి రోజు తర్వాత ప్రస్తుతం తెలుగులో అడివి శేష్ తో కలిసి జీ2 సినిమాలో నటిస్తోంది వామికా. తెలుగు, తమిళ, పంజాబీ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్న వామికా సినిమాలతో పాటూ వెబ్ సిరీస్‌ల్లో కూడా నటిస్తోంది. రీసెంట్ గా వామికా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని సంచలన వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కింది. ప్రస్తుతం పలు భాషల్లో బిజీగా ఉన్న వామికా 2019లో బాలీవుడ్ ను వదిలి వెళ్లిపోవాలని అనుకున్నట్టు కామెంట్ చేసి అందరినీ ఆశర్చపరిచింది. అయితే బాలీవుడ్ ను విడిచి వెళ్లాలనుకోవడానికి రీజన్ ను మాత్రం వామికా బయటపెట్టలేదు. దాంతో పాటూ తాను కేవలం లండన్ వెళ్లేందుకు మాత్రమే 83 అనే సినిమాలో చిన్న క్యారెక్టర్ లో నటించానని, ఆ ఎక్స్‌పీరియెన్స్ తనలో యాక్టింగ్ పట్ల ఇష్టాన్ని పెంచిందని వామికా వెల్లడించింది. కబీర్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కిన 83 సినిమాలో వామికా అన్ను లాల్ పాత్రలో కనిపించింది.

# శ్రీలీల బౌన్స్ బ్యాక్ అవుతుందా..?



ధమాకాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన శ్రీలీల ఆ సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ హీరో యిన్‌గా మారింది. అప్పటి నుంచి స్టార్ ఛాన్స్ లతో అదరగొట్టేస్తున్న అమ్మడు ప్రతి సినిమాతో తనను అభిమానిస్తున్న ఆడియన్స్‌ను సర్ ప్రైజ్ చేస్తూనే వస్తుంది. హీరోయిన్‌గా నటించడం అందరు చేస్తారు కానీ హీరోలతో ఈక్వల్ గా డ్యాన్స్ చేసే కథానాయికలు చాలా తక్కువ మంది ఉన్నారు. వారిలో శ్రీలీల పేరు బాగా వినిపిస్తుంది. స్టార్ ఛాన్స్ లు వచ్చాయి కానీ వాటి ఫలితాల వల్ల శ్రీలీల కాస్త వెనకపడింది. గుంటూరు కారం తర్వాత పెద్దగా అవకాశాలు అందుకోని శ్రీలీల నెక్స్ట్ సినిమాల విషయంలో కాస్త జాగ్రత్త వహిస్తుంది. ప్రస్తుతం అమ్మడు మాస్ మహారాజ్ రవితేజతో మాస్ జాతార సినిమా చేస్తుంది. ఈ సినిమాతో మరోసారి ధమాకాని మించిన హిట్ అందుకోవాలని చూస్తుంది అమ్మడు. ఇక నెక్స్ట్ బాలీవుడ్ లో కూడా అక్కడ యువ హీరో కార్తీక్ ఆర్యన్‌తో సినిమా చేస్తుంది అమ్మడు. ఆ సినిమా టీజర్‌తోనే బీ టౌన్ ఆడియన్స్ కి దగ్గరైంది శ్రీలీల. ఆషికి ఫ్రాంచైజీలో భాగంగా ఆషికి 3గా వస్తున్న ఈ సినిమా మీద శ్రీలీల కూడా చాలా హోప్స్ పెట్టుకుంది. ఐతే ఈ సినిమాలతో శ్రీలీల తిరిగి బౌన్స్ బ్యాక్ అవ్వాలని చూస్తుంది. తన యాక్టింగ్ టాలెంట్ తో ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల నెక్స్ట్ సినిమాలతో హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తుం ది. తెలుగు, హిందీలోనే కాదు తమిళ్ లో కూడా శ్రీలీల శివ కార్తికేయన్ తో పరాశక్తి సినిమాలో నటిస్తుంది. ఆ సినిమా మీద కూడా ఆడియన్స్‌లో మంచి బజ్ ఉంది. తప్పకుండా రాబోతున్న ఈ సినిమాలు శ్రీలీలకు మంచి క్రేజ్ తెచ్చేలా ఉన్నాయి. టాలీవుడ్ డాన్సింగ్ క్వీన్‌గా శ్రీలీల ఇప్పటికే టాప్ లీగ్‌లో ఉండగా ఇక నెక్స్ట్ సినిమాలు కూడా ఆమె కి హిట్ ఇచ్చి ఎంకరేజ్ చేస్తే తప్పకుండా మళ్లీ శ్రీలీల తిరిగి ఫాంలోకి వచ్చే అవకాశం ఉం టుంది. ఒకటి రెండు ఫ్లాపులు పడితే వెనక్కి తగ్గే టైపు తను కాదని ఇప్పటికే ప్రూవ్ చేసిన శ్రీలీల రాబోతున్న సిని మాల కు ఆమెకు అంత మంచిగా కలిసి రావాలని ఆమె ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# నన్ను మించిన నలుగురు నటులు దొరికితే సినిమాలు వదిలేస్తా : కమల్

తమిళంతో పాటు తెలుగు, హిందీ పరిశ్రమలో తన నటనతో లోకనాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్న కమల్ హాసన్ తన సినీ ప్రస్థానంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే జనరేషనలో అయిన తనను మించిన నలుగురు నటులు కనిపిస్తే.. తాను నటనకు వీడ్కోలు చెబుతానని ప్రకటించారు. 70 ఏండ్ల వయసున్న ఈ నటుడు ప్రస్తుతం ఉన్న కుర్ర హీరోలకు పోటీగా తన సినిమాలను విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. కమల్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం థగ్ లైఫ్. మణిరత్నం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. సింబు, త్రిష కృష్ణన్, అభిరామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 05న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొన్న కమల్ తన రిటైర్మెంట్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇంతకుముందే తనకు 'రిటైర్మెంట్ అంటే మరణంతో సమానం' అని చెప్పిన కమల్ తాజాగా మరోసారి ఆ విషయంపై మాట్లాడాడు.ఇప్పుడు ఉన్న జనరేషన్ లేదా వచ్చే జనరేషన్‌లో అయిన తనను మించిన నలుగురు నటులు కనిపిస్తే.. తాను సినిమాలు వదిలేస్తానని కమల్ చెప్పుకొచ్చాడు. కాగా ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



# నేషనల్ అవార్డు విన్నర్‌పై క్యాస్టింగ్ కౌచ్ ఆరోపణలు చేసిన 'రానానాయుడు' నటి



'సాక్రేడ్ గేమ్స్', 'డి కపుల్', 'రానా నాయుడు' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి సుర్వీన్ చావ్లా తాజాగా తన క్యాస్టింగ్ కౌచ్ అనుభవం గురించి సంచలన విషయాలు వెల్లడించారు. నేషనల్ అవార్డు విన్నర్ అయిన ఒక తమిళ దర్శకుడు తనను కమిట్‌మెంట్ అడిగి లైంగికంగా వేధించాడంటూ సుర్వీన్ చావ్లా ఆరోపిం చింది.రానా నాయుడు సీజన్ 2 రాబోతున్న సందర్భంగా ప్రమోషన్‌లో భాగంగా.. రీసెంట్‌గా ఒక ఇంటర్వ్యూలో పాల్గొంది సుర్వీన్. అయితే ఇందులో ప్రశ్నలు అడిగే వ్యక్తి కాస్టింగ్ కౌచ్ అనుభవాలు గురించి అడుగగా.. సుర్వీన్ చావ్లా మాట్లాడుతూ.. నేను ఒక తమిళ సినిమా ఆడిషన్ కోసం చెన్నై వెళ్ళాను. ఆ సినిమా దర్శకుడు ఒక నేషనల్ అవార్డు గ్రహీత. అయితే అతడు డైరెక్ట్‌గా అడగకుండా మధ్యవర్తి ద్వారా 'మీరు ఎంతవరకు కమిట్ మెంట్ ఇస్తారు?' అని అడిగాడు. ఆ సమయంలో నాకు షాక్ తగిలింది. నేను అలాంటి దానికి సిద్ధంగా లేను అని చెప్పానని వెల్లడించింది. అయితే ఆ దర్శకుడు ఎవరు అన్నది మాత్రం సుర్వీన్ వెల్లడించలేదు.

# నందినికి స్వర్ణం..సత్తాచాటిన తెలంగాణ అథ్లెట్



**గుమి(దక్షిణకొరియా)-నవభూమి:** ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ల పతక ప్రదర్శన అద్భుతంగా కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన వేర్వేరు ఈవెంట్లలో తెలంగాణ యువ అథ్లెట్ అగసర నందినితో పాటు హైజంపర్ పూజాసింగ్, లాంగ్‌డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్‌సింగ్ పసిడి పతకాలతో మెరిశారు. దీంతో ఇప్పటి వరకు భారత్ ఖాతాలో 8 స్వర్ణాలు, 7 రజతాలు, మూడు కాంస్య పతకాలు చేరాయి. మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో నందిని 4500 పాయింట్లతో అగ్రస్థానంలో స్వర్ణ పతకాన్ని సగర్వంగా ముద్దాడింది. లుయి జుంగ్యి (చైనా, 4210), కాయ్ జువాన్ చెన్(చైనీస్ తైపీ, 4193) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.ఏషియన్ అథ్లెటిక్స్ హెప్టాథ్లాన్‌లో స్వప్నా బర్మన్ (2017), సోమా బిశ్వాస్ (2005) తర్వాత స్వర్ణం గెలిచిన మూడో భారత అథ్లెట్‌గా నందిని అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఎస్సీ గురుకులంలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న నందిని అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా పతకాలు కొల్లగొడుతున్నది. పురుషుల 5000 మీటర్ల రేసును గుల్వీర్ 13:24:77సెకన్లలో పూర్తి చేసి పసిడి దక్కించుకున్నాడు. మహిళల హైజంప్‌లో పూజాసింగ్ 1.89మీటర్లతో స్వర్ణాన్ని ఒడిసిపట్టుకుంది.

# ఇంగ్లండ్ రికార్డు విజయం



**బర్మింగ్‌హామ్-నవభూమి:** ఇంగ్లండ్ క్రికెట్‌లో హ్యారీ బ్రూక్ కెప్టెన్సీ అరంగేట్రం అదిరిపోయింది. ఇంగ్లండ్ క్రికెట్‌కు కొత్త జోష్ తీసుకొస్తూ వెస్టిండీస్‌తో తొలి వన్డేలో పరుగుల వరద పారించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 238 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 400/8 భారీ స్కోరు సాధించింది. మొదటి ఏడుగురు బ్యాటర్లు 35 అంతకంటే పరుగులు నమోదు చేసి వన్డే క్రికెట్‌లో కొత్త రికార్డు నెలకొల్పారు. సొంతగడ్డపై తొలి మ్యాచ్ ఆడిన జాకబ్ బెతెల్(53 బంతుల్లో 82, 8ఫోర్లు, 5సిక్స్‌లు), డకెట్(48 బంతుల్లో 60, 6ఫోర్లు, సిక్స్), హ్యారీ బ్రూక్(58), రూట్(57) అర్ధసెంచరీలతో కదంతొక్కారు. పసలేని విండీస్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ పరుగులు కొల్లగొట్టారు. భారీ లక్ష్యఛేదనకు దిగిన విండీస్ 26.2 ఓవర్లలో 162 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ షాయి హోప్(25) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. సకీబ్ మహమూద్(3/32), ఓవర్టన్(3/22) ధాటికి విండీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఏ దశలోనూ ఇంగ్లండ్‌కు పోటీనివ్వలేకపోయింది. బెతెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# నెంబర్‌వన్‌ను చిత్తుచేసి..సెమీస్‌కు సాత్విక్ జోడీ




**సింగపూర్-నవభూమి:** డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి ఈ సీజన్‌లో తొలి టైటిల్ దిశగా ముందడుగు వేసింది. సింగపూర్ ఓపెన్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంక్ జోడీని చిత్తుచేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 27వ ర్యాంకరైన భారత ద్వయం 21-17, 21-15తో గో జీ ఫీ/నూర్ ఇజుద్దీన్ (మలేసియా)పై గెలుపొందింది. భారత జంట సెమీస్‌లో మలేసియాకే చెందిన మూడోసీడ్ ఆరోన్ చియా/సో వూయి యిక్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**